# భారత శక్తి®

Published from Hyderabad, Kadapa, Guntur, Kurnool, Khammam, Vijayawada & Warangal

సంపుటి - 20 | సంచిక - 136 | హైదరాబాద్ | సోమవారం 17-11-2025 | పేజీలు : 12 | వెల : 1.00



11లో

రామోజీరావు ఒక వ్యక్తి కాదు, శక్తిమంతమైన వ్యవస్థ: వెంకయ్యనాయుడు

## నేటి భారతం

- ఉగ్రవాదం అంటే ధైర్యం కాదు..
- భయాన్ని ఆయుధంగా మార్చుకున్న
- ఒక ఉన్మాదంతో కూడిన నిర్వేదం.
- ఒక బుల్లెట్ దేశాన్ని విరిచేయలేదు..
- కానీ గుండెల్లో ఉన్న ధైర్యం ఆ ఉగ్రవాదాన్ని జయిస్తుంది.
- శాంతి కోరుకునే ప్రజలపై దాడి చేయడం ధర్మయుద్ధం కాదు..
- ఉగ్రవాదం జరిగిన చోట మానవత్వం గాయపడుతుంది.
- నిజమైన శక్తి ప్రాణాలు తీసే బాంబుల్లో కాదు..
- ప్రాణాలు కాపాడే విలువల్లో ఉంటుంది.
- ఉగ్రవాదం సమాధానం కాదు..
- అది ప్రశ్నలకే తలుపులు మూసే చీకటి.
- గన్ పై నడిచే తత్వం ఎప్పుడూ ఓడిపోతుంది..
- మనసుపై నడిచే తత్వం ఎప్పుడూ గెలుస్తుంది.
- భయం పుట్టించడం ఉగ్రవాదం..
- భయాన్ని జయించడం దేశభక్తి..

- దోనాల శ్రీకాంత్ రెడ్డి..


11లో

## రామోజీ ఎక్సలెన్స్
# అవార్డుల కార్యక్రమం..

- ఈనాడు గ్రూప్ సంస్థల అధినేత రామోజీరావు జయంతి
- హైదరాబాద్‌లో రామోజీ ఎక్సలెన్స్ అవార్డుల ప్రదానం
- ఏడు రంగాల్లో విశిష్ట సేవలు అందించిన వారికి పురస్కారాలు
- హాజరైన ఉపరాష్ట్రపతి, కేంద్రమంత్రులు, తెలుగు రాష్ట్రాల సీఎంలు

## ఎర్రకోట పేలుడు..

ఘటనా స్థలంలో సైన్యం బుల్లెట్లు.. విచారణ ముమ్మరం

- ఘటనా స్థలంలో 9 ఎంఎం బుల్లెట్లు స్వాధీనం
- బుల్లెట్లు భద్రతా సిబ్బందివి కావని నిర్ధారణ
- రెండు కిలోల అమ్మోనియం నైట్రేట్ వాడినట్లు గుర్తింపు


11లో


11లో

## హైదరాబాద్ ఎన్టీఆర్ స్టేడియం వద్ద కాలిబూడిదైన ఎలక్ట్రిక్ కారు

- పార్కింగ్‌లో ఉన్న కారులో అకస్మాత్తుగా చెలరేగిన మంటలు
- ప్రమాదంలో మరో కారు పాక్షికంగా ధ్వంసం
- అరగంట శ్రమించి మంటలను అదుపులోకి తెచ్చిన ఫైర్ సిబ్బంది
- ఎలాంటి ప్రాణనష్టం జరగకపోవడంతో ఊపిరి పీల్చుకున్న అధికారులు
- ప్రమాద కారణాలపై పోలీసుల దర్యాప్తు ప్రారంభం

## ఇప్పుడు వాటి సరసన రామోజీ ఫిలింసిటీ కూడా చేరింది


11లో

- రామోజీరావు 89వ జయంతి సందర్భంగా ఎక్సలెన్స్ అవార్డుల ప్రదానం
- రామోజీ ఫిల్మ్ సిటీ తెలంగాణకు నాలుగో అద్భుతం అన్న సీఎం రేవంత్ రెడ్డి

## చాయ్‌వాలా ప్రధాని అయ్యాడంటే కారణం అదే: సీఎం



11లో

- రాజ్యాంగంపై సదస్సులో చంద్రబాబు కీలక వ్యాఖ్యలు
- ప్రధాని మోదీపై ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రశంసలు
- భారత్‌ను ప్రపంచంలో నంబర్ 1 చేయాలని మోదీ కృషి చేస్తున్నారు
- సీజేఐ జస్టిస్ గవాయ్ గొప్ప వ్యక్తి అని కొనియాడిన సీఎం
- సమాన ఓటు హక్కు అంబేద్కర్ ఇచ్చిన వరం అని వెల్లడి



## ఈ భయానక పరిస్థితిని దాటేదెలా..?

భారతదేశం సుసంపన్నమైన దేశం.. వేదాలను తన గుండెల్లో దాచుకున్న దేశం.. శాంతి సమరస్యాలను గౌరవించే దేశం.. ఆర్తులను అక్కున చేర్చుకునే దేశం.. సంప్రదాయాలకు పట్టం గట్టే దేశం.. ప్రపంచ పఠంలో సగర్వంగా తలెత్తుకుని, మువ్వన్నెల జెండాను రెప రెపలాడిస్తూ ఠీవిగా నిలుచున్న దేశం.. ముక్కోటి దేవతలు కొలువై ఉన్న పుణ్యభూమి భారతావని.. ఇప్పుడు టెర్రరిస్టులు అని చెప్పుకుంటున్న ఉగ్రమూకల దాడికి చిగురుటాకులా వణికి పోతోంది.. భరతమాతకు తలమానికమైన జమ్మూ కాశ్మీర్ పచ్చని నేలపై ఎప్పటి కప్పుడు ఎర్రటి రక్తం పారుతోంది.. అమాయకులైన ప్రజల ప్రాణాలు గాల్లో కలిసిపోతున్నాయి.. పక్షుల కిల కిలా రావాలతో అలరారుతున్న కాశ్మీర్ నేలపై బాంబుల మోతతో మారుమోగిపోతోంది.. మన పూర్వీక రాజకీయనాయకులు చేసిన ఒప్పొందాలతో, చేతగాని పనులతో, నిర్లక్ష్యధోరణితో మన భూభాగాలు కొన్ని విదేశీయుల ఆధీనంలోకి వెళ్లిపోవడం.. అలాగే బార్డర్ లో మనకు సంబంధించిన పవిత్రమైన నేలను వాళ్ళు ఆక్రమించడమో జరిగిపోయింది.. జమ్మూ కాశ్మీర్ అందుకు ఉదాహరణ.. అలాగే టిబెట్ భూభాగంలోకి వెళ్లిపోయిన కైలాస పర్వతం.. ఇవన్నీ తెలివిలేని అప్పటి నాయకుల తప్పిదాలే.. దాని ఫలితంగా ఇప్పుడు మనం అనుభవిస్తున్నాం.. పోరాటాలు చేస్తున్నాం.. రక్తం చిందిస్తున్నాం..



12లో

## తిరుమల శ్రీవారి సేవల
# ఫిబ్రవరి కోటా..

- 2026 ఫిబ్రవరి నెలకు సంబంధించిన శ్రీవారి దర్శన, సేవల కోటాను ప్రకటించిన టీటీడీ
- నవంబర్ 18న ఆర్జిత సేవల ఎలక్ట్రానిక్ డిప్ నమోదు ప్రక్రియ ప్రారంభం
- నవంబర్ 21న కల్యాణోత్సవం, ఊంజల్ సేవ, వర్చువల్ సేవల టికెట్ల విడుదల
- వృద్ధులు, దివ్యాంగుల కోసం ప్రత్యేక దర్శన టోకెన్లు 24న అందుబాటులోకి
- ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లు, గదుల కోటాను నవంబర్ 25న విడుదల చేయనున్న టీటీడీ
- అన్ని బుకింగ్‌లు టీటీడీ అధికారిక వెబ్‌సైట్ ద్వారానే చేసుకోవాలని స్పష్టీకరణ


11లో

# డ్రోన్ ట్యాక్సీలు...

కర్నూలు, నవంబర్ 16

ఏపీవాసులకు సీఎం చంద్రబాబు శుభవార్త వినిపించారు. ఏపీలో త్వరలోనే డ్రోన్ ట్యాక్సీలను అభివృద్ధి చేస్తామని ప్రకటించారు. విశాఖ సీఐఐ సదస్సులో మాట్లాడిన చంద్రబాబు.. డ్రోన్ ట్యాక్సీలపై కీలక వ్యాఖ్యలు చేశారు. మరోవైపు ఏపీలో డ్రోన్ సిటీ, స్పేస్ సిటీలకు వర్చువల్‌గా శంకుస్థాపన జరిగింది. కర్నూలు జిల్లా ఓర్వకల్లులో డ్రోన్ సిటీ.. తిరుపతి, సత్యసాయి జిల్లాలలో స్పేస్ సిటీలను అభివృద్ధి చేయనున్నారు. సీఎం చంద్రబాబు, కేంద్ర మంత్రి పీయూష్ గోయెల్ చేతుల మీదుగా ఈ కార్యక్రమం జరిగింది.విశాఖపట్నం వేదికగా జరుగుతున్న సీఐఐ భాగస్వామ్య సదస్సులో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కీలక ప్రకటన చేశారు. ఆంధ్రప్రదేశ్ నుంచి త్వరలోనే డ్రోన్ ట్యాక్సీలను ప్రారంభిస్తామని చంద్రబాబు ప్రకటించారు. ఏపీని పెట్టుబడులకు గేట్ వేగా తీర్చిదిద్దుతున్నామని అన్నారు. మరోవైపు సీఐఐ సదస్సుకు 72 దేశాల నుంచి 522 మంది ప్రతినిధులు హాజరయ్యారు. అలాగే 2,500 మంది పారిశ్రామికవేత్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడిన చంద్రబాబు.. ఏపీ ప్రభుత్వం టెక్నాలజీ రంగం అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తోందన్నారు. ఈ క్రమంలోనే ఏరో స్పే?స్, డ్రోన్, డిఫెన్స్ కారిడార్లను ఏర్పాటు చేస్తున్న సంగతిని చంద్రబాబు వివరించారు. మరోవైపు చంద్రబాబు ప్రకటన తర్వాత డ్రోన్ ట్యాక్సీ అంటే ఏమిటనే దానిపై చర్చ మొదలైందిడ్రోన్ ట్యాక్సీ అనేది ఓ ఎలక్ట్రిక్ ఎయిర్ క్రాఫ్ట్. ఇది రిమోటెడ్‌గా లేదంటే స్వయంగా పనిచేస్తుంది. డ్రోన్ ట్యాక్సీ సాయంతో ప్రయాణికులను, సరుకులను రవాణా చేస్తుంటారు. డ్రోన్ ట్యాక్సీనే ఎలక్ట్రిక్ వర్టికల్ టేకాఫ్ అండ్ ల్యాండింగ్ వెహికల్ అని పిలుస్తుంటారు. రవాణాకు వేగవంతమైన, సమర్థవంతమైన ప్రత్యామ్నాయాన్ని అందించేందుకు ప్రపంచంలోని పలు దేశాలు ఈ డ్రోన్ ట్యాక్సీలను అభివృద్ధి చేస్తున్నాయి. చైనా వంటి కొన్ని దేశాలలో ఇప్పటికే అందుబాటులో ఉన్నాయి.మరోవైపు డ్రోన్ టాక్సీలు హెలికాప్టర్ల మాదిరిగానే పనిచేస్తాయి. అయితే పైలెట్ సాయం లేకుండానే తక్కువ దూరం ప్రయాణాలకు ఇవి ఉపయోగపడుతుంటాయి. ప్రయాణికులకు ఒకచోట నుంచి మరోచోటకు వేగంగా తీసుకెళ్లటంలో డ్రోన్ ట్యాక్సీలు ఉపయోగపడుతున్నాయి. ఇవి అందుబాటులోకి వస్తే ట్రాఫిక్ కష్టాలకు కూడా చెక్



పెట్టొచ్చని అధికారులు చెప్తున్నారు.మరోవైపు ఏపీలో డ్రోన్ సిటీ, స్పేస్ సిటీలకు శుక్రవారం శంకుస్థాపన జరిగింది. విశాఖపట్నం సీఐఐ సదస్సు వేదికగా సీఎం నారా చంద్రబాబు నాయుడు. కేంద్రమంత్రి పీయూష్ గోయెల్ చేతుల మీదుగా వర్చువల్‌గా ఈ కార్యక్రమం జరిగింది. కర్నూలు జిల్లా ఓర్వకల్లులో డ్రోన్ సిటీని నిర్మించనున్నారు. మొత్తంగా 300 ఎకరాల్లో డ్రోన్ సిటీ నిర్మాణం జరగనుంది. ఓర్వకల్లు డ్రోన్ సిటీలో టెస్టింగ్- సర్టిఫికేషన్ సెంటర్లు ఏర్పాటుచేస్తారు.అలాగే 25 వేల మందికి ట్రైనింగ్ ఇచ్చేలా సౌకర్యాలు కల్పిస్తారు. ఇక తిరుపతి, శ్రీసత్యసాయి జిల్లాల్లో స్పేస్ సిటీ ఏర్పాటు చేయనున్నారు. స్పేస్ సిటీ వలన 10 సంవత్సరాలలో రూ.25వేల కోట్లు పెట్టుబడులు వస్తాయని అంచనా. అలాగే 35 వేల మందికి ఉపాధి లభిస్తుందని అధికారులు చెప్తున్నారు. ఈ డ్రోన్ సిటీ , స్పేస్ సిటీలకు కేంద్రం సహకరించాలని చంద్రబాబు కోరారు.

## ఎల్‌ఆర్‌ఎస్ కు జనవరి 23 వరకు గడువు

విజయవాడ, నవంబర్ 16

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం లేఔట్ క్రమబద్ధీకరణ పథకం (ఎల్ఆర్ఎస్) గడువును వచ్చే ఏడాది జనవరి 23 వరకు పొడిగించింది. అనధికారిక ప్లాట్లను క్రమబద్ధీకరించుకోవడానికి ఇది మంచి అవకాశం. 2025 జూన్ 30కి ముందు కొనుగోలు చేసిన ప్లాట్లకు ఈ పథకం వర్తిస్తుంది. ఇంటి స్థలాలకు ఓపెన్ స్పేస్ ఛార్జీలో 50% రాయితీ కూడా అందిస్తున్నారు. ఈలోపు అనధికారికంగా ఉన్న ప్లాట్లను క్రమబద్ధీకరించుకుంటే ఎలాంటి ఇబ్బందులు ఉండవు. ఎల్ఆర్ఎస్ ద్వారా అనధికార లేఔట్లలో స్థలాలు కొన్న వారికి మంచి అవకాశం వచ్చిందనే చెప్పాలి. కొంతమంది అమాయకంగా అనుమతులు లేని లేఔట్‌లలో స్థలాలు కొనుగోలు చేసి మోసపోతున్నారు. ఈఎంఐ ఆప్షన్, తక్కువ ధరకు వస్తుందని కొనుగోలు చేయడం వల్లే ఇలా జరుగుతోంది. వారికి కూడా ఎల్ఆర్ఎస్‌తో ఎంతో ఉపయోగం.ఇలా అనధికారిక లేఔట్‌లో స్థలాలు కొనుగోలుచేసేవారు ఎల్ఆర్ఎస్ వినియోగించుకోవచ్చు. ఏపీ ప్రభుత్వం 2025 జూన్ 30కి ముందు కొనుగోలు చేసిన ప్లాట్లను క్రమబద్ధీకరించుకోవడానికి అవకాశం కల్పించింది. వాస్తవానికి ఎల్ఆర్ఎస్ గడువు ఈ ఏడాది అక్టోబర్ 23 పూర్తౌంది.. కానీ మరోసారి 2026 జనవరి 23 వరకు పొడిగించింది. దీని కోసంఎల్‌టీపీ (లైసెన్స్డ్ టెక్నికల్ పర్సన్) ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తులు సమర్పించాల్సి ఉంటుంది. ప్రభుత్వం చెప్పిన పీనలైజేషన్, ఇతరత్రా ఛార్జీలు చెల్లించాల్సి ఉంటుంది.

స్థలం మీదే మీకు హక్కు ఉందని చూపించడానికి, 2025 జూన్ 30 లోపు రిజిస్ట్రేషన్ పత్రాలను తప్పనిసరిగా సమర్పించాలి. ఈ పత్రాలతో పాటు, మీ స్థలం ఎంత ఉందో, దాని చుట్టూ ఏమున్నాయో, పక్కనున్న రోడ్లు ఎంత వెడల్పు ఉన్నాయో తెలిపే సైట్ ప్లాన్‌ను కూడా జతచేయాలి. అంతేకాకుండా, సబ్‌రిజిస్ట్రార్ సంతకం చేసిన ఈసీ మరియు మార్కెట్ విలువ సర్టిఫికేట్ కూడా అవసరం. భూమిని ఒక అవసరం నుంచి మరో అవసరానికి మార్చినట్లు తెలిపే ల్యాండ్ యూజ్ కన్వెర్షన్ సర్టిఫికేట్ కూడా చూపించాలి. వీటితో పాటు, ఏదైనా నష్టం జరిగితే బాధ్యత



వహిస్తామని తెలిపే ఇండెమ్నిటీ బాండ్, రోడ్డు విస్తరణ కోసం చేసుకున్న ఒప్పంద పత్రం కూడా ఇవ్వాల్సి ఉంటుంది. ఈ పత్రాలన్నీ సమర్పించడం ద్వారా స్థలంపై మీ యాజమాన్యాన్ని ధృవీకరించుకోవచ్చు.ఒకవేళ ఎల్ఆర్ఎస్ కింద ఇంటి స్థలాలు క్రమబద్ధీకరించుకుంటే.. వారికి ప్రభుత్వం బంపరాఫర్ ప్రకటించింది. ఓపెన్ స్పేస్ ఛార్జిలో 50% రాయితీ ఇస్తోంది. ఖాళీ స్థలాలపై నిబంధనల ప్రకారం 14% ఛార్జీలు ఉంటే.. ప్రస్తుతం 7% చెల్లిస్తే సరిపోతుంది. ఈ దరఖాస్తులు భారీగా వస్తాయని అంచనా వేస్తున్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు ఉపయోగించుకోవాలని.. ప్రభుత్వం మరోసారి గడువు పెంచే అవకాశం లేదంటున్నారు. ఒకవేళ క్రమబద్ధీకరించుకోకపోతే ఇబ్బందులు ఎదురవుతాయంటున్నారు. అనధికారిక లేఔట్లలో నిర్మాణాలు చేపట్టాలంటే ప్రభుత్వం అనుమతి ఇవ్వదు. ఒకవేళ ఎవరైనా అనుమతి లేకుండా నిర్మాణాలు చేపట్టినా చట్టవిరుద్ధం.. వాటిని కూల్చేస్తారు. అమ్మకాలు, కొనుగోలుకు ఛాన్స్ లేకుండా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో నిషేధిత భూముల జాబితాలో చేర్చేస్తారు. అలాగే ఖాళీ స్థలాలకు వీఎల్‌టీ (వేకెంట్ ల్యాండ్ ట్యాక్స్) వేయరు. ఒకవేళ ఇల్లు నిర్మించుకోవాలనుకుంటే.. బ్యాంకుల నుంచి రుణాలు కూడా రావు. తాత్కాలిక నిర్మాణాలకు కూడా నంబర్లు ఇవ్వరు. మున్సిపాలిటీలు, కార్పొరేషన్లు ఆ లేఔట్లలో మౌలిక సదుపాయాలు కల్పించదు.

## సత్తా చాటిన విశాఖ పోర్టు

విశాఖపట్టణం, నవంబర్ 16

విశాఖ పోర్టు సత్తా చాటింది. స్వచ్ఛత కార్యక్రమాల్లో దేశంలోనే మొదటి స్థానంలో నిలిచింది. 2024 ఏడాదికి గానూ.. ఓడరేవులు, షిప్పింగ్, జలమార్గాల మంత్రి సర్బానంద సోనోవాల్ చేతుల మీదుగా అవార్డు అందుకుంది. విశాఖ పోర్టు అథారిటీ.. పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యమిస్తూ, మొక్కలు నాటడం, సఫాయి మిత్రసురక్ష వంటి కార్యక్రమాలను విజయవంతంగా అమలు చేసిందని పోర్టు చైర్మన్ ఎం అంగముత్తు తెలిపారు. గతేడాది మూడో స్థానంలో నిలిచిన విశాఖ పోర్టు.. ఈసారి మొదటి స్థానాన్ని కైవసం చేసుకుంది.విశాఖపట్నం పోర్టు సత్తా చాటింది. స్వచ్ఛ కార్యక్రమాల్లో విశాఖ పోర్టు అథారిటీ .. దేశంలోని పరిశ్రమల విభాగంలో మొదటి స్థానంలో నిలిచింది. దేశవ్యాప్తంగా ఉన్న మేజర్ పోర్టులతో పోటీపడీ మరీ తొలి స్థానంలో నిలిచింది. ముంబయిలో జరిగిన కార్యక్రమంలో ఓడరేవులు, షిప్పింగ్, జలమార్గాల మంత్రి సర్బానంద సోనోవాల్.. విశాఖ పోర్టు ఛైర్మన్ డాక్టర్ ఎం అంగముత్తుకు స్వచ్ఛత అవార్డు ప్రదానం చేశారు. కేంద్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టిన స్వచ్ఛత పఖ్వాడ అవార్డ్స్ కార్యక్రమంలో.. 2024 ఏడాదికి గానూ విశాఖ పోర్టుకు ఈ అవార్డు లభించింది.అవార్డు తీసుకున్న సందర్భందా ఎం అంగముత్తు మాట్లాడారు. పోర్టులో పర్యావరణ పరిరక్షణకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు తెలిపారు. కేంద్రం సూచించిన విధంగా మొక్కలు నాటించి, సఫాయి మిత్రసురక్ష వంటి కార్యక్రమాలను విజయవంతంగా అమలు చేశామని తెలిపారు. కాగా స్వచ్ఛత పఖ్వాడ అవార్డ్స్ 2023 ఎడిషన్‌లో.. విశాఖ పోర్టు జాతీయ స్థాయిలో మూడవ స్థానాన్ని దక్కించుకుందని తెలిపారు. ఈసారి ప్రధాన ఓడరేవులతో పోటీ పడి మొదటి స్థానాన్ని కైవసం చేసుకుందన్నారు. స్వచ్ఛత మిషన్ పట్ల వీపీఏ నిబద్ధతకు ఈ అవార్డు నిదర్శనం అని చెప్పారు. దాని వల్లే వీపీఏ.. 2024లో అగ్రస్థానానికి చేరుకుందన్నారు.ఈ స్వచ్ఛత



అవార్డు.. పర్యావరణ సంరక్షణ, స్థిరమైన ఓడరేవు కార్యకలాపాల్లో.. విశాఖ పోర్టు నాయకత్వాన్ని బలోపేతం చేసిందని అంగముత్తు పేర్కొన్నారు. ఉద్యోగులు, వ్యాపార భాగస్వాములు, పీపీపీ నిర్వాహకులు, కార్మిక సంఘాల నాయకుల సహాయ, సహకారాలతో ఇలాంటి లక్ష్యాలు సాధిస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో పోర్టు కార్యదర్శి టి వేణుగోపాల్, చీఫ్ ఇంజినీర్ ఎస్ఎస్ఆర్‌సీ మూర్తి, సీఎంఈ రాంప్రసాద్, సీఎంఓ డాక్టర్ ఎస్ ఉషాదేవి తదితరులు పాల్గొన్నారు.మరోవైపు, గతేడాది విశాఖపట్నం పోర్టు సరికొత్త రికార్డు సృష్టించింది. సరుకు రవాణాకు సంబంధించి 2024-25 ఆర్థిక సంవత్సరంలో.. 249 రోజులకు గానూ 55 మిలియన్ మెట్రిక్ టన్నుల సరుకు రవాణా చేసినట్లు ఎం అంగముత్తు తెలిపారు. 2023-24 ఆర్థిక సంవత్సరం మొత్తంలో 81.09 మిలియన్ మెట్రిక్ టన్నుల సరుకు విశాఖ పోర్టు ద్వారా రవాణా చేశామన్నారు. విశాఖపట్నం పోర్టు చరిత్రలో ఇదే ఇప్పటి వరకూ అత్యధికమని వెల్లడించరారు. అయితే ఈ క్రమంలోనే 2024-25 ఆర్థిక సంవత్సరంలో 90 మిలియన్ మెట్రిక్ టన్నుల సరుకు రవాణా చేయాలని విశాఖపట్నం పోర్టు లక్ష్యంగా పెట్టుకుంది. అయితే 2024-25 ఆర్థిక సంవత్సరం ముగిసే సరికి 82.62 టన్నుల సరుకు రవాణా చేసింది. గతేడాది కంటే ఇది 6 శాతం ఎక్కువ.

## దుమ్మురేపిన నవీన్

హైదరాబాద్, నవంబర్ 16

జూబ్లీహిల్స్ నియోజకవర్గం లో గతంలో నవీన్ యాదవ్ పోటీ చేశాడు.. అయినప్పటికీ అతడికి విజయం దక్కలేదు.. అయితే ఈసారి మాత్రం నవీన్ యాదవ్ విపరీతంగా కష్టపడ్డాడు. ఒకరకంగా తన శక్తిని మొత్తం కూడ తీసుకొని ప్రయత్నించాడు. రకరకాల ఇబ్బందులు ఎదురవుతున్నప్పటికీ.. తనమీద వ్యతిరేకంగా ప్రచారం జరుగుతున్నప్పటికీ ఏమాత్రం భయపడకుండా.. రేవంత్ రెడ్డి అండతో ముందుకు వెళ్లాడు. గతంలో ఎదురైన ఓటములకు సరైన సమాధానం చెబుతూ.. సాలిడ్ విక్టరీ సాధించాడు. వాస్తవానికి జూబ్లీహిల్స్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలవడం మామూలు విషయం కాదు. ఇది కేవలం ఒక ఉపఎన్నిక మాత్రమే కాదు.. గులాబీ పార్టీకి కాంగ్రెస్ పార్టీ తిరుగులేని సమాధానం చెప్పింది. రేవంత్ రెడ్డి స్టామినా ఏమిటో నిరూపించింది. ఇకపై మంత్రులు రేవంత్ రెడ్డి ముందు కాలర్ ఎగిరేసే అవకాశం ఉండదు. ముఖ్యంగా కొంతమంది మంత్రులు తల బిరుసుతనాన్ని ప్రదర్శించడానికి అవకాశం ఉండదు.నవీన్ యాదవ్ కు జూబ్లీహిల్స్ గెలుపు తిరుగులేని బూస్ట్ ఇచ్చింది. ఆయన



రాజకీయ జీవితానికి ఒకరకంగా మైలు రాయి లాగా నిలిచింది. తన తండ్రి చిన్న శ్రీశైలం యాదవ్ అందుకోలేని రాజకీయ ఘనతను అందించింది.. మాగంటి సునీత ఏదో ఆరోపిస్తోంది గాని.. నవీన్ యాదవ్ సాధించిన గెలుపు మామూలుది కాదు. ఆయన ఏ స్థాయిలో విజయం సాధించాడో.. ఏ స్థాయిలో జూబ్లీ హిల్స్ ఓటర్ల ప్రేమను పొందాడో సాధించిన ఓట్ల శాతం చెబుతోంది.జూబ్లీహిల్స్ నియోజకవర్గ చరిత్రలో హైయెస్ట్ ఓట్ల తేడాతో నవీన్ యాదవ్ గెలవడం ఒక రకంగా సంచలనం. ఈ నియోజకవర్గంలో ఇప్పటివరకు హైయెస్ట్ మెజారిటీ విష్ణువర్ధన్ రెడ్డి పేరు మీద ఉండేది. 2009లో జరిగిన ఎన్నికల్లో విష్ణువర్ధన్ రెడ్డి 21,741 ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు.. ఆయన రికార్డును చివరికి మాగంటి గోపీనాథ్ కూడా బద్దలు కొట్టలేకపోయారు. ఈ నియోజవర్గంలో హ్యాట్రిక్ ఎమ్మెల్యేగా గోపీనాథ్ రికార్డు సృష్టించారు.. 2014లో మాగంటి గోపీనాథ్ టిడిపి తరపున పోటీ చేసి విజయం సాధించారు. నాటి ఎన్నికల్లో ఆయన 9,242 ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు. 2018 ఎన్నికల్లో 16,004 ఓట్ల తేడాతో విజయం సాధించారు..గత ఎన్నికల్లో 16,338 ఓట్ల తేడాతో గెలుపును దక్కించుకున్నారు. ఇలా మూడుసార్లు తన మెజారిటీని పెంచుకుంటూ పోయారు.ఈ నియోజకవర్గంలో పోటీ చేసిన నవీన్ యాదవ్ ఓటములు ఎదుర్కొన్న నేపథ్యంలో.. ఆ బాధను మరిపించే విధంగా 2025 లో జరిగిన ఉప ఎన్నికల్లో జూబ్లీహిల్స్ ఓటర్లు నవీన్ యాదవ్ కు బంపర్ మెజారిటీ అందించారు. నవీన్ యాదవ్ తన సమీప ప్రత్యర్థి, భారత రాష్ట్ర సమితి అభ్యర్థి సునీత మీద ఏకంగా 24,729 ఓట్ల మెజారిటీ సాధించారు. నవీన్ యాదవ్ 98,988 ఓట్లు సాధించారు. 50.83 ఓట్ల శాతాన్ని సాధించారు. సునీత 74,259 ఓట్లు సాధించారు. 38.13 ఓట్ల శాతాన్ని సాధించారు. బిజెపి అభ్యర్థి లంకల దీపక్ రెడ్డి 17,061 ఓట్లు సాధించారు. 8.76 ఓట్ల శాతాన్ని సాధించారు.

==============

## భారత శక్తి

## కాంగ్రెస్ ఖేల్...ఖతం...

## బైబై... టాటా... గుడ్ బై... గయా

బిహార్ ఎన్నికల చిత్రం స్పష్టమైంది. 243 స్థానాల్లో 203 స్థానాలతో ఎన్డీఏ రికార్డు విజయం దిశగా దూసుకుపోయింది, మహాకూటమి ఖాతాలో 35 సీట్లు మాత్రమే వస్తున్నాయి. 2020తో పోలిస్తే ఎన్డీఏ 70కి పైగా సీట్లు సాధించగా, మహాకూటమికి అంతే నష్టం జరిగింది. కాంగ్రెస్ పరిస్థితి మరీ దారుణంగా ఉంది, కేవలం 4 సీట్లు మాత్రమే సాధించింది. కాంగ్రెస్ మరోసారి అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిపోయింది. అయితే ఇది కొత్తేమీ కాదు, 2014 నుంచి 2025 వరకు చూస్తే, ఇప్పుడు కాంగ్రెస్ ఓటమికి అలవాటు పడి ఉంటుంది.అయితే, గత 11 ఏళ్లలో కాంగ్రెస్ ఎన్ని ఎన్నికల్లో ఓడిపోయిందో, ఏయే రాష్ట్రాల్లో ఓడిపోయింది గత 11 ఏళ్లలో మూడుసార్లు లోక్‌సభ ఎన్నికలు జరిగాయి. లోక్‌సభ ఎన్నికలు ప్రతి 5 సంవత్సరాలకు ఒకసారి జరుగుతాయి. ఇది 11 సంవత్సరాల వ్యవధిలో మూడు పూర్తి సైకిల్స్‌ను కవర్ చేస్తుంది.మొదటి ఎన్నిక- 2014లో 16వ లోక్‌సభకు ఎన్నికలు జరిగాయి, అప్పుడు ఏప్రిల్ 7 నుంచి మే 12 వరకు 9 దశల్లో పోలింగ్ జరిగింది. మొత్తం 543 స్థానాలకు 8,251 మంది అభ్యర్థులు బరిలో నిలిచారు. 66.4 శాతం పోలింగ్ నమోదైంది, ఇది అప్పటి వరకు అత్యధికం. ఫలితాల్లో బీజేపీ 282 సీట్లు గెలుచుకుంది, ఇది 272 సీట్ల మెజారిటీ కంటే ఎక్కువ, అయితే కాంగ్రెస్ కేవలం 44 సీట్లు మాత్రమే గెలుచుకుంది. ఈ ఎన్నికల నుంచే కాంగ్రెస్ కేంద్రంలో అధికారం కోల్పోయింది.రెండో ఎన్నిక- 2019లో 17వ లోక్‌సభకు ఎన్నికలు జరిగాయి, అప్పుడు ఏప్రిల్ 11 నుంచి మే 19 వరకు 7 దశల్లో పోలింగ్ జరిగింది. ఇక్కడ కూడా 543 సీట్లు ఉన్నాయి. 67.4 శాతం పోలింగ్ జరిగింది. బీజేపీ 303 సీట్లు సాధించగా, కాంగ్రెస్ కేవలం 52 సీట్లు మాత్రమే గెలుచుకుంది.మూడో ఎన్నిక- 2024లో 18వ లోక్‌సభకు ఎన్నికలు జరిగాయి. ఏప్రిల్ 19 నుంచి జూన్ 1 వరకు 7 దశల్లో ఎన్నికలు జరిగాయి. 65.79% ఓటింగ్ జరిగింది. బీజేపీ 240 సీట్లు గెలుచుకోగా, ఎన్డీఏ మొత్తం 293 సీట్లు సాధించింది. నరేంద్ర మోదీ మూడోసారి ప్రధానమంత్రి అయ్యారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ 99 సీట్లు గెలుచుకుంది, ఇది 2014 తర్వాత అత్యుత్తమ ప్రదర్శన.ఈ ఎన్నికలు జాతీయ రాజకీయాలను బీజేపీ కేంద్రంగా మార్చాయి, ఇక్కడ నరేంద్ర మోదీ నేతృత్వంలోని ఎన్డీఏ బలమైన ప్రభుత్వాలను ఏర్పాటు చేసింది, దేశంలో కాంగ్రెస్ పార్టీ క్రమంగా కనుమరుగయ్యే పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఢిల్లీ స్థాయిలోనూ, క్షేత్ర స్థాయిలోనూ ఆ పార్టీ క్రమంగా పట్టు కోల్పోతుంది. ప్రతి రాష్ట్రంలో ప్రాంతీయ పార్టీలపైన ఆధారపడి ఉండటంతో హస్తం పార్టీకి ఈ దుస్థితి పట్టింది. అదే కర్ణాటక, తెలంగాణలో జాతీయ పార్టీగానే కాంగ్రెస్ పోటీ చేసి అధికారంలోకి వచ్చింది. కానీ మిగిలిన చోట్ల ప్రాంతీయ పార్టీలు ఇచ్చే సీట్లపైనే ఆధారపడి ఉండాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. 2004కు ముందు పరిస్థితులు ఏంటి? 2014 తర్వాత ఏంటి? అన్నది కాంగ్రెస్ పార్టీ పరిస్థితిని చూస్తేనే అర్థమవుతుంది. పదేళు దేశంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పటికీ దేశంలోని అన్ని రాష్ట్రాల్లో కాంగ్రెస్ పార్టీ క్షేత్ర స్థాయిలో బలాన్ని పెంచుకోలేకపోయింది.. నెహ్రూ కాలం నుంచి ఇందిరాగాంధీ, రాజీవ్ గాంధీ హయాంలోనూ ఉత్తర్ ప్రదేశ్ లో కాంగ్రెస్ కు మంచి పట్టు ఉండేది. పటిష్టమైన ఓటు బ్యాంకు ఉండేది. కానీ రాను రాను రాహుల్ గాంధీ జమానాకు వచ్చే సరికి ఉత్తర్ ప్రదేశ్, పశ్చిమ బెంగాల్, బీహార్, ఢిల్లీ, మహారాష్ట్ర, ఒడిశా వంటి రాష్ట్రాల్లో తమ పట్టును కోల్పోయింది. ఒకప్పుడు ఈ ఈ రాష్ట్రాల్లో కాంగ్రెస్ పిడికిలి బిగించి గెలిచేది. కానీ ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. బీజేపీని తట్టుకోవాలంటే ప్రాంతీయ పార్టీలతో కలసి వెళ్లాలని అనుకోవడమే ఆ పార్టీ తనకు తానే ఆత్మహత్య చేసుకునే పరిస్థితికి వచ్చింది. కేవలం రాజస్థాన్, మధ్య ప్రదేశ్, కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల్లో మాత్రమే ఒంటరిగా పోటీ చేస్తున్న కాంగ్రెస్ మిగిలిన రాష్ట్రాల్లో మాత్రం ప్రాంతీయ పార్టీల మద్దతు కోసం అర్రులు చాస్తుంది. బీహార్ లోనూ కాంగ్రెస్ పార్టీ ఆర్జేడీ బలపడటానికి పరోక్షంగా కారణమయింది. బలమైన కాంగ్రెస్ నేతలు విడిపోయి ప్రాంతీయ పార్టీలు పెట్టుకున్నారు. అది కూడా పార్టీకి ఇబ్బందిగా మారింది. మహారాష్ట్రలోనూ పొత్తులతోనే బరిలోకి దిగింది. ఒకప్పుడు బలమైన నాయకత్వం రాష్ట్రాల్లో ఉండేది. కానీ రానురాను రాష్ట్రాల్లో లీడర్ షిప్ బలహీనంగా మారింది. బీహార్ లోనూ అదే జరిగింది. మహా ఘట్ బంధన్ పేరుతో కూటమి ఏర్పాటు చేసుకున్నప్పటికీ, రాహుల్ కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకూ పాదయాత్ర చేపట్టినప్పటికీ రాష్ట్రాల్లో బలహీనమవుతుంది. కాంగ్రెస్ బీహార్ లో సింగిల్ డిజిట్ కు పడిపోయినా ఆశ్చర్యం లేదు. ఎంఐఎం కంటే తక్కువ స్థానాల్లో లీడ్ లో ఉంది. అదీ నాలుగు అసెంబ్లీ నియోజకవర్గాల్లోనే అది మెజారిటీలో కనిపిస్తుంది. నిజానికి బీహార్ లో మోదీ, నితీష్ కుమార్ అంటే నమో కాంబినేషన్ బాగా వర్క్ అవుట్ అయింది. ఎన్డీఏ కూటమి ఇచ్చిన హామీలు కూడా బాగా పనిచేశాయి. నితీష్ కుమార్ కు ముఖ్యంగా మహిళల ఓట్లు అనుకూలంగా ఏకపక్షంగా పడినట్లు కనిపిస్తుంది. నితీష్ కుమార్ ప్రభుత్వం మద్యపాన నిషేధం అమలు చేయడంతో అనేక కుటుంబాలు ఆనందంగా ఉన్నాయి. అలాగే ఎన్నికల నోటిఫికేషన్ కు ముందు నితీష్ కుమార్ పది వేల రూపాయలు మహిళల ఖాతాల్లో జమ చేయడం కూడా కూటమికి కలిసి వచ్చింది. సీమాంచల్ లో ఆర్జేడీకి పట్టుంది. అలాంటి ప్రాంతంలోనూ బీజేపీ, జేడీయూలు గెలవడమంటే ప్రజలు ఇక ఎన్డీఏ కూటమికి తిరుగులేని విజయాన్ని అందించడానికి సిద్ధమయినట్లు కనిపించింది.ఇక ఎన్డీఏ కూటమి తొలి నుంచి ఒక పద్ధతి ప్రకారం వెళుతుంది.

# పీకే ..పీకేందేమి లేదు

పాట్నా, నవంబర్ 16

ఎన్నికల వ్యూహకర్త ప్రశాంత్ కిషోర్ తన సొంత జన్ సూరజ్ పార్టీతో బీహార్ ఎన్నికల్లో పోటీ చేసి ఘోరంగా విఫలమయ్యారు. గతంలో అనేక పార్టీలకు విజయం అందించిన పీకే, ఈ ఎన్నికల్లో ఒక్క సీటు గెలవకపోగా, కనీసం ఆధిక్యం కూడా కనబరచలేకపోయారు. అనేక పార్టీలకు విజయం అందించిన ప్రశాంత్ కిషోర్ సొంత రాజకీయ ప్రస్థానం నిరాశపరిచింది. జన సూరజ్ పార్టీకి కనీసం ఒక్క ఆధిక్యం కూడా లేకపోవడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.అందరికీ శకునం చెప్పే బల్లి కుడితిలో పడి చచ్చింది అనే సామెత మాదిరి తయారైంది జన సూరజ్ పార్టీ అధినేత ప్రశాంత్ కిషోర్ పరిస్థితి. గత రెండు దశాబ్దాలుగా అనేక పార్టీలకు ఎలక్షన్ స్ట్రాటజిస్టుగా పని చేసి, పార్టీల భారీ మెజారిటీతో అధికారంలోకి వచ్చేలా ప్రణాళికలు రచించారు ప్రశాంత్ కిషోర్. ఇక తాను స్వయంగా రాజకీయాల్లోకి దిగి జన సూరజ్ పార్టీ స్థాపించి, సొంత రాష్ట్రం బీహార్ ఎన్నికల్లో అన్ని స్థానాల్లో పోటీకి దిగారు. అయితే అనూహ్యంగా ఈ ఎన్నికల్లో ఒక్క స్థానంలో కూడా గెలవకపోగా కనీసం ఆధిక్యాన్ని కూడా కనబరచలేకపోతోంది. మొత్తం 243 స్థానాల్లో ప్రశాంత్ కిషోర్ సహా.. ఏ ఒక్క చోట కూడా జన సూరజ్ పార్టీ ఓట్లు సాధించలేకపోయింది. అందరికీ స్ట్రాటజీలు ప్లే చేసే పీకే తన విషయం వచ్చేసరికి చతికిలా పడిపోయాడు పాపం అంటున్నారు రాజకీయ విమర్శకులు.బీహార్ అసెంబ్లీ ఎన్నికలు ప్రశాంత్ కిషోర్ కు రాజకీయ విపత్తుగా మారాయి. ఆయన పార్టీ జన్ సూరజ్ పార్టీ ఒకప్పుడు గేమ్-ఛేంజర్ గా, త్రిముఖ పోటీలో పోటీదారుగా ప్రశంసలు అందుకుంది. కానీ ఈ ఎన్నికల్లో ఆ పార్టీ ఘోర పరాజయాన్ని చవిచూసింది. బీహార్ లోని 243 స్థానాల్లో పికె పార్టీ ఏ ఒక్కదానిలోనూ ఆధిక్యంలో లేదు. ఆయన అభ్యర్థులందరూ పేలవమైన స్థితిలో ఉన్నారు. బీహార్ రాజధాని పాట్నాలోని కుమ్రార్ నియోజకవర్గం విజయం కోసం అత్యంత గట్టిగా ఎదురుచూస్తున్న అభ్యర్థి, కానీ అక్కడ కూడా పీకే పార్టీ మూడవ స్థానంలో వెనుకబడి ఉంది.

టీవీ ఛానెళ్లకు ఇచ్చిన ఇంటర్వ్యూలలో, అనేక బహిరంగ సభలలో, ప్రశాంత్ కిషోర్.. "ఎట్టి పరిస్థితుల్లోనూ ఎన్డీఏ ప్రభుత్వం ఏర్పడదని రాతపూర్వకంగా రాసుకోండి. నవంబర్ తర్వాత నితీష్ కుమార్ బీహార్ ముఖ్యమంత్రిగా పదవి నుంచి తప్పుకుంటారు. కొత్త ముఖ్యమంత్రి నియమితులవుతారు" అని ఆయన అన్నారు. తన అంచనాలు విఫలమైతే తాను రాజకీయాల నుండి తప్పుకుంటానని ఖఐ రెండుసార్లు అన్నారు. జన్ సూరజ్ గెలిచినా, జేడీయూ గురించి తన అంచనాలు నిజం కాకపోయినా, తాను రాజకీయాల నుండి తప్పుకుంటానని కూడా ఆయన స్పష్టం చేశారు. అయితే ప్రస్తుతం తిరిగి అధికారంలోకి రావడమే కాకుండా, గతసారి కంటే మెరుగ్గా తీరు కనబరుస్తున్నట్లు కనిపిస్తోంది. ఇప్పటికే 200 సీట్ల మార్క్ దాటేసింది. ఒక్క జెడియు 80 సీట్లు గెలుచుకుంటుందని ట్రెండ్స్ సూచిస్తున్నాయి. ప్రశాంత్ కిషోర్ తన ఖాతాను కూడా తెరవలేదు.జన్ సూరజ్ పార్టీ ఏర్పాటు చేయడానికి ముందు ప్రశాంత్ కిషోర్ మే 5, 2022 నుండి అక్టోబర్ 2, 2024 వరకు 6,000 కిలోమీటర్లు పాదయాత్ర చేశారు. ఆయన 5,000 గ్రామాలకు చేరుకుని 5,000 సమావేశాలు నిర్వహించారు. బీహార్ అంతటా తిరుగుతూ గ్రామగ్రామాన విస్తృతంగా ప్రచారం చేశారు. ఆయన మే 2022 నుండి 1,280 రోజుల పాటు బీహార్ మొత్తాన్ని గాలించినా ఫలితాలు అంతంత మాత్రంగానే ఉన్నాయి. ప్రశాంత్ కిషోర్ తన ఎన్నికల ప్రచారాన్ని రోడ్డు మార్గంలోనే నిర్వహించారు. అక్టోబర్ 21 నుండి ప్రతిరోజూ సగటున 200 కి.మీ. ప్రయాణించానని పీకే చెప్పారు. ఆయన రోజూ 8 నుండి 10 అసెంబ్లీ నియోజకవర్గాలను చుట్టేశారు.ప్రశాంత్ కిషోర్ అక్టోబర్ 2022 నుండి క్రమం తప్పకుండా బీహార్‌లో పర్యటించారు. ఆయనతో పాటు తన బృందం క్షేత్రస్థాయిలో ప్రచారం నిర్వహించింది. వారు ప్రజలతో వారి సమస్యలు, ఆదాయం, ఉపాధి, విద్య గురించి చర్చించారు. ఈ బృందంలో ఐటీ నిపుణులు, మాజీ జర్నలిస్టులు, సామాజిక కార్యకర్తలు ఉన్నారు. కన్సల్టెన్సీ



కంపెనీ ప్రొఫెషనల్ బృందాన్ని నిర్వహించింది. పాట్నా సహా మొత్తం 38 జిల్లాల్లో సుమారు 1,300 మంది నిపుణులతో కూడిన ఇరవై ఐదు ప్రత్యేక బృందాలు పనిచేశాయి. ప్రతి జిల్లాలో మూడు ప్రధాన బృందాలను ఏర్పాటు చేసుకున్నారు ప్రశాంత్ కిశోర్.ఆరు సంవత్సరాలలో ఆరుగురు ముఖ్యమంత్రులను నియమించిన ఈ వ్యక్తి బీహార్‌ను గెలవాలని బయలుదేరారు. అయితే ఒక్క సీటు కూడా గెలవలేకపోయాడు. కోటి మందికి పైగా సభ్యులున్న జన్ సురాజ్ పార్టీ, పది లక్షల ఓట్లను కూడా సంపాదించలేకపోయింది. పార్టీ నిలబెట్టిన 238 సీట్లలో 233 సీట్లలో డిపాజిట్లు గల్లంతయ్యాయి. అంటే వాటిలో 98% శాతం స్థానాల్లో కనీస ఓట్లు కూడా కరువయ్యాయి. జన్ సూరజ్ పార్టీకి దాదాపు 2% ఓట్లు వస్తాయని అంచనా వేశారు. కానీ అసదుద్దీన్ ఒవైసీ కి చెందిన ఎంఐఎం, మాయావతి బిఎస్పీ దీని కంటే మెరుగ్గా పనిచేశాయి. ఎన్నికలకు ముందు ప్రశాంత్ కిషోర్ గొప్ప వాదనలు చేశారు, కానీ ఎన్నికల ఫలితాలతో అవి బద్దలయ్యాయి.

# రేవంత్ సైలెంట్ వార్నింగ్

హైదరాబాద్, నవంబర్ 16

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వానికి జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక మరింత ఊపు తెచ్చింది. రెండేళ్లలో రెండు ఉప ఎన్నికలలో కాంగ్రెస్ ను రేవంత్ ఒంటి చేత్తో గెలిపించారు. గత రెండేళ్లలో రేవంత్ రెడ్డి నాయకత్వంపై అనేక ప్రచారాలు జరుగుతున్నాయి. బీహార్ ఎన్నికల తర్వాత తెలంగాణలో ముఖ్యమంత్రిని మారుస్తారన్న ప్రచారం జరిగింది. అలాగే కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారంటీల ప్రభావం కూడా ఈ ఉప ఎన్నికల్లో పనిచేయలేదు. ప్రత్యర్థులు చేసే విమర్శలను ప్రజలు పెద్దగా పట్టించుకోలేదన్నది ఈ ఎన్నిక ఫలితం ద్వారా చూడాలి. ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి అంత సులువుగా ఎంపిక కాలేదు. తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చినా నాటి రాష్ట్ర కాంగ్రెస్ నాయకత్వం రెండుసార్లు జరిగిన ఎన్నికల్లో పార్టీని అధికారంలోకి తేవడంలో విఫలమయింది... అందుకే టీడీపీ నుంచి వచ్చినా రేవంత్ రెడ్డిలో ఉన్న ఫైర్ ను చూసి కాంగ్రెస్ నాయకత్వం పీసీసీ చీఫ్ బాధ్యతలను అప్పగించింది. అప్పటి నుంచి నాడు పదేళ్ల నుంచి అధికారంలో ఉన్నకేసీఆర్ పై రేవంత్ రెడ్డి మాటల దాడి కూడా ప్రజలను ఆకట్టుకుంది. ఫలితంగా 2023 ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించింది.

# కారు గ్యారేజీకేనా...



హైదరాబాద్, నవంబర్ 16,

జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల ఫలితాలు బీఆర్ఎస్ శ్రేణులను మరింత కుంగ దీశాయి. సిట్టింగ్ స్థానాలను రెండింటిని గత రెండేళ్లలో కోల్పోవడం కూడా క్యాడర్ ఆత్మస్థయిర్యాన్ని దెబ్బతీసింది. ఈ ఓటములకు కారణం అభ్యర్థులు కాదు.. కేవలం పార్టీ నాయకత్వమేనని స్పష్టంగా చెప్పాలి. కంటోన్మెంట్ ఎమ్మెల్యేగా గెలిచిన మాజీ ఎమ్మెల్యే సాయన్న కుమార్తె లాస్య నందిత దురదృష్టవశాత్తూ రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. ఎమ్మెల్యేగా గెలిచిన నెలలు తిరగక ముందే ఆమె మరణించడంతో సాయన్న మరో కుమార్తె నివేదితను పోటీకి దింపారు. కానీ నాడు ఆ ఎన్నికల్లో బీజేపీ రెండో స్థానంలో గెలవగా, మూడో స్థానానికి బీఆర్ఎస్ పరిమితమయింది. ఇప్పుడు కూడా అన్ని పార్టీల కంటే జూబ్లీహిల్స్ నియోజకవర్గం అభ్యర్థిని బీఆర్ఎస్ ప్రకటించింది. తమ పార్టీకి చెందిన మాగంటి గోపీనాథ్ సతీమణి మాగంటి సునీతను అభ్యర్థిగా ప్రకటించారు. అయినా రెండుసార్లు బీఆర్ఎస్ గెలుపు సాధించలేదు. అంటే ఇక్కడ అభ్యర్థుల కంటే నాయకత్వాన్ని మాత్రమే ప్రజలు చూశారని చెప్పాల్సి ఉంటుంది. గత రెండేళ్లుగా పార్టీ అధినేత కేసీఆర్ ప్రజా సమస్యలపై పెద్దగా బయటకు రావడం లేదు. అప్పుడప్పుడు బయటకు వచ్చి వెళ్లడం తప్ప ఆయన ఎక్కువగా ఫామ్ హౌస్ కే పరిమితమయ్యారు. ఆరోగ్యం పరిస్థితులు కూడా ఆయనను బయటకు రానివ్వడం లేదు. దీంతో జూబ్లీహిల్స్ నియోజకవర్గం ఉప ఎన్నికల ప్రచారాన్ని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నీ తన భుజాల మీద వేసుకుని చేశారు. మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు ప్రచారంలో ముమ్మరంగా పాల్గొన్నారు. అయితే ప్రచారంలో కూడా కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు చేయడం తప్ప మరొకటి లేకుండాఉంది... పోల్ మేనేజ్ మెంట్ లో బీఆర్ఎస్ పార్టీ ఘోరంగా విఫలమయింది. కారుకు, బుల్ డోజర్ కు మధ్య పోటీ అంటూ పదే పదే ప్రచారం చేసినా ఆక్రమణల విషయంలో ప్రజలు బుల్ డోజర్ వైపు మొగ్గు చూపారనుకోవాలి. డబ్బులు తక్కువ ఖర్చు పెట్టలేదనుకోవడం పొరపాటే. కాంగ్రెస్ తో పోటీ పడిందనే చెప్పాలి. అదే సమయంలో కాంగ్రెస్ అభ్యర్థి రౌడీషీటర్ అని ప్రచారం ఒక పక్క చేస్తూ మరికొందరి రౌడీషీటర్లకు పార్టీ కండువాలు కప్పడం కూడా బీఆర్ఎస్ చేసిన తప్పిదాల్లో ఒకటి. ఇక సీమాంధ్ర ఓటర్లను ఆకట్టుకోవడంలో కూడా కేటీఆర్ విఫలమయ్యారు. టీడీపీ తటస్థంగా ఉండటం కూడా కాంగ్రెస్ కు లాభించింది. బీఆర్ఎస్ కు నష్టం చేకూర్చింది. ముఖ్యమంత్రిగా ఉన్న పదేళ్ల కాలంలో కేసీఆర్ వ్యవహరించిన తీరును, ఇప్పటి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యవహార శైలిని ప్రజలు బేరీజు వేసుకున్నట్లే ఉంది.

# డైలమాలో కమలం

హైదరాబాద్, నవంబర్ 16 జూబ్లీహిల్స్ నియోజవర్గంలో జరిగిన ఉప ఎన్నికల్లో ఎదురైన ఓటమి భారత రాష్ట్ర సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ కు వాస్తవ పరిస్థితిని తెలిసేలా చేసినట్టుంది.


దక్షిణ మధ్య రైల్వే
Follow us on @SCRailwayindia
ద.మ రైల్వేలోని టెండరు ప్రకటన వివరాలను మా వెబ్‌సైట్
website : www.scr.indianrailways.gov.in

**Tender No. : 27_2025_26_ Sr.DEE_Tr_HYB, Dated : 14-11-2025** PUB/1442

భారత రాష్ట్రపతి తరపున సీనియర్ డివిజనల్ ఎలక్ట్రికల్ ఇంజనీర్ / ట్రాక్షన్ / హైదరాబాద్ టెండర్ నెం.27బి2025బి26బి సీనియర్ DEE_Tr_HYB, తేదీ: 14-11-2025, ముగింపు తేదీ 05-12-2025, 15:30 గంటలకు ఈ-టెండర్లను ఆహ్వానిస్తుంది. బిడ్డర్లు తమ అసలు / సవరించిన బిడ్లను ముగింపు తేదీ మరియు సమయం వరకు మాత్రమే సమర్పించగలరు. ఈ టెండర్‌కు వ్యతిరేకంగా మాన్యువల్ ఆఫర్‌లు అనుమతించబడవు మరియు అటువంటి మాన్యువల్ ఆఫర్‌లు స్వీకరించబడిన ఏవైనా విస్మరించబడతాయి.

వరుస సంఖ్య: 1. పని వివరణ : హైదరాబాద్ డివిజన్ - కావలరీ బ్యారక్స్ (CVB) బోలారం (BMO) స్టేషన్ మధ్య KM 609/200-300 వద్ద ఉన్న RUB నెం 739 వద్ద అదనపు RUB కోసం OHE అంచనా. -
సుమారు ఖర్చు : రూ.17,35,100.60/-.
సంపాదన డబ్బు డిపాజిట్ : రూ.34,700.00/-
పని పూర్తయ్యే గడువు: 06 నెలలు. ముగింపు తేదీ: 05-12-2025.

వెబ్‌సైట్ వివరాలు www.ireps.gov.in:

సీనియర్ డివిజనల్ ఎలక్ట్రికల్ ఇంజనీర్, ట్రాక్షన్, హైదరాబాద్.

**E-Tender Notice No. N-SG-36-2025-26-CCTV-30, Dated : 11-11-2025** PUB/1443

భారత రాష్ట్రపతి తరపున మరియు ఆయన తరపున పనిచేస్తున్న సీనియర్ డివిజనల్ సిగ్నల్ & టెలికాం ఇంజనీర్ / నాందేడ్ ఈ క్రింది పనుల కోసం ఇ-టెండర్లను ఆహ్వానిస్తున్నారు.

టెండర్ నంబర్ మరియు తేదీ : N-SG-36-2025-26-CCTV-30, తేదీ: 11-11-2025. పని పేరు: S&T ఇక్కడ పనిచేస్తుంది
1) వస్తువుల సరఫరాతో సంబంధం షెడ్ సౌకర్యాలు మరియు అన్ని వాతావరణ COP మాల్టెక్డి వద్ద GL వద్ద (650Mx10M)
2) ఆల్ వెదర్ COP, CC కేటాయింపు అప్రోచ్ రోడ్, లైటింగ్ ఏర్పాట్లు, CCTV మరియు సరిహద్దు గోడను మెరుగుపరచడం, వ్యాపారి మరియు హమాల్ గదులు ఆదిలాబాద్.
3) సిప్ని శివపూర్ గూడ్స్ షెడ్ వద్ద 650x11 చదరపు మీటర్ల విస్తీర్ణంలో ఆల్ వెదర్ COP కేటాయింపు.

అంచనా వేసిన ప్రాజెక్ట్ వ్యయం : రూ.69,38,738/-.
బిడ్ సెక్యూరిటీ: రూ.1,38,800/-.
పని పూర్తి చేసే కాలం : 12 నెలలు.
బిడ్ ముగింపు తేదీ (బిడ్ గడువు తేదీ): 04-12-2025 మధ్యాహ్నం 3:00 గంటలకు.
బిడ్ ప్రారంభ తేదీ: 04-12-2025 తర్వాత 15:00 గంటలు.
ఆఫర్ చెల్లుబాటు: బిడ్ నుండి 60 రోజులు ముగింపు తేదీ.
టెండర్ బుక్‌లెట్ ధర: రూ.0/-
అన్ని బిడ్డింగ్‌లు ఇండియన్ రైల్వే ఈ-టెండరింగ్ పోర్టల్ www.ireps.gov.inలో ఉన్నాయి. ఈ టెండర్‌కు వ్యతిరేకంగా మాన్యువల్ ఆఫర్‌లు అనుమతించబడవు. మరిన్ని వివరాలను www.ireps.gov.inలో చూడవచ్చు.

సీనియర్ డివిజనల్ సిగ్నల్ & టెలికాం ఇంజనీర్ / నాందేడ్

**Tender Notice No. NED/E-28 & 29/2025-26, Dt. 14.11.2025** PUB/1444

www.ireps.gov.in లో ఈ క్రింది E-టెండర్లకు ఆఫర్లు ఆహ్వానించబడ్డాయి.

క్రమ సంఖ్య: 1. NED/E-28/2025-26. పని పేరు: హింగోలి : నీటి నిల్వ మరియు లభ్యతను మెరుగుపరచడానికి OHT (1.50 లక్షల లీటర్లు), GLR (2.00 లక్షల లీటర్లు) మరియు లోతైన బోర్‌వెల్ ఏర్పాటు విద్యుత్ ఏర్పాట్లు. అంచనా వ్యయం: రూ. 27,60,644/-. బిడ్ సెక్యూరిటీ: రూ. 55,200/-. పని పూర్తి చేసే కాలం : 12 నెలలు. అందుబాటులో ఉంది : 60 రోజులు. నాందేడ్ డివిజన్ అడ్మినిస్ట్రేషన్ కింద www.ireps.gov.in వద్ద వ్యవధి. ముగింపు తేదీ మరియు సమయం: 05-12-2025 యొక్క 15:00 గంటలు.

క్రమ సంఖ్య:2. NED/E-29/2025-26. పని పేరు: MUE వద్ద ప్రతిపాదిత మహిళా RPF బ్యారక్ (10 పడకలు) జిమ్, రిక్రియేషన్ హాల్ మొదలైనవి. విద్యుత్ ఏర్పాట్లు.
అంచనా వ్యయం: రూ. 16,05,515/- బిడ్ సెక్యూరిటీ: రూ. 32,100/-. చెల్లుబాటు ఆఫర్ కాలవ్యవధి: 60 రోజులు. పని పూర్తి చేసే కాలం : 12 నెలలు. నాందేడ్ డివిజన్ అడ్మినిస్ట్రేషన్ కింద www.ireps.gov.in వద్ద అందుబాటులో ఉంది. ముగింపు తేదీ మరియు సమయం: 05-12-2025 యొక్క 15:00 గంటలు.

టెండర్ డాక్యుమెంట్ కోసం, అర్హత ప్రమాణాలు, ప్రత్యేక షరతులు మొదలైన వివరాల కోసం పైన పేర్కొన్న విధంగా మా వెబ్‌సైట్‌ను సందర్శించండి. ఆఫర్ సమర్పించే ముందు ఆన్‌లైన్‌లో ఏదైనా దిద్దుబాటు ప్రచురించబడిందో లేదో తనిఖీ చేయాలని సూచించబడింది.

డివిజనల్ రైల్వే మేనేజర్ (ఎలక్ట్రికల్), నాందేడ్.

**Tender Notice No. : 46/2025, Dated : 14-11-2025 SUPPLY OF STORES ITEMS** PUB/1445

ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండర్ నోటీసు
కింది టెండర్లు ఆన్‌లైన్‌లో ప్రవేశపెట్టబడ్డాయి. టెండరుదారులు www.ireps.gov.in వెబ్‌సైట్‌ను సందర్శించి తమ ఆఫర్‌లను ఆన్‌లైన్‌లో సమర్పించాలని అభ్యర్థించారు. టెండర్ వివరణ, Qty, EMD, SD వెబ్‌సైట్‌లో చూడవచ్చు. మాన్యువల్‌గా సమర్పించిన ఆఫర్‌లు అంగీకరించబడవు. పోస్ట్ ద్వారా ఆఫర్‌లు స్వీకరించబడవు. టెండర్ ముగింపు సమయం టెండర్ గడువు తేదీ నుండి 14:30 గంటలు. అన్ని స్వదేశీ ఆఫర్‌ల కోసం, www.ireps.gov.inలో అందుబాటులో ఉన్న ఆన్‌లైన్ సిస్టమ్ ద్వారా మాత్రమే ఎర్నెస్ట్ మనీ డిపాజిట్ అంగీకరించబడుతుంది.

| టెండర్ నెం. | సంక్షిప్త వివరణ |
|---|---|
| 56251199A | లెడ్ యాసిడ్ స్టేషనరీ సెకండరీ సెల్ 200 AH. |
| 56251200A | లెడ్ యాసిడ్ స్టేషనరీ సెకండరీ సెల్ 300 AH. |
| 30251801 | మిర్రర్ అసెంబ్లీ. |
| 77251065 | పెయింట్ ఎనామెల్ సింథటిక్ బాహ్యభాగం. బంగారు పసుపు. |
| LH256918 | బెర్త్ ఇండికేషన్ లైట్ ఫిట్టింగ్‌తో కూడిన LED నైట్ లైట్. |
| 30251039 | అధిక సామర్థ్యం గల థర్మోప్లాస్టిక్ పాలిస్టర్. |
| 29251394A | బ్రష్ హెూల్డర్ అసెంబ్లీతో ఎర్త్ రిటర్న్ బ్రష్. |
| 29255022 | CLW RDG ప్రకారం AC యూనిట్ కోసం ట్రఫ్. |
| 29251397 | కన్వర్టర్/ట్రాన్స్‌ఫార్మర్ కోసం ఆయిల్ కూలర్ రేడియేటర్. |
| 77251162 | పెయింట్ అల్యూమినియం బ్రషింగ్. |
| 29251426 | కాంట్రాక్ట్ రకం 6; CLW స్పెసిఫికేషన్ ప్రకారం. |
| 66258690 | ట్రాక్ మెషిన్ కోసం కవాటాలు మొదలైన వాటి సేకరణ. |
| 29251440 | నికిల్ కాడ్మియం బ్యాటరీ, ఒక్కో బ్యాటరీకి 03 సెల్స్. |
| 25255014 | నీరులేని మూత్రశాలల సరఫరా సంస్థాపన & ఆరంభం. |
| 38251019B | స్ట్రైకర్ కాస్టింగ్ వేర్ ప్లేట్. |
| 38252069C | కాస్నబ్ బోగీ యొక్క బఫర్ ఎత్తు సర్దుబాటు కోసం 37mm ప్యాకింగ్. |
| 66258783 | క్యాటర్‌పిల్లర్ మోడల్ నెం.C 18 ప్రకారం డీజిల్ ఇంజిన్. |
| 38253586 | లైనర్‌తో ఉక్కు బోల్‌స్టర్ |
| 66258461 | ట్రాక్ మెషిన్ కోసం వాల్వ్ పంపులు మొదలైన వాటి సేకరణ. |
| 66257560 | ట్రాక్ యంత్రాల ఉపయోగం కోసం విడిభాగాల సేకరణ. |

**గమనిక:- టెండర్ గడువు తేదీలు తెరవడం:** తేదీ.01-12-2025న క్రమ సంఖ్య: 01 నుండి 03. తేదీ.03-12-2025న క్రమ సంఖ్య: 04. తేదీ.04-12-2025న క్రమ సంఖ్య: 05 నుండి 07. తేదీ.05-12-2025న క్రమ సంఖ్య: 08 నుండి 10. తేదీ.26-11-2025న క్రమ సంఖ్య: 09. తేదీ.27-11-2025న క్రమ సంఖ్య: 10. తేదీ.28-11-2025న క్రమ సంఖ్య: 11. తేదీ.04-12-2025న క్రమ సంఖ్య: 12 నుండి 16. తేదీ.09-12-2025న క్రమ సంఖ్య: 17. తేదీ 11-12-2025న క్రమ సంఖ్య: 18. తేదీ 15-12-2025న క్రమ సంఖ్య : 19 & 20.

కొరిగెండమ్
టెండర్ నోటీసు నెం.45/2025 తేదీ.07-11-2025 టెండర్ నెం. SCR-CAP-TR-T25 తేదీ. 01-12-2025న గడువు తేదీ బ్రీఫ్; IR, మేక్ హార్స్కో రైల్, USA కోసం TRT విడిభాగాల సరఫరా కోసం RC ని ఇప్పటికే ఉన్న తేదీకి బదులుగా గడువు తేదీ 05-12-2025గా చదవవచ్చు.
పైన పేర్కొన్న టెండర్లతో పాటు రూ.50 లక్షల కంటే ఎక్కువ విలువ కలిగిన ఇతర టెండర్లు కూడా ఉన్నాయి. వివరాల కోసం, దయచేసి పైన ఉన్న రైల్వే వెబ్‌సైట్‌ను సందర్శించండి.

ప్రిన్సిపల్ చీఫ్ మెటీరియల్స్ మేనేజర్, సికింద్రాబాద్.
A1834

మరిన్ని టెండర్ నిబంధనలు / వివరాల కోసం మరియు టెండర్ పత్రాలను డౌన్‌లోడ్ చేసుకోవడానికి,
https://www.ireps.gov.in
లేదా
www.scr.indianrailways.gov.in
వెబ్‌సైట్‌ను సందర్శించండి





# కాసులు కురిపిస్తున్న ఫ్యాన్సీ లాటరీ నెంబర్లు

## ఒక్క రోజే 65 లక్షల ఆదాయం

హైదరాబాద్, నవంబర్ 16

ఫ్యాన్సీ నంబర్ల వేలం ద్వారా ఖైరతాబాద్ రవాణాశాఖ కార్యాలయానికి ఒక్క రోజులోనే రూ. 65,38,889 ఆదాయం వచ్చింది. అత్యధికంగా టీజీ 09 ఉ 9999 నంబరు రూ. 22,72,222 పలికి రికార్డు సృష్టించింది. ఈ నంబరును హనర్ ప్రైమ్ హౌసింగ్ ఎల్ఎల్‌పీ దక్కించుకుంది. అలాగే... టీజీ 09 ఏ 0009 నంబరు రూ. 6,80,000 లకు, టీజీ 09 ఏ 0006 నంబరు రూ. 5,70,666 లకు అమ్ముడయ్యాయి. ఈ వేలం ద్వారా వచ్చిన ఆదాయం, వాహనదారులు తమ వాహనాలకు అదృష్ట సంఖ్యలు దక్కించుకోవడానికి ఎంత ఆసక్తి చూపిస్తున్నారో తెలియజేస్తుంది.తెలంగాణ రవాణా శాఖకు ఫ్యాన్సీ నంబర్లు భారీ మొత్తంలో ఆదాయాన్ని తెచ్చిపెడుతున్నాయి. ప్రతిసారీ కొత్త సిరీస్ మొదలైనప్పుడు.. వాహనదారులు తమ వాహనాలకు అదృష్ట సంఖ్యలు, పునరావృత సంఖ్యలు లేదా తమకు ఇష్టమైన సంఖ్యలు దక్కించుకోవడానికి పెద్ద మొత్తంలో వేలంపాటలో పాల్గొంటారు. తాజాగా జరిగిన వేలంపాటలో.. కేవలం ఒక్క రోజులోనే ఖైరతాబాద్ రవాణాశాఖ కార్యాలయానికి అసాధారణ రీతిలో రూ. 65,38,889 ల ఆదాయం వచ్చినట్లు హైదరాబాద్ జాయింట్ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ రమేష్ తెలిపారు.ఈ వేలంపాటలో అత్యధికంగా పలికిన నంబర్ టీజీ09 ఉ 9999. ఈ నంబర్ కోసం పోటీపడిన హనర్ ప్రైమ్ హౌసింగ్ ఎల్ఎల్‌పీ సంస్థ ఏకంగా రూ. 22,72,222 చెల్లించి కైవసం చేసుకుంది. ఇది ఆ ఒక్క రోజులో అత్యంత ఖరీదైన సంఖ్యగా నిలిచింది. దీనికి వ్యతిరేకంగా.. అతి తక్కువగా ఎఉ 09 ఏ 0003 నంబరుకు కూడా రూ. 1,15,121 ఆదాయం వచ్చిందంటే.. వాహనదారులకు ఫ్యాన్సీ నంబర్లపై ఉన్న మక్కువ ఎంత ఉందో అర్థం చేసుకోవచ్చు.ఫ్యాన్సీ నంబర్ల కోసం ప్రముఖ సంస్థలు, వ్యక్తులు పోటీపడ్డారు. ముఖ్యంగా డెవలపర్లు, ఎనర్జీ సంస్థలు, ఎంటర్‌టైన్‌మెంట్ కంపెనీలు తమ వ్యాపార వాహనాలకు, వ్యక్తిగత వాహనాలకు ఈ ప్రత్యేక సంఖ్యలను దక్కించుకోవడానికి వెనుకాడలేదు.

టీజీ 09 ఏ 0009: ఈ సంఖ్యను రూ. 6,80,000 లకు మెస్సర్స్ దండు ఎనర్జీ ప్రైవేట్ లిమిటెడ్ దక్కించుకుంది. టీజీ 09 ఏ 0006.. దీని కోసం సాయి సిల్క్ కళామందిర్ లిమిటెడ్ యాజమాన్యం రూ. 5,70,666 చెల్లించింది. టీజీ 09 ఏ 0099.. ఈ నంబరును రూ. 3,40,000 లకు మెస్సర్స్ గోదావరి ఫార్చ్యూన్ సంస్థ దక్కించుకుంది. టీజీ 09 ఏ 0001.. సింగిల్ డిజిట్ నంబరు కోసం శ్రీనిధి ఐటీ స్పేస్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ రూ. 2,60,000 చెల్లించింది. టీజీ 09 ఏ 0005.. దీనిని రూ. 2,40,100 లకు నిహారిక ఎంటర్ టైన్ మెంట్ సంస్థ దక్కించుకుంది.రవాణా శాఖకు ఈ ఫ్యాన్సీ నంబర్లు ఒక అదనపు ఆదాయ వనరుగా మారాయి. వాహనదారులు ఇంత భారీ మొత్తంలో డబ్బు ఖర్చు చేయడానికి ప్రధానంగా కొన్ని కారణాలు ఉన్నాయి. చాలా మంది సంఖ్యాశాస్త్రం (న్యూమరాలజీ) ప్రకారం తమకు అదృష్టం తెచ్చే సంఖ్యలను, లేదా శుభప్రదమైన '9' వంటి సంఖ్యలను కోరుకుంటారు. నిర్మాణ, రియల్ ఎస్టేట్ సంస్థలు తమ బ్రాండ్ లేదా హోదాను ప్రతిబింబించే సంఖ్యలను లేదా సులభంగా గుర్తుంచుకోగలిగే సంఖ్యలను (ఉదా: 0001, 0009) కొనుగోలు చేస్తాయిఇది వారి మార్కెట్ విలువను, హోదాను సూచిస్తుంది. కొంతమందికి తమ పుట్టిన తేదీ, లేదా ఇష్టమైన సంఖ్యలు ఉండేలా చూసుకుంటారు. ఈ వేలం ప్రక్రియ పూర్తిగా పారదర్శకంగా ఆన్‌లైన్ ద్వారా జరుగుతుంది. వాహనదారుల నుంచి వచ్చే ఈ ఆదాయం ప్రభుత్వ ఖజానాకు చేరి, ప్రజా సంక్షేమ కార్యక్రమాలకు ఉపయోగపడుతుంది. ఈ ఒక్క రోజు ఆదాయమే రవాణా శాఖకు ఫ్యాన్సీ నంబర్లు ఎంత కీలకమో స్పష్టం చేస్తోంది.

# సీఐఐ సదస్సులో కనిపించని మిత్రపక్షాలు

విశాఖపట్టణం, నవంబర్ 16

విశాఖలో పెట్టుబడుల సదస్సు ప్రారంభం అయింది. ఏపీ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఏర్పాట్లు చేసింది. ఆంధ్ర యూనివర్సిటీ ఇంజనీరింగ్ కాలేజీ వేదికగా ఈ సదస్సు రెండు రోజులపాటు కొనసాగుతోంది. ప్రపంచం నలుమూలల నుంచి దిగ్గజ పారిశ్రామికవేత్తలు పెద్ద ఎత్తున తరలిరానున్నారు. గత కొంతకాలంగా ఏపీ ప్రభుత్వం ఈ సదస్సుకు సన్నాహాలు ప్రారంభించింది. సీఎంతో పాటు మంత్రులు స్వయంగా వెళ్లి ఆహ్వానాలు అందించారు. దాదాపు పది లక్షల కోట్ల పెట్టుబడులు వస్తాయని ప్రభుత్వం అంచనా వేస్తోంది. అయితే ఇంతటి ప్రతిష్టాత్మక కార్యక్రమానికి ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ రావడం లేదా? అనే వార్త హల్చల్ చేస్తోంది. పౌర సంబంధాల శాఖ విడుదల చేసిన అతిథుల జాబితాలో ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ పేరు లేకపోవడం ఇప్పుడు హాట్ టాపిక్ అవుతుంది. అసలు పవన్ వస్తారా? రారా? అనేది స్పష్టత లేకుండా పోయింది. గత కొద్ది రోజులుగా అటవీ శాఖ భూముల పరిశీలనతో పాటు ఎర్రచందనం నిల్వలను పరిశీలించారు పవన్ కళ్యాణ్. ఏకంగా వైసీపీ మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆక్రమించిన భూముల వీడియోలను తీసి మంత్రివర్గ సహచరులకు చూపించారు. గత రెండు రోజులుగా రాజకీయంగా సైతం హాట్ టావిక్ అవుతున్నారు.అయితే కూటమి ప్రభుత్వ విధానాలు చూస్తుంటే ఒక అంశం స్పష్టంగా కనిపిస్తుంది. సీఎం చంద్రబాబు ప్రభుత్వాన్ని సాఫీగా నడుపుతున్నారు. పవన్ కళ్యాణ్ రాజకీయంగా డ్యామేజ్ జరిగినప్పుడు బయటకు వస్తున్నారు. అటు లోకేష్ తెలుగుదేశం పార్టీ బాధ్యతలను తన శాఖ ప్రగతి, ఏపీకి పెట్టుబడులు, విదేశీ వ్యవహారాలను చూస్తున్నారు. ఈ ముగ్గురు నేతలు ఇలా కీలక బాధ్యతల్లో సర్దుబాటు అయ్యారు. పవన్ కళ్యాణ్ కదలికలు చూస్తే ఆయన గ్రామీణ ప్రాంత అభివృద్ధి, పర్యటనలు చేస్తున్నారు. అయితే విదేశాల నుంచి పరిశ్రమలతో పాటు పెట్టుబడులు తెచ్చే బాధ్యతను లోకేష్ తీసుకున్నారు. అయితే ఈ విషయంలో చక్కటి సమన్వయం కనిపిస్తోంది. విభిన్న ప్రకటనలు, నిర్ణయాలు ప్రకటించక పోవడాన్ని మనం గుర్తించాలి. ముఖ్యంగా ఇది అనుకునే చేస్తున్నదే.విశాఖ పెట్టుబడుల సదస్సుకు సంబంధించి ప్రభుత్వం పౌర సంబంధాల శాఖ ద్వారా భారీగా ప్రకటనలు ఇచ్చింది. అయితే ఈ యాడ్లలో ప్రధాని నరేంద్ర మోడీ, కేంద్ర పరిశ్రమల శాఖ మంత్రి పియూష్ గోయల్, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ ఫోటోలు ఉన్నాయి. సీఎం చంద్రబాబు ఈ ప్రకటన ఇస్తున్నట్టు అందులో ఉంది. మరి ప్రకటనల్లోనే పవన్ కళ్యాణ్ కు అంత ప్రాధాన్యం ఉంటే.. కచ్చితంగా ఆయన సదస్సుకు హాజరవుతారని అంతా భావించారు. కానీ అతిథుల జాబితాలో ఉపరాష్ట్రపతి రాధాకృష్ణన్, గవర్నర్ అబ్దుల్ నజీర్, ఏపీ సీఎం చంద్రబాబు, మంత్రులు నారా లోకేష్, నాదేండ్ల మనోహర్, టీజీ భరత్ తో పాటు సిఐఐ కోఆర్డినేటర్ల పేర్లు మాత్రమే ఉన్నాయి. దీంతో పవన్ కళ్యాణ్ ఈ సదస్సుకు హాజరయ్యే అవకాశం లేదా అనే చర్చ నడుస్తోంది. వైసీపీ అనుకూల మీడియా అయితే దీనిని హైలెట్ చేస్తోంది. క్రమేపి పవన్ కళ్యాణ్ ని సైడ్ చేస్తున్నట్లు చెప్పుకొస్తోంది.

# వాస్తవాలు చెప్పేస్తానని చెప్పడంతోనే చంపేశారు

## కిరణ్ రాయల్, తిరుపతి జనసేన ఇంచార్జ్

తిరుపతిఅప్పుడు బాబాయ్ వివేక, ఇప్పుడు సతీష్ కుమార్ కు వైసీపీ గొడ్డలి పోటు.బాబాయ్ వివేకకు, సతీశ్ కుమార్ కు ఒకే చోట గాయాలు ఉన్నట్లు తెలుస్తోందని తిరుపతి జనసేన బాధ్యుడు కిరణ్ రాయల్ అన్నారు.

ప్లేసులు మాత్రమే మారాయి. హత్య ప్యాట్రన్ ఒక్కటే . పరకామణి ఇష్యూ చివరి దశకు చేరుకుంది . హుండీ డబ్బులు వాటా వేసుకున్నారు అప్పటి పాలకులు. సతీశ్ కుమార్ ను సీఐడీ అధికారులు ఎం విచారించారో కరుణాకర్ రెడ్డికే తెలుసు. న్యాయవాది లక్ష్మణ రావు బెదిరించాడని కరుణాకర్ రెడ్డికి ఎవరు చెప్పారు. భూమన, ధర్మారెడ్డికి సతీష్ కుమార్ టచ్ లో ఉన్నారు. భారీ సుపారీ ఇచ్చి చంపేశారని ఆరోపించారు.సుబ్బారెడ్డి, కరుణాకర్ రెడ్డి కన్నా పెద్ద వ్యక్తి   ఈ హత్యకు కుట్ర చేశారు. అధికారం లేకున్నా హత్యలు ఎలా చేస్తున్నారో అర్థం కాలేదు. సతీశ్ కుమార్ కేసు పెట్టి, రాజీ చేసి, చివరకు సీఐడీ విచారణ జరుగుతున్న తరుణంలో చనిపోయాడు. వైసీపీ ప్రతిపక్షంగా ఉన్న సమయంలో గొడ్డలి బ్యాచ్ బయటకు వస్తుంది. వాస్తవాలు చెప్పేస్తానని చెప్పడంతోనే చంపేశారు. ఈ కేసులో ఇద్దరే ముఖ్యం. ఒకటి సతీశ్ కుమార్, మరొకటి రవికుమార్ . కంప్లైంటీ చనిపోయారు. ఈ కేసు ఎంతవరకు ముందుకు సాగుతుందో లేదో తెలియదు. రవికుమార్ కు భద్రత కల్పించండి.

# పెరిగిన లోకేష్ ఇమేజ్

విజయవాడ, నవంబర్ 16

బీహార్ లో ఎన్డీఏ దూసుకెళ్లింది. జేడీయుతో పాటు బిజెపి భారీ విజయం దిశగా దూసుకు వెళ్తోంది. దీంతో దేశవ్యాప్తంగా ఎన్డీఏ భాగస్వామ్య పక్షాలు సంబరాల్లో మునిగిపోయాయి. ఏపీలో సైతం సందడి నెలకొంది. సరిగ్గా విశాఖలో పెట్టుబడుల సదస్సు ప్రారంభమైన వేళ.. బీహార్లో ఎన్డీఏ విజయం చంద్రబాబుతో పాటు లోకేష్ లో ఎనలేని ఆనందం నింపింది. కేంద్ర ప్రభుత్వ సహకారంతో ఈ పెట్టుబడుల సదస్సు జరుగుతున్న సంగతి తెలిసిందే. పైగా ఈ గెలుపులో మంత్రి నారా లోకేష్ సైతం కీలక భాగస్వామి కావడం విశేషం. ఎన్నికల ప్రచారంలో భాగంగా చివరి రెండు రోజులు మంత్రి నారా లోకేష్ బీహార్లో పర్యటించారు. ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. దీంతో ఎన్డీఏ ముఖ్యమంత్రి ప్రమాణ స్వీకారానికి లోకేష్ ప్రత్యేక ఆహ్వానం అందే అవకాశముంది. ఎన్డీఏ భాగస్వామ్య పక్షాలుగా టిడిపి, జనసేన ఉండడంతో సీఎం చంద్రబాబుతో పాటు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కు సైతం బిజెపి పెద్దలు ఆహ్వానించే అవకాశం ఉంది. కానీ మంత్రి నారా లోకేష్ ను ప్రత్యేక అతిథిగా భావించే ఛాన్స్ కూడా కనిపిస్తోంది.వాస్తవానికి సీఎం చంద్రబాబు బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో ప్రచారం చేస్తానని ప్రకటించారు. కానీ ఇంతలో విశాఖ పెట్టుబడుల సదస్సు, ఆపై విదేశీ పర్యటనలతో ఆయన బిజీగా మారారు. బీహార్లో తెలుగు ఓటర్లు తక్కువే అయినా.. ఏపీలో నిర్మాణరంగంలో బీహార్ వాసులు ఎక్కువ. ముఖ్యంగా అమరావతి తో పాటు పోలవరం ప్రాజెక్టు నిర్మాణ పనుల్లో బీహార్ కార్మికులు ఎక్కువగా ఉంటారు. ఆపై రాష్ట్రంలో చాలా రంగాల్లో బీహార్ కార్మికులు పనిచేస్తుంటారు. ప్రస్తుతం ఏపీలో యూత్ ఐకాన్ గా ఉన్నారు లోకేష్. అనేక రకాలుగా తనను తాను ప్రూవ్ చేసుకొని నిలబడగలిగారు. అందుకే కేంద్ర పెద్దలు నారా లోకేష్ ను ఎన్నికల ప్రచారానికి పంపాలని చంద్రబాబును కోరినట్లు తెలుస్తోంది. వారి కోరిక మేరకు మాత్రమే బీహార్లో లోకేష్ పర్యటించారు. ఎన్డీఏ విధానాలు చెప్పడంతో పాటు ఏపీలో వన్ చాన్స్ అనే నినాదంతో అధికారంలోకి వచ్చిన జగన్మోహన్ రెడ్డి చేసిన విధ్వంసాన్ని వారికి వివరించారు. బీహార్ కు అటువంటి పరిస్థితి రాకుండా చూసుకోవాలని సూచించారు. ఇవి అక్కడి ప్రజల్లోకి బలంగా వెళ్లినట్లు తెలుస్తోంది.ఇటీవల ఏపీకి భారీగా పెట్టుబడులు వస్తున్న సంగతి తెలిసిందే. ఆసియాలోనే అతిపెద్ద గూగుల్ డేటా సెంటర్ విశాఖ ఏర్పాటు కానుంది. ప్రపంచ ఐటి దిగ్గజ సంస్థలు సైతం వస్తున్నాయి. దేశంలో ఇతర రాష్ట్రాలతో పోటీపడి మరి పరిశ్రమలను తెస్తున్నారు. అయితే గూగుల్ డేటా సెంటర్ ఏర్పాటుకు ఒప్పందం జరిగిన తర్వాత జాతీయస్థాయిలో సైతం లోకేష్ పేరు మార్మోగిపోయింది. లోకేష్ ఇమేజ్ జాతీయస్థాయిలో పెరిగింది. అటు బీహార్ లో సైతం ఎన్డీఏ భాగస్వామ్య పక్షం నడుస్తోంది. ఈ తరుణంలో లోకేష్ ను ప్రచారంలో దింపడం ద్వారా ఎన్డీఏకు మద్దతు పెంచవచ్చు అన్న ఆలోచనలో పడ్డారు కేంద్ర పెద్దలు. లోకేష్ కు ప్రచారానికి పిలవగా ఆయన నాలుగు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఆ నాలుగు ప్రాంతాల్లో ఎన్డీఏ ఘనవిజయం సాధించింది. దీంతో లోకేష్ కు మరింత పేరు వచ్చింది. జాతీయస్థాయిలో బిజెపి పెద్దలు సైతం లోకేష్ కు అత్యంత ప్రాధాన్యం ఇచ్చే అవకాశం ఉంది.

ప్రపంచాన్ని చుట్టేసిన లోకేష్

రాష్ట్ర విద్యా శాఖ మంత్రిగా ఉన్నారు నారా లోకేష్. ఐటీ శాఖ మంత్రిగా కూడా కొనసాగుతున్నారు. పరిశ్రమల శాఖ మంత్రిగా టీజీ భరత్ వ్యవహరిస్తున్నారు. కానీ నారా లోకేష్ గత ఏడాదిన్నర కాలంగా కలవని పారిశ్రామికవేత్త లేరు. ఐటీ దిగ్గజ సంస్థల అధినేతలు లేరు. వాటి ఫలితాలు ఈ పెట్టుబడుల సదస్సులో కనిపించనున్నాయి. మంత్రి నారా లోకేష్ ఒకవైపు ప్రభుత్వ పాలన, తన శాఖ పనితీరు, టిడిపి రాజకీయ వ్యవహారాలు చూస్తూనే.. ప్రపంచవ్యాప్తంగా ఎక్కడ పారిశ్రామికవేత్తలతో భేటీకి అవకాశం ఉంటే.. అక్కడకు వెళ్లి ఏపీని ప్రమోట్ చేశారు. అమెరికాలో ఏకంగా గూగుల్ క్లౌడ్ హెడ్ తో సమావేశం కూడా అయ్యారు. ఆ సమావేశమే విశాఖ ఏఐ హబ్ గా మారేందుకు బీజం పడింది.ఒకసారి మంత్రి నారా లోకేష్ ను చూస్తే ఆయన తనను తాను మార్చుకునే తీరు ఇట్టే ఆకట్టుకుంటుంది. ఇప్పుడు ఏపీ కోసం ఆయన అదే తరహా ప్రయత్నం చేస్తున్నారు. పెట్టుబడులతో పాటు పారిశ్రామికవేత్తలను ఆకర్షించడంలో సీఎం చంద్రబాబు కంటే మెరుగైన పనితీరు కనబరుస్తున్నారు. ఒకప్పుడు మైక్రోసాఫ్ట్ను హైదరాబాద్కు తీసుకురావడంలో చంద్రబాబు కృషి ఉంది. ఇప్పుడు లోకేష్ సైతం తనకంటూ అటువంటి ముద్ర కోసం ప్రయత్నాలు చేశారు. పారిశ్రామిక వర్గాలతో టచ్ లోకి వెళ్లిపోతున్నారు. అయితే ఆయన చేసిన ప్రయత్నాలు కొంతవరకు వర్కౌట్ అవుతూ వచ్చాయి.



ఈరోజు పెట్టుబడులు, విశాఖకు వచ్చే దిగ్గజ పరిశ్రమలు, వారితో జరిపే చర్చల్లో లోకేష్ పనితీరు బయటపడనుంది. లోకేష్ తనను తాను మార్చుకున్న తీరు.. పాలనలో తాను వ్యవహరిస్తున్న తీరు మాత్రం ఆయన రాజకీయంగా బలపడేందుకు ఎంతగానో దోహదం చేయనుంది. ప్రతి మనిషి నిశితంగా ఆయనను గమనిస్తున్నారు. ఒకప్పుడు విమర్శించే వారు సైతం సానుకూలంగా చూస్తున్నారు. రాజకీయ ప్రత్యర్థులు సైతం అంతర్గత చర్చల్లో లోకేష్ పని తీరును మెచ్చుకుంటున్నారు. ఎందుకంటే ఆయనకు కావాల్సింది ఏముందిమంత్రి నారా లోకేష్ ఇప్పుడు బహుళ పాత్ర పోషిస్తున్నారు. రాజకీయాల్లో తనకంటూ ఒక మార్కు చాటుకున్నారు. పాలనలోనూ తనదైన పాత్రను పోషిస్తున్నారు. ఏపీ భవిష్యత్తు కోసం చాలా రకాలుగా ఆలోచనలు చేస్తున్నారు. ఒక బాధ్యతాయుతమైన పాత్రతో ముందుకు సాగుతున్నారు. అసలు రాజకీయాలకి పనికిరాడు అని ముద్రవేశారు. చంద్రబాబుకు తగిన తనయుడు కాదని నిర్ధారించేశారు. కానీ ఆ చిక్కుముళ్లను, అవమానాలను తట్టుకుని నిలబడ్డారు నారా లోకేష్. ఒక్క మాటలో చెప్పాలంటే విశాఖ పెట్టుబడుల సదస్సు ఒంటి చేత్తో నడిపించే శక్తిగా మారారు లోకేష్. తప్పకుండా విశాఖ సదస్సు గేమ్ చేంజర్ గా నిలిచే అవకాశం ఉంది

# వలంటీర్లు కు దీటుగా మరో వ్యవస్థ..

విజయవాడ, నవంబర్ 16

తెలుగుదేశం పార్టీ పై ఫుల్ ఫోకస్ పెట్టారు నారా లోకేష్. ప్రస్తుతం ఆ పార్టీకి జాతీయ అధ్యక్షుడిగా చంద్రబాబు ఉన్నారు. రాష్ట్ర అధ్యక్షుడిగా పల్లా శ్రీనివాస్ ఉన్నారు. కానీ మంత్రి లోకేష్ మాత్రం అనధికారికంగా పార్టీని నడుపుతున్నారు. అయితే గతంలో ఎన్నడూ లేని విధంగా తెలుగుదేశం పార్టీలో సుదీర్ఘకాలం ఉండి.. పోరాటం చేసిన వారికి మాత్రమే నామినేటెడ్ పదవుల్లో పెద్దపీట వేశారు. పదవుల నియామకం సమయంలో వారు పార్టీకి చేసిన సేవల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అటువంటి వారికి మాత్రమే పదవులు కట్టబెట్టారు. అయితే ఇప్పుడు సంస్థాగత నిర్మాణంపై దృష్టి పెట్టారు నారా లోకేష్. మండల, పంచాయితీ, క్లస్టర్, బూత్ స్థాయిలో టిడిపి కమిటీలను నియమించారు. ఆ కార్యవర్గాల ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని సైతం.. పదవుల స్వీకరణ మాదిరిగా నిర్వహిస్తున్నారు. ఒక విధంగా చెప్పాలంటే పార్టీలు ప్రతి ఒక్కరిని భాగస్వామ్యం చేస్తున్నట్టే. ప్రాంతీయ పార్టీలకు అది అవసరం కూడా. ఇప్పటికే బీమా సదుపాయం కల్పించి రికార్డు సృష్టించారు. తెలుగుదేశం పార్టీ సభ్యత్వం తీసుకున్న ప్రతి ఒక్కరికి ఈ బీమా వర్తింపజేసేలా చేశారు.దేశంలో చాలా ప్రాంతీయ పార్టీలు ఉన్నాయి. కానీ అవి కొద్ది రోజులకే అనేక రకాల ఇబ్బందులను ఎదుర్కొన్నాయి. అటువంటి ఇబ్బందులే తెలుగుదేశం పార్టీకి ఎదురయ్యాయి. కానీ వాటన్నింటినీ అధిగమించి ముందుకు సాగింది తెలుగుదేశం పార్టీ. దేశంలో చాలా ప్రాంతీయ పార్టీలు బలహీనం అయ్యాయి. కానీ తెలుగుదేశం పార్టీకి మాత్రం ఆ పరిస్థితి లేదు. ఎన్టీఆర్ బలమైన పునాదులు వేస్తే.. దానికి మరింత బలం జోడించారు చంద్రబాబు. ఇప్పుడు లోకేష్ తరంలో సైతం పార్టీ నిర్మాణాన్ని మరింత బలంగా చేపట్టాలని ఈ క్లస్టర్ విధానాన్ని తెరపైకి తీసుకొచ్చారు. పార్టీ అంటే అభిమానం ఉండే ప్రతి ఒక్కరిని ఇందులో భాగస్వామ్యం చేశారు.2024 ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చింది. ఆ పార్టీ నేతృత్వంలోని కూటమి పాలన చేస్తోంది. గత అనుభవాల దృష్ట్యా తెలుగుదేశం పార్టీకి విలువైన సమయాన్ని కేటాయిస్తున్నారు చంద్రబాబు, లోకేష్. అధికార కార్యక్రమాల కోసం ఏ జిల్లాకు వెళ్తున్న.. తగిన సమయాన్ని పార్టీ కోసం కేటాయిస్తున్నారు. పార్టీ కార్యకర్తలతో మాట్లాడుతున్నారు. ఈ క్రమంలోనే క్లస్టర్ ఇన్చార్జిల ఆలోచన లోకేష్ కు వచ్చింది. పార్టీ విధానాలతో పాటు ప్రభుత్వ అంశాలను ప్రజల్లోకి, పార్టీ శ్రేణుల్లోకి తీసుకెళ్లేందుకు ఈ క్లస్టర్ ఎంతగానో దోహదపడుతోంది. అందుకే నామినేటెడ్ పదవుల మాదిరిగా ఈ క్లస్టర్ ఇన్చార్జిల నియామకాన్ని కూడా చేపడుతున్నారు. ఒక్క విధంగా చెప్పాలంటే వాలంటీర్ల వ్యవస్థకు ధీటుగా ఈ క్లస్టర్ వ్యవస్థ ఎంతో ప్రయోజనకారిగా మిగలనుంది.

## జూబ్లీహిల్స్ ఉపఎన్నిక: బ్రాహ్మణ సంఘాల మద్దతుతో కాంగ్రెస్ విజయం: తులసి శ్రీనివాసరావు

హైదరాబాద్జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో జరిగిన ఉపఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ గెలుపులో బ్రాహ్మణ సంఘాల కీలక పాత్ర ఉందని ఆల్ ఇండియా బ్రాహ్మణ ఫెడరేషన్ నాయకులు తెలిపారు.ఫెడరేషన్ ప్రతినిధులు ఐటీ మంత్రి శ్రీధర్ బాబును కలిసి ఉపఎన్నికల్లో కాంగ్రెస్కు బ్రాహ్మణ సంఘాల సంపూర్ణ మద్దతు అందించిన విషయాన్ని తెలియజేశారు. మంత్రి ఇచ్చిన సూచనలు, దిశానిర్దేశాల మేరకు నవీన్ యాదవ్కు సంఘాలు మద్దతు తెలుపాయని నాయకులు సమావేశంలో పేర్కొన్నారు.ఈ సందర్భంగా ఫెడరేషన్ నేత తులసి శ్రీనివాసరావు మాట్లాడుతూ,“ముఖ్యమంత్రి మరియు శ్రీధర్ బాబు గారి ఆదేశాల ప్రకారం కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించడంలో మా సంఘాలు సమష్టిగా పనిచేశాయి. లక్ష్యంగా పెట్టుకున్నట్లుగానే 25 వేల మెజార్టీతో నవీన్ యాదవ్ను గెలిపించగలమని విశ్వాసం ఉంది,” అని అన్నారు.

# ముహూర్తం ఖరారు సర్పంచ్ ఎన్నికల నోటిఫికేషన్‌కు లైన్ క్లియర్.

హైదరాబాద్ నవంబర్ 16

జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక విజయం అధికార కాంగ్రెస్ ప్రభుత్వానికి ఊహించని ఉత్సాహాన్ని, రాజకీయంగా కొత్త బలాన్ని ఇచ్చింది. ఈ గెలుపును పునాదిగా చేసుకుని..ప్రభుత్వం ఇక స్థానిక సంస్థల ఎన్నికలకు పూర్తి స్థాయిలో సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా...గ్రామీణ ప్రాంతాల్లో తమ పట్టును మరింత బలోపేతం చేసుకోవడానికి ఈ ఎన్నికలను ఒక సువర్ణావకాశంగా కాంగ్రెస్ భావిస్తోంది. ఈ మేరకు ఈ నెల 17వ తేదీన తెలంగాణ కేబినెట్ సమావేశం నిర్వహించనున్నారు. దీనిలో స్థానిక సంస్థల ఎన్నికలపై నిర్ణయం తీసుకునే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి.స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి బీసీ వెనుకబడిన తరగతుల, రిజర్వేషన్ల అంశం ప్రభుత్వం ముందు ఉన్న అతిపెద్ద సవాలుగా మారింది. గతంలో ప్రవేశపెట్టిన 42 శాతం బీసీ రిజర్వేషన్లకు చట్టపరమైన లీగల్, సమస్యలు, అడ్డంకులు ఎదురవుతున్న నేపథ్యంలో, అధికారులు మరో నివేదికను సిద్ధం చేశారు.సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం: షెడ్యూల్డ్ కులాలు ఎస్సీ, షెడ్యూల్డ్ తెగలు ఎస్టీ బీసీలకు కలిపి మొత్తం రిజర్వేషన్లు ఎట్టి పరిస్థితుల్లోనూ 50 శాతం మించకూడదు. ఈ న్యాయపరమైన పరిమితిని దృష్టిలో ఉంచుకుని..మొత్తం 50 శాతం పరిమితిలోనే బీసీలకు రిజర్వేషన్లు కేటాయించేలా అధికారులు మార్గాలను అన్వేషించారు. దీనికి సంబంధించి ఒక సమగ్ర నివేదికను ప్రభుత్వానికి సమర్పించారు.బీసీ రిజర్వేషన్లను 50 శాతం పరిమితికి లోబడి కేటాయించడం వల్ల, కొన్ని వర్గాల నుంచి వ్యతిరేకత వచ్చే అవకాశం ఉందని ముఖ్యమంత్రి భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో, ముఖ్యమంత్రి మంత్రులకు కీలక సూచనలు ఇచ్చినట్లు సమాచారం. బీసీల నాయకులతో, ప్రజాప్రతినిధులతో మాట్లాడి న్యాయపరమైన చిక్కుల కారణంగానే ఈ నిర్ణయం తీసుకోవాల్సి వచ్చిందని, ఇది కేవలం తాత్కాలికమేనని వివరించాలని ఆయన సూచించినట్లు తెలుస్తోంది.

బీసీ సంక్షేమం పట్ల ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధిని, భవిష్యత్తులో వారికి మరింత న్యాయం చేసే ప్రణాళికలను వివరించడం ద్వారా ఎన్నికలకు వెళ్లాలని కాంగ్రెస్ వ్యూహం రచిస్తోంది.ప్రస్తుత పరిణామాలు గమనిస్తే..స్థానిక సంస్థల ఎన్నికల నోటిఫికేషన్ ఈ నెలాఖరులోగా లేదా తదుపరి నెల మొదటి వారంలోగా వచ్చే అవకాశాలు మెండుగా ఉన్నాయి. ఈ ఎన్నికలు గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో కాంగ్రెస్ పార్టీకి కొత్త స్థానిక నాయకత్వాన్ని అందించి, పార్టీ బేస్ ను మరింత బలోపేతం చేస్తాయని ప్రభుత్వం ఆశిస్తోంది. అలాగే..ఎన్నికల తర్వాత కూడా తమ ఆరు గ్యారంటీల అమలుకు స్థానిక సంస్థల ద్వారా మరింత వేగం పుంజుకోవచ్చని అధికార వర్గాలు అంచనా వేస్తున్నాయి. ఈ స్థానిక ఎన్నికలు తెలంగాణ రాజకీయాలపై, ముఖ్యంగా గ్రామీణ ఓటర్లపై కాంగ్రెస్ పట్టును స్పష్టంగా తెలియజేస్తాయి. జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక విజయం తర్వాత కాంగ్రెస్ కు ఆత్మవిశ్వాసం పెరిగిపోయింది. ఈ ఊపులోనే స్థానిక సంస్థలకు వెళ్తే బాగుంటుంది అనేది ప్రభుత్వం భావిస్తోంది.

# ఉపఎన్నికల లెక్కల్లో పార్టీలు

హైదరాబాద్, నవంబర్ 16

తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి రెండేళ్లు అవుతోంది. రాష్ట్రవ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఉన్నారు. కానీ హైదరాబాద్ పరిధి మాత్రం చేతికి చిక్కలేదు. ఇక్కడ గత ఎన్నికల్లో ఒక్కరంటే ఒక్క అభ్యర్థి కూడా విజయం సాధించలేకపోయారు. ఉప ఎన్నిక రూపంలో వచ్చిన అవకాశాన్ని కాంగ్రెస్ ఉపయోగించుకుంది. కంటోన్మెంట్‌లో మొదట విజయం సాధించింది. ఇప్పుడు జూబ్లీహిల్స్‌లో కూడా విజయం సాధించింది. ఇదే క్రమంలో మిగతా ప్రాంతాల్లో పట్టుకోసం ప్రయత్నిస్తోంది. దీని కోసం ఇప్పటికే స్కెచ్ వేసింది.కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత చాలా మంది నాయకులు హస్తం గూటికి చేరుకున్నారు. వారిలో ఎమ్మెల్యేలు ఉన్నారు. వారంతా బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్ పార్టీలోకి వచ్చారు. ఒక పార్టీలో గెలిచి అధికార పార్టీలోకి వెళ్లిన వారిపై అనర్హత వేటు వేయాలని బీఆర్ఎస్ పోరాటం చేస్తోంది. ఈ విషయంలో సుప్రీంకోర్టు విచారిస్తోంది. ఇప్పుడు ఈ కేసును తమకు అనుకూలంగా మార్చుకోవాలని ప్రభుత్వం భావించే అవకాశం ఉంది. జూబ్లీహిల్స్ జోష్‌ను కంటిన్యూ చేస్తూ మరిన్ని ఉపఎన్నికలు ఎదుర్కొనేందుకు సిద్ధమయ్యే వ్యూహం రచించే ఛాన్స్ ఉందంటున్నారు విశ్లేషకులు.పార్టీ ఫిరాయించిన పది మంది ఎమ్మెల్యేల్లో టెక్నికల్‌గా కొందరు పార్టీలో చేరినట్టు లేదు. కానీ వీరిలో ఒకరిద్దరు అధికార కార్యక్రమాల్లో కాంగ్రెస్ కండువా వేసుకొని కనిపించారు. కచ్చితంగా వారిపై వేటు పడుతుందని బీఆర్ఎస్ మొదటి నుంచి గట్టిగానే చెబుతూ వస్తోంది. ఇప్పుడు వారిపై వేటు వేయడం కానీ, రాజీనామా చేయించడం ద్వారా ఉపఎన్నికలు వచ్చేలా కాంగ్రెస్ వ్యూహం మార్చే అవకాశం ఉంది. అలాంటి వారిలో మొదటి స్థానంలో ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ ఉన్నారు. ఆయన గెలిచింది కారు గుర్తుపై కానీ ప్రస్తుతం కాంగ్రెస్ సభ్యుడిగా కొనసాగుతున్నారు. ఆయనతో కాంగ్రెస్ త్వరలోనే రాజీనామా చేయిస్తుందని మాట గట్టిగా వినిపిస్తోంది. త్వరలోనే ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ రాజీనామా చేస్తారని ఆయనతోపాటు మరికొందరు అదే బాటలో మరికొందరు ఉంటారని చెబుతున్నారు. ఇలా చేయడం వల్ల కాంగ్రెస్ తన బలాన్ని పెంచుకోవాలని చూస్తోంది. అయితే ముందుగా జీహెచ్ఎంసీలో బలోపేతం దృష్టి పెట్టినందున లిస్ట్‌లో మొదట ఖైరతాబాద్ ఉన్నట్టు విశ్లేషణలు వినిపిస్తున్నాయి. స్పీకర్, సుప్రీంకోర్టు నిర్ణయం వచ్చేలోపు ఒకరిద్దరితో రాజీనామా చేయిస్తే కాంగ్రెస్ పార్టీకి కూడా క్రెడిట్ వస్తుందని ప్లాన్ చేస్తున్నారు. గతంలో రాజీనామా చేయించకుండా పార్టీ ఎల్పీలను విలీనం చేసుకున్నారు. తాము మాత్రం ఎమ్మెల్యేలతో రాజీనామాచేయించామని చెప్పుకోవచ్చు. గతానికి ఇప్పటికి ఉన్నతేడా గమనించడని ఆ నియోజక ప్రజల ముందు పెట్టవచ్చని కాంగ్రెస్ నేతలు ఆలోచిస్తున్నట్టు వార్తలు వస్తున్నాయి.

# ఎంపి చిన్ని కార్యాలయంలో బిర్సా ముండా జయంతి

విజయవాడ నవంబర్ 16

ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) కార్యాలయంలో బిర్సా ముండా జయంతి కార్యక్రమం జరిగింది. బిర్సా ముండా చిత్ర పటానికి డి.టి.డబ్ల్యు.వో ఎమ్.పణి ధూర్జటి, టిడిపి నాయకులు, నేషనల్ కమిషన్ మెంబర్ మాదిగాని గురునాథం, డాక్టర్ జ్యోతిరావ్ నాయక్, పూలమాల వేసి నివాళులర్పించారు.

మాదిగాని గురునాథం మాట్లాడుతూ జనజాతీయ గౌరవ దివస్ వల్ల ప్రాచుర్యంలో లేని గిరిజన చరిత్రికు ప్రాధాన్యత లభించింది. బిర్సా ముండా స్ఫూర్తితో గిరిజన సంక్షేమ, అభివృద్ధికి కృషి చేయాలి. బిర్సా ముండా ఆదివాసి వర్గానికి మాత్రమే కాదు దేశ సంపదని అన్నారు.

డి.టి.డబ్ల్యు.వో ఎమ్.ఫణి ధూర్జటి మాట్లాడుతూ బిర్సా ముండా జయంతి కార్యాక్రమం ఎంపీ కేశినేని శివనాథ్ కార్యాలయం లో నిర్వహించటం సంతోషంగా వుంది. భారత స్వాతంత్ర్య సంగ్రామంలో గిరిజనులు కూడా పోరాడారు. ఎ.కొండూరులో ఎంపీ కేశినేని శివనాథ్ సహకారంతో గిరిజనుల కోసం సిల్క్ డెవలప్ సెంటర్ ఏర్పాటు కానుందని అ?నారు.

డాక్టర్ జ్యోతిరావ్ నాయక్ మాట్లాడుతూ విద్య నేర్చుకోవటం కోసం బిర్సా ముండా చాలా కష్టపడ్డారు. గిరిజనుల్లో హైయర్ ఎడ్యుకేషన్ శాతం చాలా తక్కువగా వుంది.

బిర్సా ముండా స్పూర్తితో గిరిజనులను విద్య వైపు ప్రోత్సహించాలని అన్నారు

# విశాఖ పార్టీ కార్యాలయంలో మంత్రి లోకేష్ 73వ రోజు ప్రజాదర్బార్

## వివిధ సమస్యలతో బాధపడుతున్న వారి నుంచి అర్జీలు స్వీకరణ

## అండగా ఉంటామని బాధితులకు భరోసా

విశాఖపట్నం: నవంబర్ 16విశాఖ తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ 73వ రోజు ప్రజాదర్బార్ నిర్వహించారు. తనను కలిసేందుకు వచ్చిన వారిని ఆప్యాయంగా పలకరించి వినతులు స్వీకరించారు. నకిలీ పత్రాలతో కొంతమంది వ్యక్తులు తమ 5.64 ఎకరాల వ్యవసాయ భూమిని కబ్జా చేసేందుకు యత్నిస్తున్నారని విజయనగరం జిల్లా పూసపాటిరేగ మండలం చిననడిపిల్లి గ్రామానికి చెందిన బంగారి శ్రీనివాసరావు మంత్రి లోకేష్ ను కలిసి ఫిర్యాదు చేశారు. విచారించి తగిన న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. జీవీఎంసీలో ఉద్యోగ అవకాశం కల్పించి తమకు అండగా నిలవాలని 'నీ తోడు సొసైటీ ఫర్ ట్రాన్స్ జండర్ పర్సన్స్' ప్రతినిధులు మంత్రి నారా లోకేష్ ను కలిసి విన్నవించారు.

# కీలక మలుపులు తిరుగుతున్న పరకామణికేసు



తిరుమల, నవంబర్ 15

తిరుమల పరకామణి చోరీ కేసులో కీలక ఫిర్యాదుదారు సతీష్ కుమార్ అనుమానాస్పదంగా చనిపోయారు. ఆయన మాజీ అసిస్టెంట్ విజిలెన్స్ సెక్యూరిటీ ఆఫీసర్ (ఏవీఎస్ఓ). ఈ ఘటన నవంబర్ 13, 2025న జరిగింది. అనంతపురం జిల్లా తాడిపత్రి సమీపంలోని కోమలి గ్రామం వద్ద రైల్వే ట్రాక్ మీద ఆయన మృతదేహం దొరికింది. సతీష్ కుమార్ వయసు 45 సంవత్సరాలు. తిరుపతి సమీపంలో నివసించేవారు. భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఉదయం 7 గంటల సమయంలో స్థానికులు మృతదేహాన్ని చూశారు. రైలు ఢీకొని చనిపోయినట్లు కనిపించినా, శరీరంపై గాయాలు అసహజంగా ఉన్నాయని స్థానికులు చెబుతున్నారు. తాడిపత్రి పోలీసులు అనుమానాస్పద మరణం కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్ట్‌మార్టంకు తరలించారు. ఫోరెన్సిక్ బృందం పరిశీలిస్తోంది. కుటుంబ సభ్యులు ఆత్మహత్య కాదని, హత్యే అని చెబుతున్నారు. పరకామణి చోరీ కేసు 2023 ఏప్రిల్‌లో మొదలైంది. భక్తులు సమర్పించిన బంగారు, నగలు, విదేశీడాలర్లను రవికుమార్ అనే పెద్దజీయర్ మఠం ఉద్యోగి దొంగిలిస్తుండగా పట్టుకున్నారు. ఆయనపై సతీష్ కుమార్ మొదటి ఫిర్యాదు చేశారు. పెద్ద జీయర్ మఠం గుమస్తా రవి కుమార్ 920 అమెరికన్ డాలర్లు దొంగిలిస్తూ దొరికిపోయారని కేసు నమోదు చేశారు. అయితే ఆ తర్వాత ఆయన రవికుమార్ తో లోక్ అదాలత్ లో రాజీ చేసుకున్నారు. దొంగతో రాజీ చేసుకోవడం ఏమిటన్న విమర్శలు వచ్చాయి. కొత్త ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఈ విషయం వెలుగులోకి వచ్చింది. 2025 అక్టోబర్‌లో హైకోర్టు ఆదేశంతో సీఐడీ దర్యాప్తు మొదలైంది. సీఐడీ డీజీ రవిశంకర్ అయ్యన్నార్ నేతృత్వంలో బృందం విచారణ ప్రారంభించారు.

రవికుమార్ ఆస్తులను కొన్ని టీటీడీ పేరన రిజిస్టర్ చేసి..మిగతా పెద్ద మొత్తంలో ఆస్తులను ఇతర వైసీపీ నేతలు, అప్పటి టీటీడీ అధికారులు స్వాహా చేశారని ఆరోపణలు ఉన్నాయి. సతీష్ కుమార్‌ను నవంబర్ 6న తిరుపతి పద్మావతి అతిథి గృహంలో విచారించారు. మరోసారి హాజరు కావాలని నోటీసు ఇచ్చారు. ఆ తర్వాతే ఆయన చనిపోయారు. దీంతో హత్య అనుమానం పెరిగింది. సతీష్ మొబైల్, వాహనం ఇతర విషయాలను సీఐడీ అధికారులు పరిశీలిస్తున్నారు.సతీష్ కుమార్ ను ఎవరైనా హత్య చేశారా.. పరకామణి కేసులో ఆయన ఎవరి ఒత్తిడితో రాజీ చేసుకున్నారు.. రవికుమార్ ఆస్తులను ఎవరెవరు రాయించుకున్నారన్నది ఆయనకు తెలిసే అవకాశం ఉంది. ఒత్తిడి చేసిన పెద్దలే.. అసలు నిందితులు అవుతారు. ఆ విషయాలన్నీ? సతీష్ కుమార్ బయట పెడితే.. కేసు చిక్కుముడి వీడిపోతుంది. ఇలాంటి సమయంలో ఆయన అనుమానాస్పదంగా మృతి చెందడం సంచలనంగా మారింది

=============

# కాకి చేసిన పనికి కాలిబూడిదైన నాలుగు ఇళ్లు.. విజయనగరం జిల్లాలో అగ్నిప్రమాదం

## కార్తిక దీపాన్ని ఎత్తుకొచ్చి ఓ ఇంటిపై పడేసిన కాకి

## తాటాకు ఇల్లు కావడంతో ఎగసిపడ్డ మంటలు

## పక్కనే ఉన్న మరో మూడు ఇళ్లు కూడా దగ్ధం

విజయనగరం జిల్లాలో శుక్రవారం ఘోర అగ్ని ప్రమాదం జరిగింది. నాలుగు తాటాకు ఇళ్లు కాలిబూడిదయ్యాయి. ఈ ప్రమాదానికి కారణం ఓ కాకి చేసిన పనేనని స్థానికులు చెబుతున్నారు. కార్తిక మాసం నేపథ్యంలో గరివిడి మండలం కోనూరులో ఓ కుటుంబం తమ ఇంటి డాబాపై దీపాలను వెలిగించింది. అయితే ఓ కాకి ఇందులో ఓ దీపాన్ని ఎత్తుకెళ్లి సమీపంలోని ఓ ఇంటిపై పడేసింది. ఆ ఇంటి పైకప్పు తాటాకులతో ఉండడం వల్ల నిప్పంటుకుని మంటలు ఎగసిపడ్డాయి. స్థానికులు అప్రమత్తమై మంటలు ఆర్పేందుకు ప్రయత్నించేలోపే చుట్టుపక్కల ఉన్న ఇళ్లకు మంటలు విస్తరించాయి.స్థానికుల సమాచారంతో అక్కడికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది ఫైరింజన్లతో మంటలను అదుపుచేశారు. ఆలోపే నాలుగు తాటాకు ఇళ్లు కాలిబూడిదయ్యాయి. ఇందులో ఓ ఇల్లు కౌలు రైతు నంబూరి గోపిది. ఇటీవలే ఆయన పెట్టుబడి కోసం రూ.లక్ష అప్పు చేసి తెచ్చాడు. ఇంట్లో దాచిన ఆ సొమ్ముతో పాటు ఇంట్లోని అర తులం బంగారం కూడా ఈ మంటలకు బూడిదైందని వాపోయాడు. కాగా, తహసీల్దారు సీహెచ్ బంగార్రాజు ఘటనాస్థలాన్ని పరిశీలించి, సుమారు రూ.4 లక్షల వరకు ఆస్తి నష్టం జరిగినట్లు అంచనా వేశారు. ప్రభుత్వం నుంచి ఆర్థికసాయం అందేలా చూస్తామని బాధితులకు హామీ ఇచ్చారు.

# 66 ఎన్నికల్లో కాంగ్రెస్ పోటీ నామమాత్రమే

## కాంగ్రెస్...ఇక కథనే

న్యూఢిల్లీ, నవంబర్ 16

ఎన్నికల సంఘం ప్రకారం, 2014 నుంచి 2025 వరకు భారతదేశంలో 66 పూర్తి రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు జరిగాయి.'అసెంబ్లీ ఎన్నికలు' అనే పదం ప్రధానంగా పూర్తి రాష్ట్ర ఎన్నికలకు ఉపయోగిస్తారు. బిహార్– 243 స్థానాల్లో ఎన్డీఏ 202 స్థానాల్లో ఆధిక్యంలో ఉండగా, కాంగ్రెస్ 5 స్థానాల్లో ఉంది.ఢిల్లీ– 70 స్థానాల్లో బీజేపీ 48 సీట్లు గెలుచుకోగా, కాంగ్రెస్ ఒక్క సీటు కూడా గెలుచుకోలేదు.ఆంధ్రప్రదేశ్– 175 స్థానాల్లో టీడీపీ కూటమి 164 సీట్లు గెలుచుకోగా, కాంగ్రెస్ ఒక్క సీటు కూడా గెలుచుకోలేదు.అరుణాచల్ ప్రదేశ్– 60 స్థానాల్లో బీజేపీ 46 సీట్లు గెలుచుకోగా, కాంగ్రెస్ 1 సీటు గెలుచుకుంది.ఒడిశా– 147 స్థానాల్లో బీజేపీ 78 సీట్లు గెలుచుకోగా, కాంగ్రెస్ 14 సీట్లు గెలుచుకుంది.సిక్కిం– 32 స్థానాల్లో ఎస్‌కేఎం 19 సీట్లు, కాంగ్రెస్ ఒక్క సీటు మాత్రమే గెలుచుకుంది.హర్యానా– 90 స్థానాల్లో బీజేపీ 48 సీట్లు గెలుచుకోగా, కాంగ్రెస్ 20 సీట్లు మాత్రమే గెలుచుకుంది.మహారాష్ట్ర– 288 స్థానాల్లో బీజేపీ నేతృత్వంలోని కూటమి 230 సీట్లు గెలుచుకోగా, కాంగ్రెస్ 16 సీట్లు గెలుచుకుంది.జార్ఖండ్– 81 స్థానాల్లో జేఎంఎం కూటమి 47 సీట్లు గెలుచుకోగా, కాంగ్రెస్ 15 సీట్లు గెలుచుకుంది.జమ్మూ కాశ్మీర్– 90 స్థానాల్లో ఎన్‌సీ 42 సీట్లు గెలుచుకోగా, కాంగ్రెస్ కేవలం 6 సీట్లు మాత్రమే గెలుచుకుంది.మేఘాలయ– 60 స్థానాల్లో ఎన్డీఏ 31 సీట్లు గెలుచుకోగా, కాంగ్రెస్ 4 సీట్లు మాత్రమే గెలుచుకుంది.నాగాలాండ్– 60 స్థానాల్లో ఎన్డీఏ 37 సీట్లు గెలుచుకోగా, కాంగ్రెస్ ఒక్క సీటు కూడా గెలుచుకోలేదు.కర్ణాటక– 224 స్థానాల్లో కాంగ్రెస్ 135 సీట్లు గెలుచుకుని ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది.మధ్యప్రదేశ్– 230 స్థానాల్లో బీజేపీ 163 సీట్లు గెలుచుకోగా, కాంగ్రెస్ 66 సీట్లు గెలుచుకుంది.రాజస్థాన్– 200 స్థానాల్లో బీజేపీ 115 గెలుచుకోగా, కాంగ్రెస్ 69 సీట్లు గెలుచుకుంది.ఛత్తీస్‌గఢ్– 90 స్థానాల్లో బీజేపీ 54 గెలుచుకోగా, కాంగ్రెస్ 35 సీట్లు గెలుచుకుంది.తెలంగాణ– 119 స్థానాల్లో కాంగ్రెస్ 64 సీట్లు గెలుచుకుని ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది.మిజోరం– 40 స్థానాల్లో జోరాం పీపుల్స్ మూవ్‌మెంట్ 27 సీట్లు గెలుచుకోగా, కాంగ్రెస్ కేవలం 1 సీటు మాత్రమే గెలుచుకుంది. గోవా– 40 స్థానాల్లో బీజేపీ 20 సీట్లు గెలుచుకోగా, కాంగ్రెస్ కేవలం 3 సీట్లు మాత్రమే గెలుచుకుంది.మణిపూర్– 60 స్థానాల్లో బీజేపీ 32 సీట్లు, కాంగ్రెస్ కేవలం 5 సీట్లు మాత్రమే గెలుచుకుంది.ఉత్తరాఖండ్– 70 స్థానాల్లో బీజేపీ 47 సీట్లు, కాంగ్రెస్ 19 సీట్లు గెలుచుకుంది.పంజాబ్– 117 స్థానాల్లో ఆప్ 92 సీట్లు గెలుచుకోగా, కాంగ్రెస్ 18 సీట్లు గెలుచుకుంది.ఉత్తరప్రదేశ్– 403 స్థానాల్లో బీజేపీ 255 సీట్లు గెలుచుకోగా, కాంగ్రెస్ 62 సీట్లు గెలుచుకుంది.గుజరాత్– 182 స్థానాల్లో బీజేపీ 156 సీట్లు, కాంగ్రెస్ కేవలం 4 సీట్లు మాత్రమే గెలుచుకుంది.హిమాచల్ ప్రదేశ్– 68 స్థానాల్లో కాంగ్రెస్ 40 సీట్లు గెలుచుకుని ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది.పశ్చిమ బెంగాల్– 294 స్థానాల్లో టీఎంసీ 213 సీట్లు గెలుచుకోగా, కాంగ్రెస్ ఒక్క సీటు కూడా గెలుచుకోలేదు.అస్సాం– 126 స్థానాల్లో బీజేపీ 60 సీట్లు గెలుచుకోగా, కాంగ్రెస్ 29 సీట్లు గెలుచుకుంది.కేరళ– 140 స్థానాల్లో ఎల్‌డీఎఫ్ 99 సీట్లు గెలుచుకోగా, కాంగ్రెస్ 21 సీట్లు గెలుచుకుంది.తమిళనాడు– 234 స్థానాల్లో డీఎంకే 133 సీట్లు గెలుచుకోగా, కాంగ్రెస్ కేవలం 3 సీట్లు మాత్రమే గెలుచుకుంది.పుదుచ్చేరి– 30 స్థానాల్లో ఎన్డీఏ 16 సీట్లు గెలుచుకోగా, కాంగ్రెస్ కేవలం 2 సీట్లు మాత్రమే గెలుచుకుంది.ఢిల్లీ– 70 స్థానాల్లో ఆప్ 62 సీట్లు గెలుచుకోగా, కాంగ్రెస్ ఒక్క సీటు కూడా గెలుచుకోలేదు.బిహార్– 243 స్థానాల్లో ఎన్డీఏ 125 సీట్లు గెలుచుకోగా, కాంగ్రెస్ 19 సీట్లు మాత్రమే గెలుచుకోగలిగింది.ఆంధ్రప్రదేశ్– 175 స్థానాల్లో వైఎస్ఆర్–కాంగ్రెస్ 151 సీట్లు గెలుచుకోగా, కాంగ్రెస్ ఖాతా తెరవలేదు.అరుణాచల్ ప్రదేశ్– 60 స్థానాల్లో బీజేపీ 41 సీట్లు గెలుచుకోగా, కాంగ్రెస్ కేవలం 1 సీటు మాత్రమే గెలుచుకుంది.ఒడిశా– 147 స్థానాల్లో బీజూ జనతాదళ్ 112 సీట్లు గెలుచుకోగా, కాంగ్రెస్ కేవలం 14 సీట్లు మాత్రమే గెలుచుకుంది.సిక్కిం– 32 స్థానాల్లో ఎస్‌కేఎం 17 సీట్లు గెలుచుకోగా, కాంగ్రెస్ ఒక్క సీటు కూడా గెలుచుకోలేదు.మహారాష్ట్ర– 288 స్థానాల్లో బీజేపీ 132 సీట్లు, కాంగ్రెస్ కేవలం 16 సీట్లు మాత్రమే గెలుచుకున్నాయి.జార్ఖండ్– 81 స్థానాల్లో జేఎంఎం 30 సీట్లు, కాంగ్రెస్ 16 సీట్లు గెలుచుకున్నాయి.కర్ణాటక– 224 స్థానాల్లో బీజేపీ 104 సీట్లు గెలుచుకుంది. కాంగ్రెస్ 78 సీట్లు గెలుచుకుని కూటమిగా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది.త్రిపుర– 60 స్థానాల్లో బీజేపీ 36 సీట్లు గెలుచుకోగా, కాంగ్రెస్ కేవలం 1 సీటు మాత్రమే గెలుచుకుంది.మధ్యప్రదేశ్– 230 స్థానాల్లో కాంగ్రెస్ 114 సీట్లు గెలుచుకుని ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది.ఛత్తీస్‌గఢ్– 90 స్థానాల్లో కాంగ్రెస్ 60 సీట్లు గెలుచుకుని ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది.రాజస్థాన్– 200 స్థానాల్లో కాంగ్రెస్ 99 సీట్లు గెలుచుకుని ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది.గోవా– 40 అసెంబ్లీ స్థానాల్లో బీజేపీ 13 సీట్లు గెలుచుకుని కూటమి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయగా, కాంగ్రెస్ 17 సీట్లు గెలుచుకుంది.మణిపూర్– 60 స్థానాల్లో బీజేపీ 21 సీట్లు గెలుచుకుని కూటమి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయగా, కాంగ్రెస్ 28 సీట్లు గెలుచుకున్నా అధికారంలోకి రాలేదు.ఉత్తరప్రదేశ్– 403 స్థానాల్లో బీజేపీ 312 సీట్లు గెలుచుకోగా, కాంగ్రెస్ కేవలం 7 సీట్లు మాత్రమే గెలుచుకుంది.ఉత్తరాఖండ్– 70 స్థానాల్లో బీజేపీ 57 సీట్లు గెలుచుకోగా, కాంగ్రెస్ 11 సీట్లు గెలుచుకుంది.పంజాబ్– 117 స్థానాల్లో కాంగ్రెస్ 77 సీట్లు గెలుచుకుని ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది.హిమాచల్ ప్రదేశ్– 68 అసెంబ్లీ స్థానాల్లో బీజేపీ 44 సీట్లు గెలుచుకోగా, కాంగ్రెస్ 21 సీట్లు మాత్రమే గెలుచుకోగలిగింది.గుజరాత్– 182 అసెంబ్లీ స్థానాల్లో బీజేపీ 99 సీట్లు, కాంగ్రెస్ కేవలం 80 సీట్లు మాత్రమే గెలుచుకున్నాయి.2016లో అస్సాం– 126 స్థానాల్లో బీజేపీ 86 సీట్లు గెలుచుకోగా, కాంగ్రెస్ కేవలం 25 సీట్లు మాత్రమే గెలుచుకుంది.కేరళ– 140 స్థానాల్లో ఎల్‌డీఎఫ్ 91 సీట్లు గెలుచుకోగా, కాంగ్రెస్ ఒక్క సీటు కూడా గెలుచుకోలేదు.తమిళనాడు– 232 స్థానాల్లో ఏఐఏడీఎంకే 136 సీట్లు గెలుచుకోగా, కాంగ్రెస్ కేవలం 8 సీట్లు మాత్రమే గెలుచుకుంది.పశ్చిమ బెంగాల్– 294 స్థానాల్లో టీఎంసీ 211 సీట్లు గెలుచుకోగా, కాంగ్రెస్ ఖాతా తెరవలేదు.పుదుచ్చేరి– 30 స్థానాల్లో ఎన్డీఏ 17 సీట్లు, కాంగ్రెస్ 15 సీట్లు గెలుచుకున్నాయి.2015లో 2 అసెంబ్లీ ఎన్నికలుఢిల్లీ– 70 స్థానాల్లో ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) 67 సీట్లు గెలుచుకోగా, కాంగ్రెస్ ఒక్క సీటు కూడా గెలుచుకోలేదు.బిహార్– 243 స్థానాల్లో మహాకూటమి 178 సీట్లు గెలుచుకోగా, అప్పుడు కూడా కాంగ్రెస్ ఖాతా తెరవలేదు.2014లో 8 అసెంబ్లీ ఎన్నికలుఆంధ్రప్రదేశ్– 175 స్థానాల్లో వైఎస్ఆర్–కాంగ్రెస్ 67 సీట్లు గెలుచుకుంది. కాంగ్రెస్ ఒక్క సీటు కూడా గెలుచుకోలేదు.అరుణాచల్ ప్రదేశ్– 60 స్థానాల్లో కాంగ్రెస్ 42 సీట్లు గెలుచుకుంది.ఒడిశా– 147 స్థానాల్లో బీజూ జనతాదళ్ 117 సీట్లు గెలుచుకోగా, కాంగ్రెస్ కేవలం 16 సీట్లు మాత్రమే గెలుచుకుంది.సిక్కిం– 32 స్థానాల్లో సిక్కిం డెమోక్రటిక్ ఫ్రంట్ 22 సీట్లు గెలుచుకోగా, కాంగ్రెస్ ఖాతా తెరవలేదు.హర్యానా– 90 స్థానాల్లో బీజేపీ 47 సీట్లు గెలుచుకుని ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయగా, కాంగ్రెస్ 15 సీట్లు గెలుచుకుంది.మహారాష్ట్ర– 288 స్థానాల్లో బీజేపీ 122 గెలుచుకోగా, కాంగ్రెస్ 42 సీట్లు గెలుచుకుంది.జార్ఖండ్– 81 స్థానాల్లో బీజేపీ 37 సీట్లు గెలుచుకోగా, కాంగ్రెస్ కేవలం 6 సీట్లు మాత్రమే గెలుచుకుంది.జమ్మూ కాశ్మీర్– 87 స్థానాల్లో పీడీపీ 28 సీట్లు గెలుచుకోగా, కాంగ్రెస్ కేవలం 7 సీట్లు మాత్రమే గెలుచుకోగలిగింది.ఎన్నికల సంఘం వెబ్‌సైట్ ప్రకారం, గత 11 ఏళ్లలో 66 పూర్తి అసెంబ్లీ ఎన్నికలు జరిగాయి. వీటిలో కాంగ్రెస్ మొత్తం 8 ఎన్నికల్లో గెలిచింది. 58 ఎన్నికల్లో ఓడిపోయింది. ఇక్కడ ఓటమి అంటే మెజారిటీ రాకపోవడం లేదా కూటమికి నాయకత్వం వహించకపోవడం. ఓటు వాటా సగటున 19% ఉంది, కానీ సీట్ల మార్పిడి తగ్గింది. బీజేపీ ప్రభ, ప్రాంతీయ పార్టీల బలం, సంస్థాగత బలహీనత కాంగ్రెస్‌ను ఓడిపోయిన పార్టీగా మార్చాయి.

# పరిసరాల పరిశుభ్రత తో పాటు వ్యక్తిగత శుభ్రత ఎంతో అవసరం.

## ఇంచార్జి జాయింట్ కలెక్టర్, కమిషనర్ ఎన్. మౌర్య.

తిరుపతి నవంబర్ 16

పరిసరాల పరిశుభ్రత తో పాటు ప్రతి రోజూ స్నానం చేయడం, చేతులు శుభ్రంగా కడుక్కోవడం వంటి వ్యక్తిగత శుభ్రత తో ఆరోగ్యంగా జీవించగలమని ఇంచార్జి జాయింట్ కలెక్టర్, నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్. మౌర్య తెలిపారు. స్వర్ణ ఆంధ్ర = స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం లో భాగంగా మూడవ శనివారం నగరంలోని స్కావెంజర్స్ కాలనిలో పరిసరాల పరిశుభ్రత = వ్యక్తిగత పరిశుభ్రతపై ప్రజలకు అవగాహనా కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. ఏపి గ్రీనరీ అండ్ బ్యూటిఫికేషన్ ఛైర్పర్సన్ సుగుణమ్మ, రాష్ట్ర యాడవ కార్పొరేషన్ చైర్మన్ నరసింహ యాదవ్, డిప్యూటీ మేయర్ ఆర్.సి.మునికృష్ణ, కార్పొరేటర్ దూది కుమారి, రాష్ట్ర నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ రుద్రకోటి సదాశివం, ఎస్సీ కార్పొరేషన్ మెంబెర్ కుమారమ్మ, రజక కార్పొరేషన్ డైరెక్టర్ చంద్ర, అధికారులు ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ స్వర్ణ ఆంధ్ర – స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం లో భాగంగా ప్రతి మూడవ శనివారం రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని అన్నారు. అందులో భాగంగా ఈ వారం స్కావెంజర్స్ కాలనిలో వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తున్నామని అన్నారు. స్కావేంజర్స్ కాలానితో పాటు అన్ని ప్రాంతాల్లో చెత్త కుప్పలు లేకుండా చూడడం, మరుగుదొడ్లు శుభ్రంగా ఉంచడం వంటివి నిర్వహిస్తామని తెలిపారు. అలాగే మన ఇందులో ఎటువంటి ఫంగస్ ఉండకుండా చూసుకోవడం, డ్రైనేజి కాలువలు ఉంచుకోవడం వంటి వాటిపై అవగాహన కల్పిస్తామని తెలిపారు. ఆరు బయట మాలమూత్ర విసర్జన నిరోధించడం, స్కూల్లలో మరుగుదొడ్లు శుభ్రంగా ఉంచుకోవడం, ప్రతి రోజూ స్నానం చేయడం, రోగాల నియంత్రణకై చేతులు శుభ్రం చేసుకోవడం వంటి వాటిపై నగరపాలక సంస్థ సిబ్బంది అవగాహన కల్పిస్తారని తెలిపారు. ప్రతి ఒక్కరూ వీటిని పాటించి ఆరోగ్యాకరమైన జీవనం గడపాలని సూచించారు. ఈ కార్యక్రమం లో డిప్యూటీ కమిషనర్ అమరయ్య, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, డిసిపీ ఖాన్, నగరపాలక సంస్థ సిబ్బంది, ప్రజా ప్రతినిధులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

=======================

# భూదానోద్యమ ద్రష్ట 'భారత రత్న' ఆచార్య వినోబా భావే

(భారత శక్తి ప్రత్యేక ప్రతినిధి, హైదరాబాద్)

అనాదిగా వేద భూమిగా, జ్ఞాన భూమిగా, కర్మ భూమిగా, ధర్మ భూమిగా, పుణ్య భూమిగా విశ్వంలో ఖ్యాతి గడించిన భారతదేశంలో ఎందరెందరో మహనీయులు జన్మించి ప్రపంచానిక్కి జ్ఞానభిక్షను ప్రసాదించారు. వారి కోవలోకి వస్తారు ఆచార్య వినోబా భావే.

ఆ మహనీయుని 43వ వర్ధంతిని పురస్కరించుకుని మీకు అందిస్తున్న ప్రత్యేక వ్యాసం.

ఆచార్య వినోబాభావే మహారాష్ట్ర లోని గగోదేలో 1895, సెప్టెంబర్ 11న ఒక సాంప్రదాయచిత్‌పవన్ బ్రాహ్మణ కుటుంబంలో జన్మించా రు. బాల్యంలో వినోబాజీ భగవ ద్గీత చదివి స్ఫూర్తి పొందాడు.వారు గాంధీజీతో పాటు భారత స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొని, బ్రిటీషుప్రభుత్వానికి వ్యతిరేకంగా చేసిన పోరాటానికి గాను 1932లో జైలు కెళ్ళారు. జైల్లో సహ ఖైదీలకు, తనమాతృభాష మరాఠీలో భగవద్గీతపై కొన్నిఉపన్యాసాలిచ్చాడు. అత్యంత స్ఫూర్తిదాయకమైన ఈ ఉపన్యాసాలే ఆతరువాత 'టాక్స్ ఆన్ ది గీత' అన్న పుస్తకంగా వెలువడ్డాయి. ఈ పుస్తకము దేశవిదేశాల్లో అనేక భాషల్లోకి అనువదించబడింది. వినోభాజీ "ఈ ఉపన్యాసాలకు ప్రేరణ మానవాతీతమైనదని, తన ఇతర రచనలు సమసిపోయినా ఈ ఉపన్యాసాల ప్రభావం మాత్రం ఎప్పటికీ ఉండిపోతుందని" నమ్మేవారు.

సంఘ సంస్కర్తగా, ఆధ్యాత్మిక వేత్తగా

భారతదేశంలోని పల్లెల్లో జీవించే సగటుజీవి అనుభవించే కష్టాలకు సమస్యలను అన్వేషించడంలో చాలా కృషిని సలిపారు. కొన్నింటికి ఆధ్యాత్మిక ధోరణి సమంజసం అని కూడా భావించారు. ఈ ధోరణి క్రమేణా 'సర్వోదయ' ఉద్యమానికి దారితీసింది. వినోబా భావేతో మమేకం చెందిన మరొక మహత్తర కార్యక్రమం భూదానోద్యమం. నూతన తరహాలో నడచిన ఈ భూదానోద్యమ ప్రచారంలో భాగంగా, దేశం నలుమూలలు పాదయాత్ర చేశాడు. ప్రతీ భూకామందుని వ్యక్తిగతంగా, తనను కొడుకుగా భావించి, కొంతైనా భూమిని ఇవ్వాలని ప్రార్థించాడు. అలా సేకరించిన భూమిని పేదలకు దానం ద్వారా పంచి పెట్టాడు. అహింస, ప్రేమలను మేళవించిన విధానం ఆయన తత్వం. వినోబాజీ అంటే వెంటనే స్ఫురించే అంశం – గోహత్య విధాన నిర్మూలనం.

వినోబాజీ తన జీవిత చరమాంకం, మహారాష్ట్రలోని పౌనాబులో నిర్మించుకున్న ఆశ్రమ వాతావరణంలో గడిపారు. ఇందిరా గాంధీ విధించిన అత్యవసర పరిస్థితిని సమర్థించిన వారిలో వినోబాజీ ఒకరు కావడం, ఆ కాలాన్ని అనుశాసన పర్వంగా అభివర్ణించి, క్రమశిక్షణకు సరియైన సమయం అని వ్యాఖ్యానించారు.

విద్వత్తు ఉన్నచోట వివాదం, అసూయలు జనిస్తాయి. "తర్కంలేని అతి గాంధీవాదం వినోబాజీది." అని ప్రముఖ సాహితీవేత్త వి. ఎస్. నైపాల్ విమర్శించాడు. కాని, భారతీయ ఆర్థిక, రాజకీయ విధానంతో భాగస్వామ్యం పొందని నైపాల్ నుంచి యిటువంటి విమర్శలు రావడం చాలా విడ్డూరం! అని ప్రతి విమర్శలు కూడా వచ్చాయి.

భూదానోద్యమ ద్రష్టగా

1951 ఏప్రిల్ 18 న యాదాద్రి భువనగిరి జిల్లాలో వినోబా భావే పోచంపల్లి మండలంలో ప్రవేశించాడు. మొట్టమొదటి సారి భూదానోద్యమం ఇక్కడే నుండే ప్రారంభించబడింది. అందుకే దీనికి భూదాన్ పోచంపల్లి అని పిలుస్తారు. యాదాద్రి భువనగిరి జిల్లాలో పోచంపల్లిలోకి మొదటి సారి వినోబా భావే ప్రవేశించినప్పుడు వారిని గ్రామస్తులు స్వాగతించారు. కొంత కాలం పోచంపల్లిలో ఉన్నారు. వారు అక్కడ 75% కంటే ఎక్కువ మంది భూమిలేని పేద గ్రామస్తులు ఉన్నారని తెలుసుకున్నారు. గ్రామస్తులు వారిని కలవటానికి వచ్చి 80 ఎకరాల (సగం తడి భూములు, ఇంకో సగం పొడి భూములు) భూమి కావాలని అడిగారు. అప్పుడు వినోబాజీ గ్రామస్తులందరికి ప్రభుత్వమే ఎందుకు సహాయం చేయాలి? భూస్వాములు తోటి పేదలకు సహాయ పడవచ్చుకదా! అని అన్నారు. అప్పుడు వెంటనే వెదిరె రామచంద్రారెడ్డి అనే ఒక భూస్వామి నేను పేదలకు 100 ఎకరాల భూమి ఇస్తాను అని వాగ్దానం చేశాడు. దీనితో, భారతదేశ భూసమస్యను పరిష్కరించే సామర్థ్యం ఈ ఉద్యమానికి ఉందని వినోబా భావే భావించి అక్కడ ఆ విధంగా భూదాన్ ఉద్యమం ఆరంభించారు.

ఆధ్యాత్మిక, తాత్విక రచనలు

వినోబాజీ ఒక గొప్ప సంఘ సంస్కర్త, రచయిత మరియు ఆలోచనాపరుడు. వారి రచనలు ఆధ్యాత్మిక, సామాజిక మరియు తాత్విక అంశాలను లోతుగా పరిశోధిస్తాయి, గాంధేయ ఆదర్శాలు మరియు అహింస పట్ల వారి నిబద్ధతను ప్రతిబింబిస్తాయి. వారు రాసిన కొన్ని ప్రముఖ రచనలు, 'గీతా ప్రవచనాలు', 'మిత్ర మనిషి', 'రమణి', 'సంకల్ప శతకము'

గీతా ప్రవచనాలులి భగవద్గీతపై ఆయన చేసిన ప్రవచనాల ఆధారంగా ఇది ఒక ముఖ్యమైన రచన.

మిత్ర మనిషిలి ఇది స్నేహం మరియు సహకారం యొక్క ప్రాముఖ్యతను నొక్కి చెబుతుంది.

సంకల్ప శతకములి ఆయన యొక్క ఆధ్యాత్మిక మరియు సామాజిక ఆలోచనలను ప్రతిబింబించే రచన.

సామాజిక, తాత్విక రచనలు

రమణి : ఇది స్త్రీల ఆదర్శాలను మరియు వారి సామాజిక పాత్రను విశ్లేషిస్తుంది.

భూదాన్ ఉద్యమంలి : భూమిలేని వారికి భూమిని పునఃపంపిణీ చేయడానికి ఆయన ప్రారంభించిన ఈ ఉద్యమం, ఆయన రచనల్లో కూడా ప్రతిబింబిస్తుంది.

వ్యాసాలు, లేఖలు

వినోబాజీ అనేక వ్యాసాలు, సంపాదకీయాలు మరియు లేఖలు కూడా రాశారు.

వారు అనేక పత్రికలలో కూడా ప్రచురితమయ్యారు.

వరించిన పురస్కారాలు

1958 లో వినోబాజీకి సామాజిక నాయకత్వంపై "రామన్ మెగసెసే" పురస్కారం మొట్టమొదటి స్వీకర్త వినోబాజీ కావడం భారతదేశానికి దక్కిన గౌరవంగా భావించవచ్చు. 1983లో 'భారతరత్న' బిరుదుని వినోబా మరణాంతరం వెంటనే బహూకరించారు.

వినోబాజీ భావజాలం

– విప్లవాలకు ఆధ్యాత్మికభావాలే మూలం

– మానవుల హృదయాలను మనస్సులను ఏకీకృతం చేయడానికే నా కార్యక్రమాలపై దృష్టి పెట్టడం జరిగింది.

– ప్రశాంతత అనేది మానసికం, ఆధ్యాత్మకం. ఈ ధోరణులనుంచే మానవుల వ్యక్తిగత జీవితాల్లో ప్రవేశిస్తాయి. ప్రపంచగమనం వీటిపైనే ఆధారపడింది.

జై జగత్! విశ్వానికి విజయం! బీదప్రజల హృదయాలను సుసంపన్నంగాను, సంపన్నప్రజల హృదయాలను బీదతనంతోను భగవంతుడు సృష్టించడం విడ్డూరం, ఆశ్చర్యకరం. ప్రజాశక్తి, ప్రజాబలం సంకల్పంగా సాధించాలి. హింసాయుత, బలవంతపు అధికారిక రాజ్యపాలనం ఆహ్వానించదగ్గది కాదు. ఏ దేశమైనా, సైన్యం, యుద్ధసామగ్రి బలంతో కాక, నైతినబలంతో సమర్థించుకోవాలి. పాతపడిన యుద్ధసామగ్రితో కొత్త యుద్ధాలు చేయగలగడం అసాధ్యం. ప్రభుత్వాల తప్పిదాలపై విమర్శించ వలసిన పని నాకు లేదు. మంచి పనులని అనుకున్నవాటిపై నా విమర్శ ఉంటుంది. విప్లవవాదాన్ని ప్రభుత్వమే ప్రచారం చేస్తుంది అన్న భావం, భావన ఎన్నటికీ రానీయకూడదు.

– అహింసా విధానాలపై నిదానధోరణిని అవలబించకూడదు. అహింసామార్గం ద్వారా, అనుకున్న లక్ష్యాలను సాధించాలంటే, కాలయాపన, జాప్యం శతృవులు అనే అనుకోవాలి. పట్టు ఎంతమాత్రం సడలకూడదు. మెతకదనం, వనలేని, ప్రభావంలేని అహింసావిధానాలను అవలంబించినందువల్ల ప్రస్తుత స్తబ్ధత కొనసాగే ప్రమాదంతోపాటు, పెరుగుదల, అభివృద్ధి చతికిలబడతాయి. చివరకు పరాజయం, నిరాశ తప్పవు.


– సమాజసేవ, అహింసామార్గం, గోరక్షణ, ఆధ్యాత్మకధోరణి, కుష్టివ్యాధిగ్రస్థులకు సహాయ సహకారాలు, భూదానోద్యమం, యిలా ఎన్నో సేవలను అందించిన వినోబాజీ వివాదం లేని పరమాచార్యులు. భారతదేశానికి ప్రధానాచార్యులలో ఒకరు అని కచ్చితంగా చెప్పవచ్చు.

ఆచార్య వినోబా భావే 1982, నవంబర్ 15 న, చివరి రోజుల్లో ఆహారం, నీరు తీసుకోడానికి నిరాకరించి, సల్లేఖనంగా (ఇది జైనమతంలో ఒక ఆచారం. దీనిలో, వ్యక్తి క్రమంగా ఆహారం, నీరు వంటి వాటిని తీసుకోవడం మానేసి, స్వచ్ఛందంగా ఉపవాసం ఉంటాడు. దీని లక్ష్యం శరీరాన్ని, దాని కోరికలను క్షీణింపజేయడం, తద్వారా కర్మల ప్రభావం తగ్గి మోక్షం పొందడం) భావించి దివంగతులయ్యారు. భౌతికంగా వినోబాజీ మనకు దూరమైనా వారు చూపిన ఆధ్యాత్మిక మార్గంలో పయనిద్దాం! భారత దేశాన్ని గురు స్థానంలో నిలబెడదాం!

"సాహిత్య కళా విభూషణ"
నంది పురస్కార గ్రహీత
చౌదూరి నరసింహారావు
సాహిత్య, సామాజిక విశ్లేషకులు

# సామాన్యుని ఆలోచనలే భూమిపుత్రిక లో అక్షరాలు"

ఆధునికత వైపు పరుగులు పెడుతున్న నేటితరం యువత, ఆధునికత అంటే నైతిక,ఆధ్యాత్మిక,సామాజిక విలువల పట్ల తిరస్కార భావం కాదని తెలియచేసే వివిధ మార్గాలలో "కవిత్వం" ఒకటి.ప్రతి పదం,ప్రతి ఆలోచన సమాజానికి ఉత్తేజాన్ని కల్గిస్తు,నాటి నేటి పరిస్థితులను వివరిస్తూ, మనిషి ఎలా మసలు కోవాలో తెలియచేస్తూ తమ భావోద్వేగాలను అద్భుతమైన కవితలుగా రాస్తున్నారు కొందరు.అలాంటి కవయిత్రులలో మరింత కొత్తదనం చొప్పించి నేటి పరిస్థితులకు అనుకూలంగా కవితలు రాస్తున్న కవయిత్రి శ్రీమతి అంగల శ్రీవాణి.




చుట్టూ కొండలు,కొండలమధ్య ఓ గ్రామము, గ్రామములోకి రాకపోకల కొరకు రెండే దారులు ఒకటి కోరుట్ల వైపు మరోటి వేములవాడ వైపు, ఎటువైపు చూసినా అడవి, ఆ స్వచ్ఛమైన గ్రామమే తెలంగాణ రాష్ట్రములో రాజన్న సిరిసిల్ల జిల్లాలోని "రుద్రంగి".పుట్టిన ఊరు,మెట్టిన ఊరు రెండు ఒకటే కావడం, నలుగురు ఆడపిల్లల్లో పెద్ద కూతురిగా ఉండడం,తండ్రికి కొడుకుగా అన్నిట్లో భాద్యతలు నిర్వహించడం, చిన్ననాటి నుండి సాటివారికి సహాయ పడడం,తనకు తాను అన్నిరంగాల్లో ముందుండేలా కృషి చేయడం శ్రీవాణి కి చిన్ననాటి నుండి అలవాటు.ఆటల్లో,పాటల్లో చలాకీగా ఉంటూ, ప్రైవేటు పాఠశాలలో ఉపాధ్యాయురాలుగా పనిచేసి,ప్రస్తుతం క్లస్టర్ రిసోర్స్ పర్సన్ గా భాద్యతలు నిర్వహిస్తూ, ఒక మంచి గృహిణిగా ఉన్న శ్రీవాణి రచించిన కవితల సంకలనం "భూమిపుత్రిక"

''అమ్మపదం తెలుగు'' అనే కవితలో తెలుగు భాష గొప్పదనం గురించి,స్నేహబంధమై నా ప్రాణమై అనే కవితలో స్నేహము యొక్క గొప్పతనము,మూడు రంగుల జండా ఎగిరింది గగనాన అనే కవితలో జాతీయ పతాకం యొక్క గొప్పతనం గురించి ,నేటి కాలములో ఆదరణ కోల్పోతున్న, "గ్రంథాలయాల" మనుగడ కోసం వాటి ప్రాధాన్యత చక్కగా కవయిత్రి కలం నుండి వెలువడింది.తాను నివసిస్తున్న అటవీప్రాంత గ్రామమైన రుద్రంగి పచ్చని పైరులను,పల్లె అందాలను వర్ణిస్తూనే, చిన్ననాడు ఎదురైనా సంఘటనల్లో పోలీసన్న విధి నిర్వహణ గురించి,రాత్రనక పగలనక రక్షిస్తున్న తీరు గురించి వివరిస్తూ "భరతమాత ముద్దు బిడ్డలని" వారి సేవలు చిరస్మరణీయం అని కొనియాడడం బాగుంది.

కడుపులోని బిడ్డ కదలికలను చూసి

పరవశించి పోవు అమ్మ హృదయం అంటూ తల్లి హృదయాన్ని, పసి ముఖములో తన రూపం చూసుకొని పరవశించిన తండ్రి హృదయాన్ని కూడా ఎంతో అర్ద్రతతో తన కవితలో తెలియచేశారు.మరో కవితలో "మనసు మారితే, మనిషి మారుతాడని, మనసే అన్నిటికీ మూలం అని చక్కగా వివరిస్తూ, నీ వ్యక్తిత్వాన్ని తెలియచేసేదే నీ సంస్కారం అని సంస్కారం యొక్క గొప్పతనాన్ని గొప్పగా తెలియచేశారు.కులవృత్తుల కోసమని కొన్ని కవితల్లో పద్మశాలీల మగ్గాల జీవితం, రైతన్నల శ్రమజీవనం, స్వర్ణకారుల పనితనం, నాయిబ్రహ్మణుల నైపుణ్యం, వడ్రంగి కర్రలతో కళా నైపుణ్యం, గృహనిర్మాణం లో మేస్త్రి పనితనం ఇలా కులవృత్తుల గౌరవాన్ని తన కవితల్లో విడమరిచి చెప్పిన విధానంతో కులవృత్తుల పై మరింత గౌరవం పెరిగేలా చేశారు.

ఓటు అనే కవితలో మందు,విందుల వ్యామోహాలలో పడవద్దని ఓటు అనే ఆయుధాన్ని సక్రమంగా వాడాలని తెలియచేసారు.గంజాయి ఏరులై పారుతూ,మత్తులో యువతను ముంచుతూ జీవితాలను చెదగొడుతున్న గంజాయిని తరుమాలని యువతకు తెలియిచేయడం బాగుంది.వీడుకోలు వీడుకోలు గురువుగారికి అనే మరొకవితలో ఎందరో జీవితాలకు ఆదర్శంగా నిలిచింది,ఉత్తమ పౌరులను తయారు చేయడంలో నిరంతరం శ్రమించి,కోపముతో కొట్టినా ప్రేమతో తిట్టినా విద్యార్థి భవిష్యత్ కోసమని తన సామర్థ్యాన్ని ధారపోసిన ఉపాధ్యాయుడికి వందనాలు అనే కవిత బాగుంది.

ఇలా ఎన్నెన్నో శీర్షికలతో ఎన్నో అంశాలను తడుముతున్న కవితలను చదివితే.... మాటలను వెతకక, భావాలకు తడుమక రచించే మంచి లక్షణం అంగాల శ్రీవాణి లో ఉన్నట్లు స్పష్టంగా కనిపిస్తోంది. ఎన్నో కవితలు రాసినాకుడా ఆగకుండా ఇప్పటికీ తన "లక్ష్యాన్ని" చేరుకున్న అంగల శ్రీవాణి కి అభినందనలు.

"భూమిపుత్రిక"గా వెలువడుతున్న మొదటి పుస్తకములో ఎన్నో వైవిధ్యభరితమైన కవితల్లో తన ఆత్మానుభూతులను వెలువరించి చిన్ననాటి ఆలోచనలు జోడించి,నాటి స్థితిగతులు వివరించిన అంగల శ్రీవాణి భూమిపుత్రిక పాఠకుల హృదయాలను హత్తుకుంటుందని,కవయిత్రి కలం నుంచి మరెన్నో కవితా సంపుటులు, వెలువడాలని ఆశిస్తూ...ఆశీర్వదిస్తూ

గడప రఘుపతిరావు
విమర్శకుడు,రాష్ట్ర ఉత్తమఉపాధ్యాయ అవార్డు గ్రహీత
raghupatiraog@gmail.com
9963499282

# జీవిత దిక్సూచి పుస్తక పఠనం

## (నవంబర్ 14 వ 20 వరకు (2025) 58వ జాతీయ గ్రంథాల వారోత్సవాల సందర్భంగా)

పుస్తకం ఓమంచి నేస్తం
అమ్మలా లాలిస్తుంది
నాన్నలా ఆదరిస్తుంది
గురువులా బోధిస్తుంది

పుస్తకం ఒంటరితనాన్ని
తుంచి ఆందోళనను అడ్డుకొని
అక్కున చేర్చుకుంటుంది
బాధపడే వారిని ఓదార్చుతుంది
అలసిన మనసుకు సేధ
తీర్చుతు%శీ%ది

పుస్తకాలు జ్ఞాన నిలయాలు
అజ్ఞానాన్నిపారదోలే విజ్ఞాన
విపంచులు వివేకం విచక్షణ
విశ్లేషణా సామర్థ్యాల.వికాస
కేంద్రాలు జ్ఞాన వ్యాప్తితో
సమాజ అభివృద్ధికి మార్గదర్శి

అన్ని వయసుల వారికి
పుస్తకం ఆత్మీయనేస్తం
మేధోమధనానికి వేదిక

సృజనకు సాన పెట్టేది
శాస్త్రీయ ఆలోచనకు
బీజం వేసేది చర్చలకు

వేదికై విజ్ఞానవిపంచియై
వర్ధిల్లేవి పుస్తకాలే

పుస్తకాలు సకల
సమగ్ర సమాచార
నిధి చరిత్ర సంస్కృతి
నాగరికత జ్ఞాన పరిరక్షణ
జ్ఞాన పరివ్యాప్తికి
సామాజిక సంస్కరణలకు
జాతి వారసత్వానికి వారధి

విజ్ఞాన వికాస సారథి
పుస్తక పఠనం
అజ్ఞానాన్ని పారద్రోలి
విజ్ఞాన వికాసానికి
పరిశీలన పరిశోధన
పరికల్పన ప్రక్రియల్లో
నైపుణ్యతను
శాస్త్రీయతను పెంచేది
ప్రతిభను పంచేది
పుస్తకమే

పుస్తక పఠనం యువత
పోటీ పరీక్షలకు విజ్ఞాన
సోపానాలుజి
జ్ఞాన పరులను సమాజానికి
అందించే ఫిల్టర్లు

పుస్తకాలు విశ్వంలోని
సమాచారాన్ని ప్రజల
ముంగిట్లోకి చేర్చి
గ్రామీణ యువత పోటీ
పోటీ పరీక్షలు ఎదుర్కొనే
ధైర్యాన్ని ఇస్తాయి

విశ్వ విజేతలుగా
ఎదగడానికి బాట
చూపుతాయిజి
మానవునికి దశ దిశ
నిర్దేశకత్వ%శీ%లో
మార్గదర్శిగా నిలుస్తాయి

జీవన సాఫల్యతకు
దిక్సూచి పఠనం
భారతీయ సంస్కృతి
చాటేది పుస్తక పఠనమే

పఠనంతో పదజాలం
పెరుగుతుంది
పఠనం ప్రపంచ దేశాల
సంభంధాల వారథి

పుస్తక పఠనం అధ్యయన
శీలత కలిగిన వ్యక్తులే
ప్రపంచంలో చరిత్ర
నిర్మాతలుగా రాణించారు

పఠనంతో ప్రగతి పురోగతి
పుస్తక పఠనం తో మానవ
వనరుల సర్వతోముఖాభివృద్ధి
జరిగి విజ్ఞాన సమాజం
ఆవిర్భవిస్తుంది
పఠనం సామాజిక ఉద్యమ
స్థాయికి ఎదగాలి

ప్రపంచంలో సింగపూర్
ఫిన్లాండ్ దేశాల్లో పౌర
గ్రంథాలయాలకు ఇచ్చిన
ప్రాధాన్యాన్ని స్ఫూర్తిగా
తీసుకొని ప్రభుత్వం
పౌరసమాజం గ్రంథాలయ
వ్యవస్థ వికాసానికి
సమగ్ర చర్యలు చేపట్టాలి

నేదునూరి కనకయ్య
అధ్యక్షులు
తెలంగాణ ఎడుకేషన్ ఫోరం
తెలంగాణ వికాస వేదిక
తెలంగాణ ఎకనామిక్ ఫోరం
9440245771

# పల్సి గ్రామంలో పశువైద్యుడి నిర్లక్ష్యంపై ఆగ్రహం – గేదె మృతి, గ్రామస్తుల బైఠాయింపు.



ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో నవంబర్ 16 (భారత శక్తి): కుబీర్ మండలంలోని పల్సి గ్రామంలో పశువైద్యుడి నిర్లక్ష్యం కారణంగా గేదె మృతి చెందిన ఘటన ఊహించని ఉద్రిక్తతను రేపింది. గ్రామస్తులు పశువుల ఆసుపత్రి ముందు బైఠాయించి తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. రైతు రాజేష్‌కు న్యాయం చేయాలని, నిర్లక్ష్య వైద్యం చేసిన పశువైద్యుడిపై కఠిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.అనారోగ్యంతో బాధపడుతున్న గేదెకు వైద్యం కోసం రాజేష్ పశువైద్యుడిని పిలిపించగా, ఆయన సరైన పరీక్షలు చేయకుండానే నిర్లక్ష్యంగా మందులు పెట్టి వెళ్లిపోయారని రైతు ఆరోపించాడు. అనంతరం గేదె పరిస్థితి విషమించి మృతి చెందడంతో గ్రామస్తులు ఆగ్రహభరితులయ్యారు. విధులకు తరచూ గైర్హాజరయ్యే ఈ వైద్యుడిపై ఉన్న ఫిర్యాదులను అధికారులు పట్టించుకోకపోవడాన్ని కూడా గ్రామస్తులు ప్రశ్నించారు.

తన ఆవేదనలో రైతు రాజేష్ మృతి చెందిన గేదెను పశువుల ఆసుపత్రి ప్రాంగణంలో వదిలి వెళ్లడంతో అక్కడ ఉద్రిక్త వాతావరణం నెలకొంది. దాదాపు గంటపాటు సాగిన ఈ బైఠాయింపులో రైతుకు న్యాయం చేయాలని, పశువైద్య విభాగం స్పందించాలని గ్రామస్తులు పట్టుబట్టారు. అధికారులు స్పందించే వరకు తమ పోరాటం కొనసాగుతుందంటూ గ్రామస్తులు హెచ్చరించారు.

# పోలీస్ అక్క కేజీబీవీ విద్యార్థులతో 24 గంటలు గడిపిన 'పోలీస్ అక్క' టీమ్‌లు



ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో నవంబర్ 16 ( భారత శక్తి) సైబర్ అవగాహన నుండి యోగ వరకు %-% కేజీబీవీ విద్యార్థులకు జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల ప్రత్యేక అవగాహన కల్పించారు. తన వినూత్న ఆలోచనల మేరకు రూపొందిన "పోలీస్ అక్క" కార్యక్రమంలో భాగంగా, శనివారం రాత్రి అన్ని "పోలీస్ అక్క" టీమ్‌లు తమ తమ స్టేషన్ పరిధిలోని కేజీబీవీ పాఠశాల పిల్లలతో కలిసి 24 గంటలు స్కూల్ లోనే గడపడం జరిగింది.

ఈ కార్యక్రమంలో భాగంగా మహిళా పోలీసులు.

- పాఠశాలలో పిల్లలతో కలిసి భోజనం చేసి, రాత్రి అక్కడే బస చేశారు.

- పిల్లలతో మమేకమై స్నేహపూర్వకంగా సమయం గడిపారు

- మహిళల భద్రత, చట్టాలపై అవగాహన కల్పించారు

- సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తూ, గుడ్ టచ్ - బ్యాడ్ టచ్ పై గురించి చెప్పడం జరిగింది.

- చదువుపై ఆసక్తి, ఆత్మవిశ్వాసం పెంపొందించేలా మోటివేషన్ అందించారు.

- వారి సమస్యలు, భవిష్యత్తు ఆశయాల గురించి క్లుప్తంగా అడిగి తెలుసుకున్నారు

-వారితో కలిసి చిరునవ్వులు పంచుతూ, మానవత్వాన్ని చాటారు.

- ఉదయమే యోగ మరియు ఫిజికల్ ఎక్సర్సైజ్ లు నేర్పించటం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల ఐపీఎస్ మాట్లాడుతూ "విద్యార్థుల హృదయాల్లో భద్రతా భావనను బలపరిచే లక్ష్యంతో 'పోలీస్ అక్క'కార్యక్రమాన్ని ప్రారంభించాము. చిన్నారులతో నేరుగా సమయం గడిపే ఈ కార్యాచరణ ద్వారా, వారు ఎదుర్కొంటున్న సమస్యలను దగ్గరుండి తెలుసుకునే అవకాశం కలుగుతోంది. దీని ఫలితంగా విద్యార్థులలో ఆత్మవిశ్వాసం పెరుగుతుంది, అలాగే వారిలో ఉండే భయబ్రాంతులు, అభద్రతా భావం క్రమంగా తొలగిపోతుంది" అని పేర్కొన్నారు.

# జిల్లా కలెక్టర్ కు ధన్యవాదాలు తెలియజేసిన సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్



కామారెడ్డి జిల్లా (భారత శక్తి ప్రతినిధి) నవంబర్ 16: సిపిఎం పార్టీ వినతికి స్పందించి సెంట్రల్ లైటింగ్ మరియు పట్టణ వీధిలైట్లకు రూ. 80 లక్షల కేటాయించి 8 నెలల నుండి పెండింగ్లో ఉన్న సమస్యను 8 రోజుల్లో పరిష్కారానికి కృషిచేసిన కలెక్టర్ కు ధన్యవాదాలు తెలిపారు.

కామారెడ్డి పట్టణంలోని హౌసింగ్ బోర్డ్ నుండి అటు నరసన్నపల్లి వరకు ఇటు టేక్రియాల్ వరకు సెంట్రల్ లైటింగ్, కామారెడ్డి పట్టణ వీధిలైట్ల కొరకు 10/ 11 /2025 సోమవారం ప్రజావాణిలో కలెక్టర్ కు సిపిఎం పార్టీ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో మెమోరాండం ఇవ్వడం జరిగిందని తెలిపారు.

స్పందించిన కలెక్టర్ వెంటనే మున్సిపల్ కమిషనర్ను పిలిపించి సమస్య పరిష్కారం కోసం ప్రయత్నం చేశారని దాంట్లో భాగంగానే సెంట్రల్ లైటింగ్, కామారెడ్డి పట్టణంలోని స్ట్రీట్ లైట్లకు సంబంధించి ఒక్క పోల్ కూడా బల్బు లేకుండా ఉండకూడదని కలెక్టర్ సూచన చేయడంతో మున్సిపల్ కమిషనర్ అలాగే మున్సిపల్ డిఈ మొత్తం కూడా సెంట్రల్ లైటింగ్ అలాగే స్ట్రీట్ లైట్లు సర్వే చేయించి ఎస్టిమేషన్ తయారు చేయించారని కామారెడ్డి పట్టణానికి మొత్తం కరెంటు వెలుతురు ఇవ్వడానికి అయ్యే ఖర్చు 80 లక్షలు కాగా తయారు చేశారని తెలిపారు.

ఇట్టి ఎస్టిమేషన్ను కలెక్టర్ వెంటనే అప్రూవల్ ఇచ్చి కామారెడ్డి పట్టణ ప్రజలతోపాటు జిల్లా కేంద్రంకు వచ్చే ప్రజలకు అట్లాగే ఉదయమే లేసి డిగ్రీ కాలేజ్ గ్రౌండ్ నుండి హౌసింగ్ బోర్డ్ వరకు వాకింగ్ చేసే వాకర్స్ లకు, అట్లాగే మహిళలకు, పిల్లలకు అందరికీ ఉపయోగపడే నిర్ణయాన్ని వెంటనే తీసుకున్న జిల్లా కలెక్టర్ కు కామారెడ్డి పట్టణ ప్రజల తరఫున హౌసింగ్ బోర్డు ప్రజల తరఫున ధన్యవాదాలు తెలియజేస్తున్నామని తెలిపారు.

కలెక్టర్ ఈ నిర్ణయం వల్ల కామారెడ్డి పట్టణం తోపాటు హైవే మీద ఉన్న హౌసింగ్ బోర్డ్ కాలనీ, బృందావన్ కాలనీ, జి ఆర్ కాలనీ, కౌండిన్య కాలనీ, వికాస్ నగర్, లక్ష్మీ నగర్, అలాగే కొత్త బస్టాండ్ ఏరియా, మున్సిపల్ ఏరియా అన్ని కూడా వెలుగులతో నిండిపోతాయని తెలిపారు. పట్టణంలో ఉన్న అనేక సమస్యలను కూడా కలెక్టర్ దృష్టికి తీసుకొస్తామని ఇలాగే పరిష్కారానికి మార్గం చూపించి ప్రజలకు సహకరించాలని ఆయన కోరారు.

ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు ముదాం అరుణ్ కుమార్, మాజీ మున్సిపల్ కౌన్సిలర్ రేణుక, మోహన్ పటేల్, దశరథ్, సత్యం, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# జర్నలిస్టుల ఐక్యతకు ప్రాధాన్యం

## డబ్ల్యూ జే ఐ జిల్లా అధ్యక్షులుగా దారం జగన్నాథ రెడ్డి, కార్యదర్శిగా శ్రీనివాస్






కరీంనగర్, నవంబర్ 16(భారతశక్తి ప్రతినిధి):

తెలంగాణ రాష్ట్రంలో జర్నలిస్టుల ఐక్యతకు ప్రాధాన్యం ఇస్తామని వర్కింగ్ జర్నలిస్ట్ ఆఫ్ ఇండియ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రావికంటి శ్రీనివాస్ అన్నారు. ఆదివారం కరీంనగర్ సప్తగిరి కాలనీ ఎస్సారార్ ఫంక్షన్ హాల్ లో డబ్ల్యూజేఐ జిల్లా కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... జర్నలిస్టుల సమస్యల సాధనే లక్ష్యంగా డబ్ల్యూజేఐ పని చేస్తుందన్నారు. జాతీయ స్థాయిలో 17 రాష్ట్రాలలో కార్యకలపాలు కొనసాగిస్తున్న డబ్ల్యూజేఐ తెలంగాణలో బలమైన శక్తిగా రూపుదిద్దుకుంటోందన్నారు. క్షేత్ర స్థాయిలో పని చేస్తున్న జర్నలిస్టుల సంక్షేమం కోసం సంఘం ప్రత్యేక కార్యాచరణతో ముందుకు సాగుతున్నదని రావికంటి శ్రీనివాస్ వెల్లడించారు. కొన్ని యాజమాన్యాలు జర్నలిస్టులకు వేతనాలు ఇవ్వడం లేదన్న విషయంపై లేబర్ కమిషన్ అధికారులకు ఫిర్యాదు చేయడం జరిగిందన్నారు. ఓ వైపున యూనియన్ నిర్మాణం కోసం కృషి చేస్తూనే మరో వైపున జర్నలిస్టుల హక్కుల సాధన కోసం ఉద్యమాలు చేస్తున్న ఘనత డబ్ల్యూజేఐకే దక్కిందని రావికంటి శ్రీనివాస్ వివరించారు. కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు తాడూరు కరుణాకర్, అనిల్ దేశాయ్,

కార్యదర్శి శివనాధుని ప్రమోద్ కుమార్, కార్యవర్గ సభ్యుడు టి.సత్యనారాయణ పాల్గొన్నారు.

బి ఎం ఎస్ అనుబంధ వర్కింగ్ జర్నలిస్ట్ ఆఫ్ ఇండియా తెలంగాణ కరీంనగర్ జిల్లా శాఖ

నూతన కార్యవర్గం ఆదివారం ఏర్పాటయింది.

స్థానిక సప్తగిరి కాలనీలోని ఎస్ ఆర్ ఆర్ బాంకెట్ హాలులోజరిగిన సమావేశంలో కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

అధ్యక్షులుగా దారం జగన్నాథరెడ్డి(భారత శక్తి) ఉపాధ్యక్షులుగా మొగురం రమేష్, (తెలంగాణ తేజ ఎడిటర్) నర్సరీ కేదారి,(ప్రజాస్థానం దినపత్రిక) ప్రధాన కార్యదర్శిగా గుడాల శ్రీనివాస్ (దిశ), మహిళ కార్యదర్శులుగా వేముల సుమ (బతుకమ్మ టీవీ) లావణ్య, ఆర్గనైజింగ్ కార్యదర్శులుగా

రవీందర్ ( ప్రజాసాక్షి), జి రమేష్ (బీఆర్ కె న్యూస్), సంయుక్త కార్యదర్శులుగా కీసర సదానంద్

(మన తెలంగాణ), డి ఎస్ ప్రసాద్ (ఎడిటర్ తెలంగాణ న్యూస్) బూర్ల వెంకటేష్ (ప్రజాసాక్షి)

కోశాధికారిగా చిటుమల్ల మహేందర్

కార్యవర్గ సభ్యులుగా కృష్ణ హరి (తెలుగు ప్రభ) అనుగు శ్రీనివాసరెడ్డి, జి రామకృష్ణ (విజయక్రాంతి), కంది శ్రీనివాసరెడ్డి (వార్త), పి సంతోష్ గౌడ్ (ఆంధ్రప్రభ), జాలి నరేష్, కస్తూరి ప్రభాకర్ (డెస్క్), ఆకుల సంజీవరావు, గంగం రాజు (వుదయం), కే రవీంద్ర చారి (జనత), ఎండి రహీముద్దీన్ (స్కై లైన్), సిహెచ్ వెంకటేష్ (నవ జ్యోతి), కే కుమార్ (జనం న్యూస్) ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

# నూతన వధువును ఆశీర్వదించిన సర్వోత్తమ్ రెడ్డి వేణారెడ్డి

సూర్యాపేట, భారత శక్తి జిల్లా ప్రతినిధి,నవంబర్ 16:

సూర్యాపేట పట్టణంలోని 28వవార్డు జె.జె నగర్ లో దుస్స చంద్రశేఖర్ కుమార్తె వివాహ పెండ్లి కూతురు కార్యక్రమానికి ఎసిసి సభ్యులు సర్వోత్తమ్ రెడ్డి సూర్యాపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ



చైర్మన్ వేణారెడ్డి హాజరై నూతన వధువును ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు యండి అంజద్ అలి, మాజీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ యండి షాహిన్ బేగం, చివ్వేంల మండల పార్టీ అధ్యక్షుడు ధారవత్ వీరన్న నాయక్, జిల్లా యువజన కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు, మున్సిపల్ మాజీ కౌన్సిలర్ బైరు శైలేందేర్ గౌడ్, పిసిసి ఎస్సి సెల్ వైస్ చైర్మన్, మాజీ జెడ్పిటిసి చింతమళ్ళ రమేష్, శ్రీ దండు మైసమ్మ దేవస్థానం చైర్మన్ తంగేళ్ళ కరుణాకర్ రెడ్డి, డీసీసీ కార్యదర్శి నాగుల వాసు,జిల్లా కాంగ్రెస్ నాయకులు పందిరి మల్లేష్, ఆలేటి మాణిక్యం, యండి అక్రమ్,జమండ్ల సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

# కామారెడ్డి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ వైద్య కళాశాలకు బస్సు మంజూరు



కామారెడ్డి జిల్లా (భారత శక్తి ప్రతినిధి) నవంబర్ 16: ప్రభుత్వ వైద్య కళాశాలకు బస్సు మంజూరు చేసినందుకు ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్ కు, వైద్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ కు, ముఖ్యమంత్రికి ధన్యవాదాలు తెలిపారు.

ప్రభుత్వ వైద్య కళాశాలకు బస్సు మంజూరు చేసినందుకు ధన్యవాదాలు తెలిపిన కామారెడ్డి ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ రాథోడ్ వాల్యా, వారి వైద్య బృందం, వైద్య విద్యార్థులు.

ఈ సందర్భంగా ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ రాథోడ్ వాలియా మాట్లాడుతూ, ప్రభుత్వ వైద్య కళాశాలకు ఒక బస్సును మంజూరు చేసినందుకు మా కళాశాల యాజమాన్యం, అధ్యాపకులు, విద్యార్థులు, స్థానిక ప్రజల తరపున హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేస్తున్నాము. ఈ బస్సు విద్యార్థుల రవాణా సమస్యలను పరిష్కరించడంలో, ముఖ్యంగా క్లినికల్ పోస్టింగ్‌లకు, కమ్యూనిటీ హెల్త్ ప్రోగ్రామ్‌లకు వెళ్లడంలో ఎంతో సహాయపడుతుందన్నారు.

విద్యార్థుల విద్యా, ఆచరణాత్మక అవసరాలను దృష్టిలో ఉంచుకుని మీరు తీసుకున్న ఈ నిర్ణయం ఎంతో ప్రశంసనీయం. ఈ సహకారం మా కళాశాల మెరుగైన విద్యా ప్రమాణాలను అందించడానికి, విద్యార్థుల భవిష్యత్తుకు మరింత దోహదం చేస్తుంది. మీ ప్రోత్సాహానికి, మద్దతుకు మేము ఎల్లప్పుడూ కృతజ్ఞులమై ఉంటామని అన్నారు.

# అట్టహాసంగా బిర్లా ఓపెన్ మైండ్స్ స్కూల్లో స్పోర్ట్స్ మీట్ ప్రారంభం: చైర్మన్ నడిపెల్లి వెంకటేశ్వరరావు వెల్లడి



ఉమ్మడి వరంగల్ బ్యూరో(భారత శక్తి)నవంబర్16:

వరంగల్ రంగశాయిపేట లోని బిర్లా ఓపెన్ మైండ్స్ ఇంటర్నేషనల్ స్కూల్లో సౌత్ ఇండియా స్పోర్ట్స్ మీట్ ను చైర్మన్ నడిపెల్లి వెంకటేశ్వరరావు,సౌత్ మాస్టర్ ఫ్రాన్సిస్ డైరెక్టర్లు యలమంచిలి సందీప్,విష్ణు దేవా రెడ్డి లతో కలిసి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్మన్ నడిపెల్లి వెంకటేశ్వరరావు మీడియాతో మాట్లాడుతూ విద్యార్థులకు క్రీడల వల్ల మానసిక ఉల్లాసంతో పాటు శారీరక ప్రశాంతత లభిస్తుందని తెలిపారు. ఈ క్రీడా పోటీలు మూడు రోజుల పాటు నిర్వహిస్తామని తెలిపారు. ఈ క్రీడా పోటీల్లో తమిళనాడు,ఆంధ్రప్రదేశ్, కర్ణాటక,తెలంగాణ రాష్ట్రాల నుంచి సుమారు1100 మంది క్రీడాకారులు హాజరయ్యారని తెలిపారు. హాజరైన క్రీడాకారులు కబడ్డీ, వాలీబాల్,క్రికెట్,స్విమ్మింగ్, బాస్కెట్బాల్,ఫుట్బాల్,చెస్,అర్చరీ,ఖో ఖో,క్యారం బోర్డ్,స్కేటింగ్,తదితర విభాగాల్లో క్రీడల్లో పాల్గొంటారని తెలిపారు. క్రీడాకారులకు భోజన, వసతి సౌకర్యాలు కల్పించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో హుజురాబాద్ పబ్లిక్ స్కూల్ ప్రిన్సిపాల్ సరితా రెడ్డి,మొమిస్ ప్రిన్సిపాల్ డైరెక్టర్ జయప్రకాశ్,పంచలి దాస్ శమిలా,రామకృష్ణా రెడ్డి, నిషా వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ జె.ఎస్. పరంజ్యోతి, వివిధ పాఠశాలల డైరెక్టర్లు,కోచ్ లు,క్రీడాకారులు, తల్లిదండ్రులు, సిబ్బంది పాల్గొన్నారు.




# భారత్-అమెరికా చర్చలే కీలకం..
# 'స్టాక్ మార్కెట్'పై నిపుణుల విశ్లేషణ



ముంబయి: వచ్చేవారం స్టాక్ మార్కెట్లను ప్రభావితం చేయనున్న అంశాలను ఆర్థిక నిపుణులు అంచనా వేశారు. భారత్ అమెరికా మధ్య జరుగుతున్న వాణిజ్య ఒప్పంద చర్చల్లోని పురోగతి ఆధారంగా సూచీలు కదిలే అవకాశం ఉన్నట్లు తెలిపారు. అలాగే 'పర్చేజింగ్ మేనేజర్స్ ఇండెక్స్' డేటా, అమెరికా ఫెడరల్ రిజర్వ్ సమావేశ వివరాలు కూడా కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. ఆర్థిక సంవత్సరం ద్వితీయార్థానికి చేరుకున్న నేపథ్యంలో మదుపర్లు తమ పోర్ట్‌ఫోలియోలను సమీక్షించుకునే అవకాశం ఉందని జియోజిట్ ఇన్వెస్ట్‌మెంట్ లిమిటెడ్ ప్రతినిధి వినోద్ నాయర్ తెలిపారు. ఈ క్రమంలో కంపెనీ ఫలితాలను నిశితంగా పరిశీలిస్తారన్నారు. ఫండమెంటల్స్ బలంగా ఉన్న రంగాల్లోకి ఇన్వెస్ట్‌మెంట్లు పెరిగే అవకాశం ఉందని చెప్పారు. గతవారం దేశీయ మార్కెట్ సూచీలు బలంగా ముగిసిన విషయాన్ని గుర్తుచేశారు. అమెరికాలో 'షట్‌డౌన్' ముగియడం, రెండో త్రైమాసిక ఫలితాలు అంచనాలను మించడం కలిసొచ్చిందని విశ్లేషించారు. బిహార్‌లో ఎన్‌డీయే ప్రభుత్వానికి భారీ మెజారీ లభించడం కూడా మార్కెట్లను చివర్లో ప్రభావితం చేసినట్లు మోతీలాల్ ఓస్వాల్ ఫైనాన్షియల్ సర్వీసెస్‌లోని రీసెర్చ్ విభాగాధిపతి సిద్దార్థ ఖేమ్కా తెలిపారు. అలాగే రిటైల్ ఇన్వెస్టర్ల భాగస్వామ్యం, 'సిప్'లు పెరగటంతో పాటు ఐపీవోలు కూడా సూచీలకు మద్దతుగా నిలిచినట్లు విశ్లేషించారు. వచ్చేవారం కూడా మార్కెట్లు పాజిటివ్‌గా ట్రేడ్ అవుతాయని అంచనా వేశారు. రిజల్ట్స్ సీజన్ ముగిసిన నేపథ్యంలో ఇన్వెస్టర్లు ఇతర అంశాలపై దృష్టి సారించే అవకాశం ఉందన్నారు. పండగ సీజన్ తర్వాత నుంచి డిమాండ్ పుంజుకోవడం, వడ్డీ రేట్లు, ద్వితీయార్థంలో ప్రభుత్వ మూలధన వ్యయం వంటి అంశాలను పరిశీలించొచ్చని విశ్లేషించారు. గతవారం స్టాక్ మార్కెట్ సూచీలు బలంగా క్లోజ్ అయ్యాయి. నిఫ్టీ 50 సూచీ వారం మొత్తంలో ఏకంగా 413 పాయింట్లు పెరిగి 25,910 వద్ద ముగిసింది. సెన్సెక్స్ 1,455 పాయింట్లు లాభపడి 84,562 దగ్గర స్థిరపడింది.

# ఎస్‌బీఐ కస్టమర్లకు అలర్ట్..
# డిసెంబర్ 1 నుంచి ఆ సర్వీస్ బంద్




ముంబయి: స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (SBI) తమ కస్టమర్లను అలర్ట్ చేసింది. mCASH సర్వీస్ ద్వారా డబ్బు పంపడం, క్లెయిమ్ చేసుకునే సేవలను నిలిపివేస్తున్నట్లు ప్రకటించింది. 2025 నవంబర్ 30 తర్వాత ఇది అమల్లోకి రానుంది. ఆ తేదీ తర్వాత కస్టమర్లు ఆన్‌లైన్ ఎస్‌బీఐ (On lineSBI), యోనో లైట్ (YONO Lite) ద్వారా mCASH సేవను వాడుకోలేరు. బెనిఫిషియరీని రిజిస్టర్ చేయకుండా డబ్బు పంపడం లేదా mCASH లింక్ ద్వారా ఆ డబ్బును క్లెయిమ్ చేసుకోవడం లాంటివి ఇకపై కుదరవు.

**ఏంటీ mCASH?**

mCASH ఒకప్పుడు ఎస్‌బీఐ కస్టమర్లకు చాలా సౌకర్యవంతంగా ఉండేది. ఇంటర్నెట్ బ్యాంకింగ్ వాడుతున్న కస్టమర్లు.. ఎవరికైనా డబ్బు పంపాలనుకుంటే వారు ముందుగా బెనిఫిషియరీగా రిజిస్టర్ చేసుకోవాల్సిన అవసరం ఉండేది కాదు. బదులుగా, కేవలం డబ్బు అందుకునే వ్యక్తి మొబైల్ నెంబర్ లేదా ఈమెయిల్ ఐడీని ఉపయోగించి సులభంగా డబ్బు పంపేవారు. డబ్బు అందుకునే వ్యక్తికి (రిసీవర్) ఒక ఎస్సెమ్మెస్ లేదా ఈమెయిల్ రూపంలో ఎనిమిది అంకెల పాస్‌కోడ్ ఉండే సురక్షితమైన లింక్ వచ్చేది. ఆ లింక్ ద్వారా లేదా ఎస్‌బీఐ mCASH మొబైల్ యాప్ ద్వారా వారు ఏ బ్యాంకు అకౌంట్‌లో అయినా ఆ డబ్బును క్లెయిమ్ చేసుకునే అవకాశం ఉండేది.

**మరి ఎలా?**

mCASH సేవలు నిలిచిపోతున్నందున కస్టమర్లు థర్డ్‌పార్టీ వ్యక్తులకు డబ్బు పంపడానికి ఇతర సురక్షితమైన, విస్తృతంగా అందుబాటులోకి వచ్చిన డిజిటల్ పద్ధతులకు మారాలని ఎస్‌బీఐ సూచించింది. ఇందుకోసం యూపీఐ (UPI), ఐఎంపీఎస్ (IMPS), నెఫ్ట్ (NEFT), ఆర్టీజీఎస్ (RTGS) వంటి ప్రత్యామ్నాయ మార్గాలు అందుబాటులో ఉన్నాయి. ముఖ్యంగా ఎస్‌బీఐ కస్టమర్లు తమ 'భీమ్ ఎస్‌బీఐ పే' (BHIM SBI Pay) యూపీఐ యాప్‌ను ఉపయోగించి సులభంగా డబ్బు పంపవచ్చు.

**'భీమ్ ఎస్‌బీఐ పే' యాప్**

యూపీఐ ద్వారా డబ్బు పంపే విధానం చాలా సులభం. మొదట 'BHIM SBI Pay' యాప్‌లోకి లాగిన్ అవ్వాలి. తర్వాత 'Pay' అనే ఆప్షన్ ఎంచుకుని, VPA (Virtual Payment Address) లేదా అకౌంట్ నెంబర్ ఇంకా IFSC కోడ్ లేదా QR కోడ్ వంటి ఏదైనా ఒక పద్ధతిని సెలక్ట్ చేసుకోవాలి. అవసరమైన వివరాలు ఎంటర్ చేయాలి. తర్వాత, మీరు డబ్బు పంపాలనుకుంటున్న అకౌంట్ ఎంచుకోవాలి. యూపీఐ పిన్ ఎంటర్ చేస్తే ట్రాన్సాక్షన్ పూర్తవుతుంది. mCASH ఆగిపోయినా కస్టమర్లు ఎలాంటి ఇబ్బంది లేకుండా డిజిటల్ చెల్లింపులు కొనసాగించొచ్చు.

# నేడు రెండు తెలుగు రాష్ట్రాల్లో బంగారం, వెండి ధరలు ఎలా ఉన్నాయంటే..?

మన ఇంట్లో ఏ చిన్న శుభకార్యం జరిగినా బంగారం కొనుగోలు చేస్తుంటాము. ఇక అందులోనూ మన దేశంలో గోల్డ్‌కి మరింత పాపులారిటీ ఎక్కువ. ఇక ఈ మధ్య కాలంలో బంగారం ధరల్లో హెచ్చు తగ్గులు కనిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఒకరోజు రేట్లు తగ్గి కాస్త ఊరటనిస్తుంటే మరోరోజు పెరిగి అమ్మో అనిపిస్తున్నాయి. ఈ క్రమంలో నేడు బంగారం ధరలు స్థిరంగా ఉన్నాయి. ఇక ప్రధాన నగరాలైన హైదరాబాద్, విజయవాడలో 22 క్యారెట్ల బంగారం ధర నేడు రూ.1,14,650గా ఉంది. అలాగే 24 క్యారెట్ల బంగారం ధర నేడు రూ.1,25,080కు చేరుకుంది. ఇక అటు వెండి ధర రూ.100 పెరిగి కిలో రూ.1,75,000గా ఉంది. కాగా దాదాపు రెండు రాష్ట్రాల్లో బంగారం, వెండి ధరలు ఇవే ఉన్నాయి.



# చెలరేగిన భారత్‌ఎ బౌలర్లు..
# దక్షిణాఫ్రికా-ఎ 132 ఆలౌట్

రాజ్‌కోట్: భారత్‌ఎ, దక్షిణాఫ్రికా-ఎ మధ్య మూడు మ్యాచ్‌ల అనధికార వన్డే సిరీస్ జరుగుతున్న సంగతి తెలిసిందే. తొలి వన్డేలో భారత్‌ఎ గెలవగా నేడు రెండో మ్యాచ్ జరుగుతోంది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న దక్షిణాఫ్రికాఎ 30.3 ఓవర్లలో 132 పరుగులకు ఆలౌటైంది. రివాల్డో మూన్సామి (33; 34 బంతుల్లో) టాప్ స్కోరర్. డెలానో పోట్గీటర్ (23), డయాన్ ఫారెస్టర్ (22), లువాన్‌డ్రే ప్రిటోరియస్ (21), ఫ్రేనేలన్ సుబ్రాయెన్ (15) పరుగులు చేశారు. భారత బౌలర్లలో నిషాంత్ సింధు (4/16), హర్షిత్ రాణా (3/21) మెరిశారు. ప్రసిద్ధ్ కృష్ణ 2, తిలక్ వర్మ ఒక వికెట్ పడగొట్టారు.







# డెఫ్లంపిక్స్‌లో హైదరాబాద్ షూటర్‌కి స్వర్ణం

టోక్యో వేదికగా జరుగుతున్న డెఫ్లంపిక్స్‌లో హైదరాబాద్‌కు చెందిన షూటర్ ధనుష్ శ్రీకాంత్ సత్తా చాటాడు. 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ పురుషుల విభాగంలో స్వర్ణం సాధించాడు. సూరత్‌కు చెందిన మరో షూటర్ మహ్మద్ వానియా రజత పతకం సొంతం చేసుకున్నాడు. దీంతో రెండు పతకాలూ భారత్‌కే దక్కినట్లైంది.




# 'మూడు'తో ఆటలా?
# టెస్టుల్లో కీలక స్థానంపై ప్రయోగాలు!



టెస్టు క్రికెట్లో మూడో నంబర్ బ్యాటింగ్ స్థానం ఎంతో కీలకమైంది. జట్టులోని అత్యుత్తమ బ్యాటర్లలో ఒకరిని ఆ స్థానంలో ఆడిస్తారు. ఇన్నింగ్స్‌కు బలమైన పునాది వేయడం, ముందుకు నడిపించడంలో ఈ స్థానంలో ఆడే బ్యాటర్ ముఖ్య పాత్ర పోషించాల్సి ఉంటుంది. అలాంటి స్థానం విషయంలో జట్టు యాజమాన్యం చేస్తున్న ప్రయోగాలు విమర్శలకు దారి తీస్తున్నాయి. టెస్టుల్లో టీమ్‌ఇండియాకు మూడో నంబర్ బ్యాటర్‌గా అత్యధిక కాలం సేవలందించిన బ్యాటర్ రాహుల్ ద్రవిడ్. ఆ స్థానానికి ఎంతో విలువ చేకూర్చి, దాని ప్రాధాన్యాన్ని చాటింది ద్రవిడే. ఆరంభంలోనే ఒకట్రెండు వికెట్లు పడినపుడు.. క్రీజు చుట్టూ గోడ కట్టి పతనాన్ని అడ్డుకునేవాడు ద్రవిడ్. ఇన్నింగ్స్‌కు బలమైన పునాది పడితే.. జట్టును భారీ స్కోరు దిశగా నడిపించేవాడు. ద్రవిడ్ తర్వాత చెతేశ్వర్ పుజారా పదేళ్లకు పైగా ఆ బాధ్యతను సమర్థంగా నిర్వర్తించాడు. కానీ పుజారా టెస్టు జట్టుకు దూరమయ్యాక ఆ స్థానాన్ని సరైన ఆటగాడితో భర్తీ చేయలేక భారత్ ఇబ్బంది పడుతోంది. మిగతా స్థానాల విషయంలో ఇబ్బంది లేదు కానీ.. కీలకమైన మూడో నంబరులో మాత్రం ఎవ్వరూ నిలదొక్కుకోలేకపోతున్నారు. పుజారాపై వేటు పడ్డాక కొంత కాలం శుభ్‌మన్ గిల్ ను ఆ స్థానంలో ఆడించారు. అతను ఓ మోస్తరు ప్రదర్శన చేశాడు. అయితే ఈ ఏడాది రోహిత్, కోహ్లి టెస్టుల నుంచి రిటైరైపోయాక శుభ్‌మన్ స్థానం మారిపోయింది. రోహిత్ స్థానంలో జట్టు పగ్గాలందుకున్న అతను.. కోహ్లి ఆడే నాలుగో స్థానంలోకి మారాడు. ఇంగ్లాండ్ పర్యటన నుంచి ఆ నంబరులోనే ఆడుతున్నాడు. ఇంగ్లాండ్‌తో సిరీస్‌లో మూడో స్థానంలో కరుణ్ నాయర్, సాయి సుదర్శన్‌లను మార్చి మార్చి ఆడించారు. కానీ ఇద్దరూ అవకాశాలను ఉపయోగించుకోలేకపోయారు. సొంతగడ్డపై వెస్టిండీస్‌తో సిరీస్‌కు కరుణ్‌పై వేటు పడింది. సుదర్శన్‌కు ఛాన్స్ వచ్చింది. అతనే మూడో స్థానంలో ఆడాడు. రెండో టెస్టులో 87, 39 పరుగులతో సత్తా చాటాడు. దీంతో ఇక అతనే మూడో స్థానంలో కొనసాగుతాడనిపించింది.

**ఇది సరైందేనా?**

ప్రపంచ టెస్టు ఛాంపియన్ దక్షిణాఫ్రికాతో రెండు టెస్టుల సిరీస్ ఆరంభమైంది. తొలి మ్యాచ్‌కు తుది జట్టు ఎంపిక విషయంలో టీమ్ మేనేజ్‌మెంట్ పెద్ద షాకే ఇచ్చింది. ఆరుగురు బౌలర్లను ఎంచుకుని, స్పెషలిస్టు బ్యాటర్లను అయిదుగురికి పరిమితం చేసింది. ఈ క్రమంలో మూడో స్థానంలో ఆడే సాయి సుదర్శన్ మీద వేటు వేసింది. పంత్‌కు తోడు మరో వికెట్ కీపర్ బ్యాటర్ ధ్రువ్ జురెల్‌కు అవకాశమిచ్చింది. జురెల్ సూపర్ ఫామ్‌లో ఉండడంతో అతణ్ని ఆడించక తప్పలేదు. అయితే ఇందుకోసం కీలకమైన మూడో నంబర్ బ్యాటర్ మీద వేటు వేసి.. బౌలింగ్ ఆల్‌రౌండరైన వాషింగ్టన్ సుందర్‌ను ఆడించడం విమర్శలకు దారి తీసింది. ఈ ప్రయోగాన్ని చాలామంది తప్పుబట్టారు. మాజీ పేసర్ దొడ్డ గణేష్.. కెప్టెన్ శుభ్‌మన్, కోచ్ గంభీర్‌ల తీరును దుయ్యబట్టాడు. గత మ్యాచ్‌లో రాణించిన సుదర్శన్‌ను ఎలా పక్కన పెడతారని.. టెస్టుల్లో ఎంతో కీలకమైన మూడో స్థానంలో ఈ ఆటలేంటని ప్రశ్నించాడు. ఈ మ్యాచ్‌లో సుందర్ కీలకమైన 60 పరుగులు (29+31) చేసినా ఒక స్థిరమైన బ్యాటర్‌ను ఆ స్థానానికి తీర్చిదిద్దుకోకుంటే భవిష్యత్తులో, ముఖ్యంగా విదేశీ పర్యటనల్లో ఇబ్బందులు తప్పవనే చర్చ జరుగుతోంది. మరి గంభీర్, శుభ్‌మన్ ఇకముందూ మూడో స్థానంలో ఇలా మార్పులు చేస్తుంటారా.. లేక ఒక బ్యాటర్‌కు కట్టుబడతారా అన్నది చూడాలి.

# బాగా ఆడకపోతే ఇలాగే జరుగుతుంది..
## తొలి టెస్టు ఓటమిపై గంభీర్ కీలక వ్యాఖ్యలు

తొలి టెస్టులో ఓటమి అనంతరం టీమిండియా హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ భారత బ్యాటర్లపై కీలక వ్యాఖ్యలు చేశాడు. బాగా ఆడకపోతే ఇలాగే జరుగుతుందన్నాడు. పిచ్ తాము కోరుకున్నదేనని చెబుతూ తమ బ్యాటర్లే సరిగ్గా ఆడలేదని వ్యాఖ్యానించాడు. 'మేము ఇలాంటి పిచే అడిగాం. క్యూరేటర్ మాకు సహాయం చేశాడు. ఇక్కడ పాయింట్ పిచ్ గురించి కాదు. టర్న్ ఆడటం తెలిసి ఉండాలి. పిచ్ ఎలా ఉన్నా 124 పరుగులు ఛేదించగలిగేదే. డిఫెన్స్ ఆడితే కచ్చితంగా పరుగులు చేయొచ్చు. ఈ పిచ్‌పై బిగ్ షాట్స్ ఆడలేం. కానీ, డిఫెన్స్ ఆడగలిగితే మాత్రం కచ్చితంగా రన్స్ చేసే పిచ్. బవుమా హాఫ్ సెంచరీ చేశాడు. అక్షర్, సుందర్ కూడా పరుగులు రాబట్టారు. కాబట్టి ఎప్పుడూ పిచ్ గురించి మాట్లాడటం వల్ల ఉపయోగం లేదు' అని తెలిపాడు. పిచ్ స్పిన్నర్లకు సహకరించడంపై అడిగిన ప్రశ్నకు గంభీర్ స్పందిస్తూ.. పేసర్లే ఎక్కువ వికెట్ తీశారని చెప్పాడు. స్పిన్నర్లు, పేసర్లు ఇద్దరూ ప్రభావం చూపించారన్నాడు.



# నాకూ ఆ పరిస్థితి ఎదురైంది..
# చేదు జ్ఞాపకాన్ని గుర్తుచేసుకున్న మంచు లక్ష్మి



తన జీవితంలోని చేదు జ్ఞాపకాన్ని నటి, నిర్మాత మంచు లక్ష్మి గుర్తుచేసుకున్నారు. 15 ఏళ్ల వయసులో ఎదుర్కొన్న పరిస్థితి గురించి తాజాగా పాల్గొన్న ఓ ఇంటర్వ్యూలో మాట్లాడారు. "అమ్మే నన్ను మా సొంత వాహనంలో రోజూ స్కూల్‌కి తీసుకెళ్లేది. బాడీ గార్డ్స్, డ్రైవర్స్ కూడా ఉండేవారు. కానీ, హాల్ టికెట్ల కోసం పాఠశాల వాళ్లే మమ్మల్ని పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్‌లో తీసుకెళతారని తెలిసి ఎంతో ఆనందించా. కానీ, ఆ ప్రయాణం భయంకరమైంది. ఓ వ్యక్తి నన్ను అసభ్యంగా తాకాడు. నాకేం చేయాలో అర్థం కాలేదు. తర్వాత స్నేహితులకు చెప్పా. సెలబ్రిటీ ఫ్యామిలీ నుంచి వచ్చిన నాకే అలాంటి పరిస్థితి ఎదురైంది. ప్రజా రవాణాలో ప్రయాణించే మహిళలు ఇలాంటివి ఎదుర్కొంటుంటారు కానీ బయటకు చెప్పకోలేరు" అని ఆవేదన వ్యక్తం చేశారు.

## 'అఖండ 2' బిగ్ రివీల్..
### ఆ ఫార్మాట్‌లోనూ మూవీ రిలీజ్




సినీ అభిమానులకు 'అఖండ 2' చిత్ర బృందం ఆసక్తికర అప్‌డేట్ ఇచ్చింది. ఈ చిత్రాన్ని 3డీలోనూ రిలీజ్ చేయనున్నట్టు ప్రకటించింది. భారతీయ చిత్ర పరిశ్రమలోనే గొప్ప అనుభూతి పంచే సినిమాల్లో ఇదొకటి కానుందని టీమ్ పేర్కొంది. 'అఖండ 2' బిగ్ రివీల్ పేరిట ఈ మేరకు ప్రెస్‌మీట్ నిర్వహించింది. ఈ మూవీ డిసెంబరు 5న విడుదల కానున్న సంగతి తెలిసిందే. బాలకృష్ణ హీరోగా బోయపాటి శ్రీను తెరకెక్కిస్తున్న చిత్రమిది. ఇదే కాంబినేషన్‌లో గతంలో వచ్చిన హిట్ మూవీ 'అఖండ'కు సీక్వెల్‌గా తెరకెక్కుతోంది. విలేకరుల సమావేశంలో బోయపాటి శ్రీను మాట్లాడుతూ.. ''బాలకృష్ణ అభిమానులు, ప్రేక్షకులకు కొత్త అనుభూతి ఇవ్వాలన్న ఉద్దేశంతోనే సినిమాని 3డీ ఫార్మాట్‌లోనూ తీసుకొస్తున్నాం. ఈ చిత్రం.. భారతదేశ ఆత్మ, పరమాత్మ. ఈ సినిమా మన దేశ ధర్మం, ధైర్యం. ప్రపంచ దేశాల్లో మతం కనిపిస్తుంది. కానీ, ఈ దేశంలో మాత్రమే సనాతన ధర్మం కనిపిస్తుంది. దాని ఆధారంగా రూపొందిస్తున్న చిత్రమిది. ఈ సినిమాని దేశమంతా చూడాలనుకుంటున్నా. అందుకే కొన్ని రోజుల క్రితం ప్రచారాన్ని ముంబయి నుంచి ప్రారంభించాం'' అని తెలిపారు.


## అదితి రావు పేరుతో మోసం..
## స్పందించిన నటి

తన పేరు, ఫొటో వినియోగిస్తూ ఓ వ్యక్తి ఫొటోగ్రాఫర్లను మోసం చేస్తున్నాడని, అలాంటి ఫేక్ అకౌంట్ నుంచి జాగ్రత్తగా ఉండాలంటూ నటి అదితి రావు హైదరి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు సోషల్ మీడియాలో పోస్టు పెట్టారు. ''ఓ వ్యక్తి వాట్సాప్‌లో నా పేరుతోపాటు ఫొటోను ప్రొఫైల్‌గా పెట్టుకుని.. ఫొటోషూట్స్ పేరిట పలువురు ఫొటోగ్రాఫర్లకు మెసేజ్ చేస్తున్నట్టు తెలిసింది. ఈ విషయాన్ని కొందరు నా దృష్టికి తీసుకొచ్చారు. ఆ మెసేజ్‌లు చేసింది నేను కాదు. ఫొటోషూట్ లాంటి వాటి కోసం ఎవరినైనా కాంటాక్ట్ అవ్వాలన్నా.. నేను వ్యక్తిగత ఫోన్ నెంబరు వాడను. నా టీమ్ ద్వారానే వారిని సంప్రదిస్తుంటా. ఒకవేళ మీకు ఇలాంటి మెసేజ్‌లు వస్తే.. మా ఇన్‌స్టాగ్రామ్ ఖాతా arhconnect ద్వారా తెలియజేయండి'' అని విజ్ఞప్తి చేశారు.



# సినిమా

## అన్వేషణ




సూపర్ స్టార్ రజినీకాంత్, లోక నాయకుడు కమల్ హాసన్ నాలుగు దశాబ్దాల తర్వాత కలిసి సినిమా చేయబోతున్నట్లు కొన్ని రోజులుగా వార్తలు వస్తున్న విషయం తెలిసిందే. ఆ వార్తలు ఇద్దరు హీరోల అభిమానులను ఎంతగానో ఎగ్జైట్ చేశాయి. కొన్ని నెలల పాటు ఈ ప్రాజెక్టు గురించి అనేక ఊహాగానాలు నడిచాయి. కానీ కమల్ నిర్మాతగా రజినీ హీరోగా సుందర్ దర్శకత్వంలో సినిమా రాబోతున్నట్లు ఇటీవల ప్రకటన వచ్చింది. ఈ ట్విస్ట్ నుంచి బయటపడేలోపే ఆ ప్రాజెక్టు నుంచి తప్పుకుంటున్నట్లు దర్శకుడు ప్రకటించి మరో ట్విస్ట్ ఇచ్చాడు. దీంతో తన చేతిలో పెద్ద స్టార్ ఉన్నాడని.. ఆ స్టార్‌ను మెప్పించే కథను తయారు చేయడం నిర్మాతగా తన బాధ్యత అని అభిమానుల్లో ఉత్సాహం నింపే మాట చెప్పాడు కమల్. ఇక తాను, సూపర్ స్టార్ కలిసి నటించే సినిమా వేరని చెప్పాడు. మంచి కథలు దొరికితే రెండు సినిమాలు ముందుకు కదులుతాయని హింట్ ఇచ్చాడు. అంటే ఆయన అన్వేషణ ఇప్పుడు కథల కోసమే.

## ఒకేసారి ఇన్ని సర్‌ప్రైజులా?



టాలీవుడ్ దిగ్గజ దర్శకుడు రాజమౌళి, సూపర్‌స్టార్ మహేశ్ బాబు కాంబోలో తెరకెక్కుతున్న 'వారణాసి' నుంచి వరుస అప్డేట్స్ వచ్చాయి. 'గ్లోబ్‌ట్రాటర్' ఈవెంట్ లో మూవీ టైటిల్, మహేశ్ ఫస్ట్ లుక్, గ్లింప్స్ రిలీజ్ చేశారు. 2027 సమ్మర్లో సినిమా విడుదల చేస్తామని మ్యూజిక్ డైరెక్టర్ ఎంఎం కీరవాణి ప్రకటించారు. రామాయణంలో ముఖ్యమైన ఘట్టం తీస్తున్నానని, మహేశ్ కు రాముడి వేషం వేశానని రాజమౌళి వెల్లడించారు. ఇక సినిమాలోని తన పాత్రకు తగ్గట్టు ప్రిన్స్ .. వృషభంపై (బొమ్మ) కూర్చొని వేదికపైకి ఎంట్రీ ఇవ్వడం ప్రధాన ఆకర్షణగా నిలిచింది. దీంతో ఒకేసారి ఇన్ని సర్‌ప్రైజులు ఇచ్చారని నెటిజన్లు కామెంట్లు చేస్తున్నారు. మరోవైపు 'వారణాసి' నుంచి రిలీజైన గ్లింప్స్ సోషల్‌మీడియాను షేక్ చేస్తోంది. 3.40 నిమిషాల నిడివి ఉన్న ఈ విజువల్ వండర్ ను నెటిజన్లు డీకోడ్ చేసే పనిలోపడ్డారు. వారణాసి(512 సీఈ)లో మొదలయ్యే టైమ్ ఫ్రేమ్ వారణాసి (మణికర్ణికా ఘాట్) లోనే ముగుస్తోందని కామెంట్లు చేస్తున్నారు. ప్రతి ఫ్రేమ్ లో ఎక్కడో ఒకచోట మహేశ్ కనిపించేలా వీడియో రూపొందించారని పేర్కొంటున్నారు. ఇక ప్రతిష్ఠాత్మక చిత్రాన్ని శ్రీదుర్గా ఆర్ట్స్, షోయింగ్‌బిజినెస్‌పతాకాలపై కేఎల్‌నారాయణ, ఎస్.ఎస్‌కార్తికేయ నిర్మిస్తున్నారు. ప్రియాంక చోప్రా హీరోయిన్.. పృథ్వీరాజ్‌సుకుమారన్‌కీలక పాత్రలో కనిపించనున్నాడు.



## చేతిలో బుక్‌తో కనకావతి

'సప్తసాగరాలు దాటి' సినిమాతో తెలుగు ప్రేక్షకులను పలకరించిన బ్యూటీ రుక్మిణి వసంత్.. ఇటీవల 'కాంతార చాప్టర్ 1లో కనకావతి పాత్రతో అబ్బురపరిచింది. ముఖ్యంగా యువరాణిగా నటించిన ఈ అమ్మడు నెగిటివ్ షేడ్స్ లోనూ కనిపించింది. తన నటనతో ఆకట్టుకుని పాన్ ఇండియా హీరోయిన్‌గా పేరు సొంతం చేసుకున్నది. ప్రస్తుతం ఎన్టీఆర్, ప్రశాంత్ నీల్ కాంబినేషనల్‌లో వస్తున్న ఎన్టీఆర్ 31 సినిమాలో నటిస్తోంది. అలాగే ప్రముఖ కన్నడ హీరో యష్ హీరోగా టాక్సిక్ చిత్రంలో కూడా హీరోయిన్‌గా అవకాశం దక్కించుకుంది. ఇక అలా ఇప్పుడు ఏకంగా రెండు పాన్ ఇండియా చిత్రాలతో బిజీగా మారిన ఈ ముద్దుగుమ్మ.. ఇప్పుడిప్పుడే తన మేకోవర్ లో మార్పులు చేసుకుంటుంది.. మరొకవైపు అభిమానులను అలరించడానికి సోషల్ మీడియాలో యాక్టివ్ గానూ ఉంటుంది. తాజాగా క్రీమ్ కలర్ ప్యాంట్, బ్లాక్ కలర్ టీ షర్ట్ ధరించి తన అందంతో మెస్మరైజ్‌చేస్తుంది.. ముఖ్యంగా ఇందులో టీనేజ్ అమ్మాయిలా కనిపిస్తూ.. హొయలు పోయింది. పైగా జుట్టును సరళంగా వదిలేసిన తన అందంతో.. చిరునవ్వుతో అభిమానుల హృదయాలలో చెరగని ముద్ర వేసుకుంటుంది. ఇక చేతిలో పుస్తకంతో అందరినీ ఆకట్టుకుంది. ప్రస్తుతం ఈభామ షేర్ చేసిన ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ గా మారుతున్నాయి. ఈ పిక్స్‌కు 'చేతిలోబుక్‌ఉంటే ఎప్పుడూ కొంచెం సంతోషంగా ఉంటుంది' అంటూ క్యాప్షన్‌కూడా ఇచ్చింది. ఇప్పుడిప్పుడే తన అందంతో నటనతో ప్రేక్షకులను ఆకట్టుకుంటున్న ఈమె.. ఇటు నెట్టింట కూడా ఫాలోవర్స్ ను పెంచుకునే పనిలో పడింది.

# కేసుల పరిష్కారానికి లోక్ అదాలత్ ఉత్తమ మార్గం

*** జిల్లా ప్రధాన న్యాయమూర్తి, చైర్మన్ రంగారెడ్డి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కర్ణ కుమార్**



ఎల్బీనగర్, నవంబర్ 16 (భారత శక్తి): రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ వారి ఆదేశాల మేరకు రంగారెడ్డి జిల్లాలో గల అన్ని కోర్టు ప్రాంగణాలలో శనివారం స్పెషల్ లోక్ అదాలత్ నిర్వహించడమైనది.జిల్లా ప్రధాన న్యాయమూర్తి, చైర్మన్ రంగారెడ్డి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కర్ణ కుమార్ మాట్లాడుతూ, ముందు ముందు వచ్చే ఇలాంటి స్పెషల్ లోక్ అదాలత్ ను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ లోకదాలత్ లో సెటిల్ చేసుకోవడం ద్వారా తాము సివిల్ కేసులలో చెల్లించిన కోర్ట్ ఫీజు కూడా తిరిగి పొందొచ్చని చెప్పారు. తమ కేసులను అనగా ఆస్తి పరమైన కేసులు, కుటుంబ సమస్యల కేసులు పరిష్కారం చేసుకోవడానికి ఈ లోక్ అదాలత్ మధ్యవర్తిత్వం ఒక మంచి వేదిక అని చెప్పారు.లోక్ అదాలత్ లో కేసు రాజీ అవ్వడం ద్వారా ఇరు వర్గాలు గెలిచినట్టేనని అన్నారు. జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి /సీనియర్ సివిల్ జడ్జి హనుమంత రావు మాట్లాడుతూ, రంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా అన్ని కోర్టు ప్రాంగణాలలో 20 లోక్ అదాలత్ బెంచిలు ఏర్పాటు చేశామని ఇందులో రాజీకి ఆమోదయోగ్యమైన క్రిమినల్ కేసులు, సివిల్ దావాలు, చెక్ బౌన్స్ కేసులు,మోటారు వాహన ప్రమాద బీమా కేసులు,కన్జ్యూమర్ కోర్టు కేసులు, ప్రీ లిటిగేషన్ కేసులు పరిష్కరించుకున్నారని చెప్పారు.ఈ లోక్ అదాలత్ నిర్వహించుటలో పోలీస్ వారు, ఇన్సూరెన్స్ అధికారులు, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, పానెల్ అడ్వొకేట్స్, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సిబ్బంది తమవంతు సహాయసహకారాలను అందించారు.కక్షిదారులు సంతోషం వ్యక్త పరిచారు.ఈ స్పెషల్ లోక్ అదాలత్ లో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కక్షిదారులకు ఉచితంగా భోజనాన్ని అందించింది. ఇందులో రాజీకి ఆమోద యోగ్యమైన క్రిమినల్ కేసులు, సివిల్ కేసులు, మోటార్ వాహన ప్రమాదభీమా కేసులు, బ్యాంకు రికవరీ మరియు ప్రీటిగేషన్ కేసులు అన్ని కలిపి సుమారు 2050 పై చిలుకు కేసులు పరిష్కరించబడ్డాయి. అలాగే అన్ని కేసులలో కలిపి Rs.1,33,80,000/రూపాయల వరకు నష్ట పరిహారాన్ని కక్షిదారులకు ఇప్పించడం జరిగింది.



## అన్నారం వి.ఎస్ హోమ్స్ లో

### అంగరంగ వైభవంగా శ్రీ అయ్యప్ప స్వామి మహా పడిపూజ

హైదరాబాద్, నవంబర్ 16 (భారత శక్తి): తట్టిన్నారం వి.ఎస్ హోమ్స్ కాలనీలో ఆదివారం రోజు టీ భార్గవ్ అయ్యప్ప స్వామి నివాసంలో, పూజారి కిషోర్ గురుస్వామి, రమేష్ గురుస్వామి, కే.ఎన్ గౌడ్ గురు స్వామి ఆధ్వర్యంలో శ్రీ అయ్యప్ప స్వామి మహా పడిపూజ అందరినీ ఆకట్టుకుంది. ఆధ్యాత్మిక వాతావరణంలో మహా పడి పూజ వైభవంగా జరిగి భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ పడిపూజకు సన్నిధానం స్వాములు సత్యేంద్ర స్వామి పాల్గొన్నారు.

**కార్యక్రమ విశేషాలు**

గురు స్వామి కిషోర్ గురుస్వామి రమేష్ గురుస్వామి, కే.ఎన్ గౌడ్ గురు స్వామి ఆధ్వర్యంలో ఉన్నతమైన నియమాలతో పడి పూజను నిర్వహించారు. ఆధ్యాత్మిక శోభను అందించేందుకు అయ్యప్ప స్వామి మాల ధరించిన భక్తులు ప్రత్యేకంగా భజనలు గానించారు. పూజ అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు వితరణ చేయడం కన్నిద్దరి ఆనందాన్ని పెంచింది.

**భక్తుల ఆసక్తి**

చుట్టు ప్రాంతాల నుండి వచ్చి, ఈ మహా పడి పూజలో పాల్గొన్న భక్తులు పుణ్యఫలాలను పొందారు. ఈ కార్యక్రమంలో అన్నదాన ఏర్పాట్లు



కూడా ఘనంగా చేసారు, అందరు భక్తులకు వితరణ చేశారు.

**అయ్యప్ప పడి పూజ విశిష్టత**

శబరిమలై స్ఫూర్తితో నిర్వహించే ఈ మహా పడి పూజ, అయ్యప్ప స్వామిన్ని 18 పటల దర్శనం ద్వారా సేవ చేసే చిహ్నం గ ముగిసిన తర్వాత ప్రసాదాలు, తీర్థాలు అందించడంతో పాటు, ఆధ్యాత్మిక సందేశాలు ఇచ్చారు. శ్రద్ధతో, భక్తితో జరిపిన ఈ అయ్యప్ప మహా పడి పూజ తట్టిన్నారం వి ఎస్ హోమ్స్ కాలనీ వాసులకు కూడా భక్తిసంబంధమైన ఆహ్లాదాన్ని, అనుహ్యామైన ఆధ్యాత్మిక అనుభూతిని మిగిల్చింది. ఈ కార్యక్రమంలో స్థానిక గురుస్వామి కృష్ణమోహన్ గురుస్వామి వేణుగోపాల్ రెడ్డి గురుస్వామి శ్రీకాంత్ రెడ్డి స్వామి, వెంకటరమణ స్వామి రాజేష్ స్వామి చరణ్ స్వామి తదితరులు పాల్గొన్నారు..

## ఉచిత వైద్య శిబిరంలో

# పాల్గొన్న కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి


ఎల్బీనగర్, నవంబర్ 16 (భారత శక్తి): హయత్‌నగర్ డివిజన్‌లో ప్రజల ఆరోగ్యానికి నిత్యం సేవలందిస్తున్న ప్రముఖ వైద్య సంస్థ వివీర హాస్పిటల్ తన వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని ప్రత్యేకంగా ఉచిత వైద్య శిబిరం నిర్వహించింది. ఈ కార్యక్రమానికి ప్రధాన అతిథిగా హాజరైన స్థానిక డివిజన్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి హాస్పిటల్ సిబ్బంది, వైద్య నిపుణులు, శిబిరానికి హాజరైన ప్రజలతో కలిసి పాల్గొన్నారు.ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ, ఆరోగ్య సేవలు ప్రతి ఒక్కరికి అందుబాటులో ఉండడం




సమాజ అభివృద్ధిలో కీలక అంశమని, ముఖ్యంగా ఉచిత వైద్య శిబిరాలు ప్రజల ఆరోగ్య పరిస్థితిని సమయానుకూలంగా పరీక్షించుకునేందుకు చాలా పెద్ద సహాయం చేస్తాయని తెలిపారు. సర్వసాధారణ ప్రజలు చిన్న చిన్న రోగాలను నిర్లక్ష్యం చేసే పరిస్థితిలో ఈ శిబిరాల ద్వారా వారికి తగిన వైద్య సలహాలు, అవసరమైన చికిత్సలు, ఆరోగ్య సంబంధిత అవగాహన లభించటం ఎంతో మంచిదని, హాస్పిటల్ నిర్వహణను అభినందిస్తూ, సమాజానికి సేవ చేయాలనే ఉద్దేశ్యంతో ఇలాంటి కార్యక్రమాలను చేపట్టడం నిజంగా ప్రశంసనీయమని పేర్కొన్నారు. హయత్‌నగర్ ప్రాంతంలో జనాభా పెరిగిన నేపథ్యంలో మెరుగైన వైద్య సదుపాయాలు అవసరమని, వాటిని అందుబాటులోకి తీసుకురావడానికి తన వంతు కృషి ఎల్లప్పుడూ కొనసాగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి బండారి భాస్కర్, జిల్లా ఎస్సీ మోర్చా ప్రధాన కార్యదర్శి పారంద మహేష్,హాస్పటల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# వృద్ధుడిపై తాగుబోతుల హత్యా ప్రయత్నం

ఎల్బీనగర్, నవంబర్ 16 (భారత శక్తి): దిల్‌సుఖ్‌నగర్ పరిధిలోని సరూర్నగర్ పోలీస్ స్టేషన్ కు కూతవేటు దూరంలో గణేష్ కాంప్లెక్స్ భవన యజమాని గణేష్ ప్రసాద్ 70 సంవత్సరాల పైబడిన వృద్ధుడు తన కాంప్లెక్స్ లోకి వెళ్ళి మెట్ల దారిలో అడ్డంగా కూర్చున్న తాగుబోతులను మీరు మా బిల్డింగ్లో ఎందుకు తాగుతున్నారని, ఎదురుగా వున్న యం.జి వైన్ లో కెళ్ళి తాగాలని, ఇక్కడి నుండి వెళ్లిపోవాలని చెప్పినందుకు వృద్ధుడు అని చూడకుండా అతని చొక్కా పట్టుకొని ఈడ్చుకుంటూ రోడ్డుపై పడేసి బీరు బాటిల్స్ పగలకొట్టి చంపే ప్రయత్నం చేశారు. అప్పుడే గణేష్ కాంప్లెక్స్ మేనేజర్ శ్రీనివాస్ యాదవ్, చుట్టుపక్కల ఉన్న వారందరూ రావడంతో ముగ్గురు వ్యక్తులు పారిపోయారు.కొద్దీ దూరం వెంటపడి ఒకరిని పట్టుకొని పోలీసులకు శ్రీనివాస్ యాదవ్ సమాచారం అందించాడు. చుట్టుపక్కల గల దుకాణా దారులు, ప్రజలు మాట్లాడుతూ, రోజు రోజుకు మితిమీరిన యం.జి వైన్ తాగుబోతుల అరాచకం, మాకు భయాన్ని కలిగిస్తున్నదని వాపోయారు.ప్రతి రోజు ఉదయం నుండి రాత్రి వరకు తాగుబోతులు రోడ్డుపై వెళ్లే వారిని ఇబ్బందులు పెడుతూ




రోడ్ల మీదనే తాగుతూ ప్రజలను ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ విషయాన్ని పోలీసులు చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారని చుట్టుపక్కల వారు ఆరోపిస్తున్నారు.రెండు సంవత్సరాలుగా "ఎం.జీ వైన్ షాప్ పర్మిట్ రూమ్ ను జనతా సెక్షన్ చట్ట విరుద్ధంగా మొదటి అంతస్తు & రెండవ అంతస్తులో నడుపుతోందని, ఈ విభాగంలో టేబుల్స్, కుర్చీలు, స్నాక్స్ ఆహారాన్ని తయారు చేయడానికి సౌకర్యాలు కల్పించబడ్డాయని, దీనివల్ల కాలనీలోకి ప్రవేశించేటప్పుడు తాగుబోతులతో రోజూ ఇబ్బంది కలుగుతుందని, చాలా మంది రోడ్డుపై మద్యం సేవించి కాలనీ ప్రజలకు, ముఖ్యంగా మహిళలు టీనేజర్లకు చాలా ఇబ్బంది కలిగిస్తున్నారని ఆవేదన చెందారు.ఈ ప్రాంతంలో 10 మీటర్ల పరిసర ప్రాంతంలో అనేక విద్యా సంస్థలు, నివాస గృహాలు ఉన్నాయని గతంలో విద్యుత్ తీగ కారణంగా ప్రమాదాలు జరిగాయని, పోలీసులు వెంటనే వైన్ షాప్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని కోరారు.

# ఫీజు రీయింబర్స్మెంట్ రావాలంటే వైట్ రేషన్ కార్డు తప్పనిసరి!

హైదరాబాద్, నవంబర్ 16 (భారత శక్తి): ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిల విడుదల కోసం ఇటీవల ఉన్నత విద్యా సంస్థలు ప్రభుత్వంపై భారీ ఎత్తున నిరసన ప్రకటించిన సంగతి తెలిసిందే. అయితే పెండింగ్ బకాయిల విడుదలకు ప్రభుత్వం సమ్మతం తెలపగా.. ఉన్నత విద్యా సంస్థల సమాఖ్య తమ నిరసనను విరమించారు. అయితే ఫీజు రీయింబర్స్మెంట్ పొందడానికి ప్రభుత్వం ఓ మెలిక పెట్టింది. ఇకపై ఫీజు రీయింబర్స్మెంట్ రావాలంటే తెల్ల రేషన్ కార్డు తప్పనిసరి చేసింది. ఫీజు రీయింబర్స్మెంట్ పొందేవారిలో పేద విద్యార్థులతోపాటు ఆర్థికంగా ఉన్నత కుటుంబాల వారు, ఉద్యోగస్తుల పిల్లలు కూడా ఉన్నట్టు ప్రభుత్వం దృష్టికి వచ్చింది. నకిలీ ఫీజు రీయింబర్స్మెంట్ లబ్ధిదారులను గుర్తించేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్టు అధికారులు చెబుతున్నారు. వైట్ రేషన్ కార్డుకు అర్హులు కాని వారికి మీసేవ కేంద్రాల్లో మిస్సింగ్




రేషన్ కార్డు అని చూపిస్తుంది. దీంతో అనర్హులను సులభంగా గుర్తించి, వారిని తొలగించి మిగిలిన వారికి నిధులు విడుదల చేయాలని ప్రభుత్వం ప్రణాళిక రచించింది.

# ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే.. రైతులకు ఇబ్బందులు: హరీశ్‌రావు

సంగారెడ్డి, నవంబర్ 16 (భారత శక్తి): కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల తెలంగాణ వ్యాప్తంగా రైతులు ఇబ్బందుల్లో పడ్డారని మాజీ మంత్రి హరీశ్‌రావు విమర్శించారు. 85 లక్షల మెట్రిక్ టన్నుల వడ్లు కొనుగోలు చేస్తామని చెప్పిన ప్రభుత్వం.. ఇప్పటి వరకు కేవలం ఐదారు లక్షల మెట్రిక్ టన్నులు మాత్రమే కొనుగోలు చేసిందన్నారు. వాటిలో కొన్ని బిల్లులు ఇంకా పెండింగ్‌లోనే ఉన్నాయన్నారు. సిద్దిపేట జిల్లా చిన్నకోడూరు మండలం మల్లారం గ్రామంలోని వడ్లు కొనుగోలు కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. దాదాపు రూ.1200 కోట్ల వరకు MSP పెండింగ్ లో ఉంది. దాదాపు రూ.200 కోట్ల వరకు బోనస్ పెండింగ్‌లో ఉందని చెప్పారు. గత యాసంగి బోనస్ డబ్బులు వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వడ్ల కొనుగోలును వేగవంతం చేయాలన్నారు. "మక్క రైతుల పరిస్థితి దయనీయంగా ఉంది. రాష్ట్రంలో మక్క కొనుగోళ్లను ఆలస్యం చేశారు. దాదాపు



రాష్ట్ర వ్యాప్తంగా 6 లక్షల ఎకరాల్లో మక్కలు పండించారు. ఇక పత్తి విషయానికొస్తే ఎకరానికి 7 క్వింటాళ్ల పత్తి మాత్రమే కొంటామంటే ఎలా? కొన్ని జిల్లాల్లో ఎకారానికి 11, 12 క్వింటాళ్ల పత్తి పండింది. వాళ్లు మిగతా పంటను ఏం చేయాలి? పత్తి రైతులు అప్పులతో ఆత్మహత్యలు చేసుకుంటున్న పరిస్థితి ఏర్పడింది. పత్తి రైతులను కేంద్రంలోని భాజపా ప్రభుత్వం, మక్క రైతులను రాష్ట్ర ప్రభుత్వం ఇబ్బంది పెడుతున్నాయి. తక్షణమే రాష్ట్ర వ్యాప్తంగా పంటలు దెబ్బతిన్న రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ విడుదల చేయాలి" అని హరీశ్‌రావు డిమాండ్ చేశారు.

# హైదరాబాద్ ఎన్టీఆర్ స్టేడియం వద్ద కాలిబూడిదైన ఎలక్ట్రిక్ కారు

హైదరాబాద్, నవంబర్ 16 (భారత శక్తి): హైదరాబాద్ నగరంలోని ఎన్టీఆర్ స్టేడియం సమీపంలో ఆదివారం మధ్యాహ్నం ఓ ఎలక్ట్రిక్ కారులో అకస్మాత్తుగా మంటలు చెలరేగి కలకలం సృష్టించాయి. ఈ అగ్నిప్రమాదంలో కారు పూర్తిగా కాలి బూడిదైంది. మంటల తీవ్రతకు సమీపంలో పార్క్ చేసి ఉన్న మరో కారు కూడా పాక్షికంగా దెబ్బతింది. వివరాల్లోకి వెళితే, నారాయణగూడ పరిధిలోని ఎన్టీఆర్ స్టేడియం వద్ద పార్క్ చేసి ఉన్న ఓ ఎలక్ట్రిక్ కారు నుంచి ఒక్కసారిగా దట్టమైన పొగలు, మంటలు వ్యాపించాయి. ఇది గమనించిన స్థానికులు వెంటనే అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించారు. హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకున్న ఫైర్ సిబ్బంది, సుమారు అరగంట పాటు శ్రమించి మంటలను పూర్తిగా అదుపులోకి తీసుకువచ్చారు. ఈ ఘటన కారణంగా ఆ ప్రాంతంలో కొద్దిసేపు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. గాంధీనగర్, దోమలగూడ పోలీసులు వెంటనే రంగంలోకి దిగి ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు. ప్రమాద సమయంలో వాహనంలో ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పిందని, ఎలాంటి ప్రాణనష్టం జరగలేదని అధికారులు తెలిపారు. ప్రమాదానికి గల కచ్చితమైన కారణాలు ఇంకా తెలియరాలేదని, సాంకేతిక లోపం ఏమైనా ఉందా అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నామని ఓ సీనియర్ పోలీసు అధికారి వెల్లడించారు. ఫోరెన్సిక్ బృందం ఆధారాలు సేకరించిన తర్వాత పూర్తి వివరాలు తెలుస్తాయని ఆయన పేర్కొన్నారు. ఎలక్ట్రిక్ వాహనాల వినియోగం పెరుగుతున్న తరుణంలో ఇలాంటి ఘటనలు వాహనదారుల్లో భద్రతపై ఆందోళన కలిగిస్తున్నాయి.

## చాయ్‌వాలా ప్రధాని అయ్యాడంటే కారణం అదే: సీఎం చంద్రబాబు

అమరావతి, నవంబర్ 16 (భారత శక్తి): ఒకప్పుడు చాయ్‌వాలాగా జీవితం ప్రారంభించిన నరేంద్ర మోదీ ఈరోజు దేశానికి ప్రధానమంత్రి కాగలిగారంటే అందుకు కారణం భారత రాజ్యాంగం కల్పించిన అవకాశాలేనని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. దేశాన్ని ప్రపంచంలోనే ప్రథమ స్థానంలో నిలబెట్టేందుకు ప్రధాని మోదీ నిరంతరం కృషి చేస్తున్నారని ఆయన ప్రశంసించారు. ఆదివారం ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయవాదుల సంఘం ఆధ్వర్యంలో 'భారత రాజ్యాంగం 75 సంవత్సరాలు' అనే అంశంపై నిర్వహించిన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ కార్యక్రమానికి భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ బి.ఆర్. గవాయ్, ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్ కూడా హాజరయ్యారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ, తాను ముఖ్యమంత్రిగా, జస్టిస్ గవాయ్ సీజేఐగా, జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్ ఏపీ హైకోర్టు సీజేగా తమ విధులను నిర్వర్తిస్తున్నామంటే అదంతా రాజ్యాంగం కల్పించిన గొప్ప అవకాశమేనని పేర్కొన్నారు. సీజేఐ జస్టిస్ గవాయ్‌పై చంద్రబాబు ప్రత్యేక ప్రశంసలు కురిపించారు. జస్టిస్ గవాయ్ మహారాష్ట్రలోని అమరావతి ప్రాంతం నుంచి వచ్చారని గుర్తుచేశారు. అత్యున్నత పదవిలో ఉన్నప్పటికీ ఆయన ఎంతో నిరాడంబరంగా ఉంటారని, ఎల్లప్పుడూ సమానత్వానికి ప్రాధాన్యత ఇస్తారని కొనియాడారు. "జస్టిస్ గవాయ్ చాలా మంచి మనసున్న వ్యక్తి. ప్రజలు ఎప్పటికీ గుర్తుంచుకునే గొప్ప తీర్పులను ఆయన వెలువరించారు" అని చంద్రబాబు అన్నారు. భారతదేశ భవిష్యత్తుపై చంద్రబాబు బలమైన విశ్వాసం వ్యక్తం చేశారు. "ప్రపంచంలోని అనేక దేశాలు యువత కొరతతో ఇబ్బందులు పడుతున్నాయి. కానీ, మన దేశంలో ఆ సమస్య లేదు. అపారమైన మానవ వనరులు మన సొంతం. సంస్కరణల తర్వాత ప్రజల ఆలోచనా విధానంలో మార్పు వచ్చింది. 2047 నాటికి ప్రపంచవ్యాప్తంగా భారతీయులు అత్యంత ప్రభావశీల శక్తిగా ఎదుగుతారన్న నమ్మకం నాకుంది" అని ఆయన ధీమా వ్యక్తం చేశారు. సమాజంలో తప్పులు జరిగినప్పుడు వాటిని సరిదిద్ది, ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించడంలో న్యాయవ్యవస్థ పాత్ర అత్యంత కీలకమని చంద్రబాబు నొక్కిచెప్పారు. ఆధునిక కాలంలో సోషల్ మీడియా ప్రభావంపై ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. "సోషల్ మీడియా వచ్చిన తర్వాత ప్రతి ఒక్కరూ ఎడిటర్‌గా మారిపోతున్నారు. ఇష్టానుసారంగా వ్యక్తిగత దాడులకు పాల్పడుతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో దేశ ప్రయోజనాలకే ప్రథమ ప్రాధాన్యం ఇవ్వాలి" అని ఆయన పిలుపునిచ్చారు. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ప్రసాదించిన 'ఒక వ్యక్తి ఒక ఓటు' హక్కు ఒక గొప్ప వరమని చంద్రబాబు అభివర్ణించారు. "కొన్ని దేశాల్లో ఇప్పటికీ ప్రజలకు సమాన ఓటు హక్కు లేదు. కానీ, భారతదేశంలో పేద, ధనిక, స్త్రీ, పురుష బేధం లేకుండా అందరికీ సమాన ఓటు హక్కు ఉంది" అని ఆయన వివరించారు. సామాజిక, ఆర్థిక సమానత్వం ఉన్న సమాజాన్ని రూపొందించాల్సిన అవసరం ఉందని, ప్రభుత్వ విధానాలు ఈ సమానత్వాన్ని సాధించడంలో కీలక పాత్ర పోషిస్తాయని ఆయన తెలిపారు. "ఆరోగ్యకరమైన, సంపన్నమైన, సంతోషకరమైన సమాజాన్ని నిర్మించాలన్నదే నా ప్రణాళిక. ఇందుకు ప్రతి ఒక్కరి సహకారం కోరుతున్నాను" అని చంద్రబాబు తన ప్రసంగాన్ని ముగించారు.

## తిరుమల శ్రీవారి సేవల ఫిబ్రవరి కోటా...

తిరుమల, నవంబర్ 16 (భారత శక్తి): తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామి వారిని 2026 ఫిబ్రవరి నెలలో దర్శించుకోవాలని భావిస్తున్న భక్తులకు తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) ముఖ్యమైన ప్రకటన విడుదల చేసింది. ఫిబ్రవరి నెలకు సంబంధించిన వివిధ రకాల దర్శన టికెట్లు, ఆర్జిత సేవలు, గదుల కోటాను ఆన్‌లైన్‌లో విడుదల చేసే తేదీల షెడ్యూల్‌ను అధికారికంగా ప్రకటించింది. భక్తులు ఈ తేదీలను గమనించి, తమ ప్రణాళికకు అనుగుణంగా టికెట్లను బుక్ చేసుకోవాలని సూచించింది. ఈ ప్రక్రియ మొత్తం నవంబర్ 18న ప్రారంభం కానుంది.

**నవంబర్ 18న ఆర్జిత సేవల ఎలక్ట్రానిక్ డిప్**

తిరుమల శ్రీవారికి నిర్వహించే సుప్రభాతం, తోమాల, అర్చన, అష్టదళ పాదపద్మారాధన వంటి ఆర్జిత సేవలకు భక్తుల నుంచి విశేష స్పందన ఉంటుంది. ఈ సేవా టికెట్లను టీటీడీ ఎలక్ట్రానిక్ డిప్ విధానంలో కేటాయిస్తుంది. ఫిబ్రవరి నెలకు సంబంధించిన ఈ సేవల కోటా కోసం నవంబర్ 18వ తేదీ ఉదయం 10 గంటల నుంచి భక్తులు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవచ్చు. ఈ నమోదు ప్రక్రియ నవంబర్ 20వ తేదీ ఉదయం 10 గంటల వరకు అందుబాటులో ఉంటుంది. ఎలక్ట్రానిక్ డిప్‌లో టికెట్లు పొందిన భక్తులు నవంబర్ 20 నుంచి 22వ తేదీ మధ్యాహ్నం 12 గంటల లోపు రుసుము చెల్లించి, టికెట్లను ఖరారు చేసుకోవాల్సి ఉంటుంది.

నవంబర్ 21, 24 తేదీల్లో వివిధ టికెట్ల విడుదల

నవంబర్ 21వ తేదీ ఉదయం 10 గంటలకు కల్యాణోత్సవం, ఊంజల్ సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్రదీపాలంకార సేవ, శ్రీవారి సాలకట్ల తెప్పోత్సవం టికెట్లను టీటీడీ ఆన్‌లైన్‌లో విడుదల చేస్తుంది. అదేరోజు మధ్యాహ్నం 3 గంటలకు వర్చువల్ సేవలు, వాటికి సంబంధించిన దర్శన స్లాట్ల కోటాను అందుబాటులో ఉంచుతుంది. ఇక నవంబర్ 24వ తేదీన పలు ముఖ్యమైన దర్శన టోకెన్లను విడుదల చేయనున్నారు. ఉదయం 10 గంటలకు అంగప్రదక్షిణ టోకెన్ల కోటాను, ఉదయం 11 గంటలకు శ్రీవాణి ట్రస్టు దర్శన టికెట్ల కోటాను భక్తులకు అందుబాటులోకి తీసుకురానున్నారు. అదేరోజు మధ్యాహ్నం 3 గంటలకు వయోవృద్ధులు, దివ్యాంగులు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడేవారి కోసం ఉచిత ప్రత్యేక దర్శనం టోకెన్ల కోటాను విడుదల చేయనున్నట్లు టీటీడీ తెలిపింది.

*** నవంబర్ 25న ప్రత్యేక ప్రవేశ దర్శనం, గదుల కోటా**

భక్తులు అత్యధికంగా ఎదురుచూసే రూ.300 ప్రత్యేక ప్రవేశ దర్శన టికెట్ల కోటాను నవంబర్ 25వ తేదీ ఉదయం 10 గంటలకు ఆన్‌లైన్‌లో విడుదల చేయనున్నారు. దర్శన టికెట్లతో పాటు వసతి సౌకర్యం కూడా ముఖ్యమే కాబట్టి, తిరుమల మరియు తిరుపతిలో గదుల కేటాయింపునకు సంబంధించిన ఆన్‌లైన్ కోటాను కూడా నవంబర్ 25న మధ్యాహ్నం 3 గంటలకు విడుదల చేయనున్నట్లు టీటీడీ తన ప్రకటనలో స్పష్టం చేసింది. భక్తులు శ్రీవారి ఆర్జిత సేవలు, దర్శన టికెట్లు, గదుల బుకింగ్ కోసం టీటీడీ అధికారిక వెబ్‌సైట్ https://ttdevasthanams.ap.gov.in ను మాత్రమే సంప్రదించాలని, నకిలీ వెబ్‌సైట్ల పట్ల అప్రమత్తంగా ఉండాలని టీటీడీ ముఖ్య ప్రజా సంబంధాల అధికారి ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.

## ఎర్రకోట పేలుడు.. ఘటనా స్థలంలో సైన్యం బుల్లెట్లు.. విచారణ ముమ్మరం

ఢిల్లీ, నవంబర్ 16 (భారత శక్తి): ఢిల్లీలోని ఎర్రకోట సమీపంలో జరిగిన కారు పేలుడు ఘటనపై దర్యాప్తు బృందాలు విచారణను వేగవంతం చేశాయి. ఈ కేసులో కీలక ఆధారాలు లభించాయి. ఘటనా స్థలంలో ఫోరెన్సిక్ బృందాలు మూడు బుల్లెట్లను స్వాధీనం చేసుకున్నట్లు ఢిల్లీ పోలీసులు తెలిపారు. ఇవి సైనికులు వాడే 9 ఎంఎం కాట్రిడ్జ్‌లు అని వెల్లడించారు. అయితే, ఆ ప్రదేశంలో ఎలాంటి తుపాకీ లభ్యం కాలేదని స్పష్టం చేశారు. ఘటనా స్థలంలో భద్రతా విధుల్లో ఉన్న పోలీసులు, భద్రతా సిబ్బందికి అందించిన బుల్లెట్లను పరిశీలించామని, స్వాధీనం చేసుకున్న బుల్లెట్లు వారికి సంబంధించినవి కావని పోలీసులు ధ్రువీకరించారు. దీంతో భద్రతా బలగాలు వాడే బుల్లెట్లు అక్కడికి ఎలా వచ్చాయనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు. దీనిపై స్పష్టత కోసం స్థానికంగా ఉన్న సీసీటీవీ ఫుటేజీలను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. సోమవారం ఎర్రకోట మెట్రో స్టేషన్ సిగ్నల్ వద్ద జరిగిన ఈ పేలుడులో సుమారు రెండు కిలోల అమ్మోనియం నైట్రేట్‌ను ఉపయోగించినట్లు ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబొరేటరీ అధికారులు నిర్ధారించారు. ఘటనా స్థలం నుంచి ఇప్పటివరకు దాదాపు 40 నమూనాలను సేకరించారు. వీటిలో బుల్లెట్లతో పాటు రెండు వేర్వేరు రకాల పేలుడు పదార్థాలు ఉన్నట్లు గుర్తించారు. ఈ కేసులో ప్రధాన నిందితుడిగా భావిస్తున్న ఉమర్ నబీతో సంబంధం ఉన్న మరికొందరిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. కారులో ఇంకా ఎవరైనా ఉన్నారా, పేలుడు పదార్థాలను ఎక్కడ నింపారనే వివరాలను రాబట్టేందుకు ప్రయత్నిస్తున్నారు.

## రామోజీ ఎక్సలెన్స్ అవార్డుల కార్యక్రమం..

హైదరాబాద్, నవంబర్ 16 (భారత శక్తి): ఈనాడు గ్రూప్ సంస్థల వ్యవస్థాపక అధినేత రామోజీరావు జయంతిని పురస్కరించుకుని హైదరాబాద్‌లోని రామోజీ ఫిలింసిటీలో రామోజీ ఎక్సలెన్స్ అవార్డుల ప్రదానోత్సవం నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమానికి భారత ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్, కేంద్రమంత్రులు కిషన్ రెడ్డి, రామ్మోహన్ నాయుడు, మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు, తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, ఏపీ సీఎం చంద్రబాబు, తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, మాజీ సీజేఐ జస్టిస్ ఎన్వీ రమణ, సినీ ప్రముఖులు మురళీమోహన్, బ్రహ్మానందం తదితరులు హాజరయ్యారు. జర్నలిజం, గ్రామీణాభివృద్ధి, మానవ సేవ, సైన్స్ అండ్ టెక్నాలజీ, కళసంస్కృతి, యూత్ ఐకాన్, మహిళా సాధికారత వంటి ఏడు రంగాల్లో విశేష ప్రతిభ కనబర్చిన వారికి ఈ వేదికపై అవార్డులను ప్రదానం చేయనున్నారు. రామోజీరావు స్ఫూర్తిని కొనసాగిస్తూ వివిధ రంగాల్లో అద్భుతమైన కృషి చేసిన వారిని ఈ పురస్కారాలతో సత్కరించనున్నారు. ఈ కార్యక్రమంలో ఏపీ సీఎం చంద్రబాబు, తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి పక్కపక్కనే ఆసీనులై నవ్వుతూ మాట్లాడుకోవడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఇద్దరు నేతలు నవ్వులు చిందిస్తూ ముచ్చటించుకుంటున్న దృశ్యాలు అందరి దృష్టిని ఆకర్షించాయి.

## రామోజీరావు ఒక వ్యక్తి కాదు.. శక్తిమంతమైన వ్యవస్థ: వెంకయ్యనాయుడు

హైదరాబాద్, నవంబర్ 16 (భారత శక్తి): రామోజీ గ్రూప్ సంస్థల వ్యవస్థాపకులు రామోజీరావు ఒక వ్యక్తి కాదని, ఆయన ఒక శక్తిమంతమైన వ్యవస్థ అని మాజీ ఉపరాష్ట్రపతి ఎం. వెంకయ్యనాయుడు అభివర్ణించారు. స్వయంకృషి, క్రమశిక్షణ, పట్టుదలతో అనేక రంగాల్లో అద్భుత విజయాలు సాధించి, భావి తరాలకు మార్గదర్శకంగా నిలిచిన మహోన్నత వ్యక్తి అని ఆయన కొనియాడారు. రామోజీరావు పేరిట ఏర్పాటు చేసిన రామోజీ ఎక్సలెన్స్ జాతీయ అవార్డుల ప్రదానోత్సవం ఆదివారం రామోజీ ఫిల్మ్‌సిటీలో అత్యంత వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమానికి హాజరైన వెంకయ్యనాయుడు మాట్లాడుతూ, "రామోజీరావు లేని ఆయన సంస్థలను ఊహించుకోలేకపోతున్నాను. ఆయన కేవలం ఒక వ్యక్తి కాదు, అదొక శక్తి. జనహితమే జర్నలిజం అని నమ్మి ఆచరించిన మహామనీషి. సాధారణ రైతు కుటుంబం నుంచి వచ్చి, ప్రపంచమంతా తెలుగువారి వైపు చూసేలా ఎదిగిన ఆయన జీవితం యువతకు గొప్ప స్ఫూర్తి. ఆయన సంస్థల ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా ఎందరో లబ్ధి పొందారు. తెలుగు ప్రజల హృదయాల్లో ఆయన స్థానం శాశ్వతం" అని పేర్కొన్నారు. ప్రజా జీవితంపై రామోజీరావు వేసినంత బలమైన ముద్ర ఇటీవలి కాలంలో మరెవరూ వేయలేదని ఆయన అన్నారు. విభిన్న రంగాల్లో విశిష్ట సేవలు అందించిన ప్రముఖులను రామోజీరావు జయంతి సందర్భంగా సత్కరించడం అభినందనీయమని వెంకయ్యనాయుడు అన్నారు. "రామోజీరావు కేవలం వ్యాపారవేత్త మాత్రమే కాదు, తెలుగు జాతి కీర్తిని విశ్వవ్యాప్తం చేసిన క్రాంతి దర్శి. సామాజిక నిబద్ధత అనే పునాదిపై తన విజయ సౌధాన్ని నిర్మించుకున్నారు. ఆయన పత్రికను ధర్మయుద్ధం కోసం ఉపయోగించారు. తెలుగు పోతే వెలుగు లేదు. మన మాతృభాషను కాపాడుకోవడమే మనం రామోజీరావుకు ఇచ్చే నిజమైన నివాళి" అని ఆయన ఉద్ఘాటించారు. ఈ కార్యక్రమానికి భారత ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ ముఖ్య అతిథిగా విచ్చేశారు. తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు, తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి, కేంద్ర మంత్రులు జి. కిషన్ రెడ్డి, రామ్ మోహన్ నాయుడు, బండి సంజయ్ తదితరులు గౌరవ అతిథులుగా పాల్గొన్నారు.

## నమ్మిన సిద్ధాంతం కోసం దేనినైనా వదులుకునే తత్వం ఆయనది

హైదరాబాద్, నవంబర్ 16 (భారత శక్తి): రామోజీ గ్రూప్ సంస్థల వ్యవస్థాపకులు, అక్షర యోధుడు స్వర్గీయ రామోజీరావు.. ప్రజల పక్షాన నిలిచి పోరాడిన ఒక గొప్ప యోధుడని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు కొనియాడారు. హైదరాబాద్‌లో ఆదివారం ఘనంగా జరిగిన 'రామోజీ ఎక్సలెన్స్ జాతీయ అవార్డుల ప్రదానోత్సవం 2025' కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. నమ్మిన సిద్ధాంతం కోసం, విలువల కోసం చివరి శ్వాస వరకు పోరాడిన రామోజీరావు సేవలు చిరస్మరణీయమని చంద్రబాబు పేర్కొన్నారు. ఆయన ఏర్పాటు చేసిన వ్యవస్థలు శాశ్వతంగా నిలిచి ఉంటాయని, ఆయన స్ఫూర్తి ఎందరికో ఆదర్శమని అన్నారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ, "అక్షర యోధుడు రామోజీరావుకు నా ఘన నివాళులు. ఆయన సేవలను ఎప్పటికీ మర్చిపోలేం. సమాజంలో ప్రతిపక్షం బలహీనంగా ఉన్నప్పుడు, ఆ లోటును రామోజీరావే తన పత్రిక ద్వారా భర్తీ చేసేవారు. ప్రభుత్వాల లోపాలను ఎత్తిచూపుతూ, ప్రజల గొంతుకగా నిలిచారు. ఆయన కేవలం ఒక మీడియా అధినేత మాత్రమే కాదు, సామాజిక బాధ్యత కలిగిన ఒక మార్గదర్శకుడు" అని ప్రశంసించారు. రామోజీరావు తన జీవితంలో ఉన్నతమైన విలువలకు కట్టుబడి ఉన్నారని చంద్రబాబు తెలిపారు. "నమ్మిన సిద్ధాంతం కోసం దేనినైనా వదులుకునే తత్వం ఆయనది. ఈనాడు పత్రికను కేవలం వార్తలకే పరిమితం చేయకుండా, ప్రజలను సమాజ సేవలో భాగస్వాములను చేశారు. ఎలాంటి ప్రకృతి వైపరీత్యాలు సంభవించినా, తన సొంత డబ్బుతో బాధితులను ఆదుకోవడానికి ముందుకు వచ్చేవారు. ఆయన ఒక్క పిలుపు ఇస్తే చాలు, ప్రజలు వెల్లువెత్తేవారు. ఆయనపై ప్రజలకు అంతటి నమ్మకం ఉండేది" అని చంద్రబాబు వివరించారు. రామోజీరావుకు తెలుగు భాషపై ఉన్న మమకారాన్ని ఈ సందర్భంగా చంద్రబాబు ప్రత్యేకంగా ప్రస్తావించారు. రామోజీరావు స్ఫూర్తితో, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా తెలుగు భాష పరిరక్షణకు, దాని అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. "ఒక సీఎంగా తెలుగు భాషను కాపాడేందుకు ఏమైనా చేస్తాను. రామోజీరావు ఆశయాలను ముందుకు తీసుకెళ్లే బాధ్యత మనందరిపైనా ఉంది" అని ఆయన స్పష్టం చేశారు. జర్నలిజం, గ్రామీణాభివృద్ధి, మానవ సేవ, సైన్స్ అండ్ టెక్నాలజీ, కళసంస్కృతి, మహిళా సాధికారత, యూత్ ఐకాన్ వంటి ఏడు విభాగాల్లో ఈ రామోజీ ఎక్సలెన్స్ అవార్డులను ప్రదానం చేశారు.

## నా సోదరిని అవమానిస్తే ఊరుకోను : తేజ్ ప్రతాప్ యాదవ్ వార్నింగ్

బీహార్, నవంబర్ 16 (భారత శక్తి): బీహార్ రాజకీయాల్లో కీలకమైన ఆర్జేడీ అధినేత లాలూ ప్రసాద్ యాదవ్ కుటుంబంలో విభేదాలు తారాస్థాయికి చేరాయి. లాలూ కుమార్తె రోహిణి ఆచార్య రాజకీయాల నుంచి తప్పుకుంటున్నట్లు ప్రకటించడం కలకలం రేపింది. ఎన్నికల ఓటమిపై ప్రశ్నించినందుకు తనను అవమానించి, ఇంటి నుంచి గెంటేశారని ఆమె ఆరోపించారు. ఈ పరిణామంపై ఆమె సోదరుడు తేజ్ ప్రతాప్ యాదవ్ తీవ్రంగా స్పందించారు. తన సోదరిని అవమానించిన వారిని "గొయ్యి తీసి పాతి పెడతా" అంటూ ఇన్‌స్టాగ్రామ్‌లో తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. ఇటీవల జరిగిన బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో ఆర్జేడీ ఘోర పరాజయానికి గల కారణాలను ప్రశ్నించిన తర్వాత తనను తీవ్రంగా అవమానించారని రోహిణి ఆరోపించారు. తన తండ్రికి కిడ్నీ దానం చేసిన విషయాన్ని అడ్డం పెట్టుకుని, పార్టీ టికెట్ కోసమే అలా చేశానని ప్రచారం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. తేజస్వి యాదవ్ సన్నిహితుల ఆదేశాలతోనే ఇదంతా జరిగిందని ఆమె ఆరోపణలు చేశారు. ఈ ఘటనల తర్వాత రాజకీయాల నుంచి వైదొలగుతున్నట్లు ప్రకటించారు. సోదరి ఉదంతంపై తేజ్ ప్రతాప్ యాదవ్ తీవ్రంగా స్పందించారు. "నాకు జరిగిన అవమానాన్ని నేను భరించాను. కానీ నా సోదరికి జరిగిన అవమానాన్ని సహించలేను. మా కుటుంబాన్ని లక్ష్యంగా చేసుకున్న ద్రోహులను బీహార్ ప్రజలు క్షమించరు" అని హెచ్చరించారు. ఈ క్రమంలో తన తండ్రి లాలూ యాదవ్‌కు భావోద్వేగ పిలుపునిచ్చారు. "నాన్నా, ఒక్క సంకేతం ఇవ్వండి చాలు. ఈ ద్రోహులను ప్రజలే ఖననం చేస్తారు. ఇది పార్టీల పోరాటం కాదు, కుటుంబ గౌరవం, ఆడబిడ్డల ఆత్మగౌరవం కోసం పోరాటం" అని పేర్కొన్నారు. ఈ కుటుంబ వివాదంపై ఇతర పార్టీలు స్పందించాయి.

# ఈ భయానక పరిస్థితిని దాటేదెలా..?

- కాశ్మీర్ ని ఇక పచ్చగా చూడలేమా..?
- రక్తపుటేరులు పారిస్తున్న ఉగ్రవాదులు..
- ఇది దేశ ఆర్థిక, రాజనీతికి భయంకర విపత్తు..
- టెర్రరిస్ట్ గ్రూపులకు సహకారం అందిస్తున్న పాకిస్తాన్..
- భారత్ తో యుద్ధానికి కాలుదువ్వుతున్న వైనం..
- ఈ పరిస్థితుల వెనుక ఎవరున్నారు..? వాస్తవం ఏమిటి..?
- మన పెద్దలు చేసిన తప్పిదాలవల్ల ఇప్పుడు అనుభవిస్తున్నాం..
- క్షమా గుణమే భారత్ ను ఆపేస్తోందా..? శత్రుసంహారాన్ని నిలిపేస్తోందా..?
- ఇంకా ఉపేక్షించడం మన చేతగానితనం అంటున్న విశ్లేషకులు..
- శత్రుదేశాలను పూర్తిగా కట్టడిచేసే దమ్ము మనకి లేదా..?
- భగవద్గీత పుట్టిన ఈ గడ్డమీద వీరత్వానికి కొదువా..?
- భగవానుడి వ్యాఖ్యలు గుర్తుతెచ్చుకుని ముందుకు సాగాల్సిన సమయం ఆసన్నమైంది..
- తెగబడుతున్న టెర్రరిస్టుల ఆగడాలను క్షమించకూడదని సూచిస్తున్న " ఫోరం ఫర్ యాంటీ కరప్షన్ అండ్ హ్యూమన్ రైట్స్ సంస్థ "..

***(స్పెషల్ కరస్పాండెంట్) :***
***హైదరాబాద్, నవంబర్ 16 ( భారత శక్తి ) :***

2025 ఏప్రిల్‌లో కాశ్మీర్‌లో పహల్గామ్ ప్రాంతంలో తీవ్రంగా ఉగ్రదాడి జరిగింది.. 26 మంది, ఇందులో ఎక్కువగా టూరిస్టులు ఉన్నారు.. వీళ్లంతా ఏమి పాపం చేశారు.. ఈ దాడిని తామే చేసినట్లు ది రెసిస్టెన్స్ ఫ్రంట్ అనే ఉగ్రవాద సంస్థ వెల్లడించింది. ఇంత నిర్భయంగా దాడులు చేస్తుంటే ఎందుకు అరికట్టలేకపోతున్నాం..?. విశ్లేషకులు అంటునట్టుగా ఇది "ఆర్థిక యుద్ధం లాంటి వ్యూహంగా పాకిస్తాన్ సహాయకులను ఉపయోగించి చేసిన డాడిలా ఉంది.. వారి లక్ష్యం ఏమిటంటే టూరిజాన్ని దెబ్బతీసి కాశ్మీర్ ఆర్థిక వ్యవస్థను, అక్కడి ప్రశాంతతను ధ్వంసం చేయడం.. కొన్ని నివేదికల ప్రకారం ఈ దాడిచేసిన గ్రూపులో స్థానిక కశ్మీరీలు, పాకిస్థానీలు ఉన్నారని తెలిసింది..

దీంతో భారత్ పాకిస్తాన్ ను కట్టడి చేయాలని నిర్ణయించుకుంది.. ఒకటి నీటి వ్యవహారం కాగా పాకిస్తాన్ పౌరులపై వీసా నిబంధనలు విధించింది.. సార్క్ వీసా అంటే ఉచిత వీసా పథకాన్ని రద్దు చేసింది. ఇండియన్ ఆర్మీ, పోలీసులు గూఢశోధనలు మొదలు పెట్టారు, అడవుల్లో, హిల్స్‌లో సమిష్టి కార్యక్రమాలు పెంచారు. రక్షణను దృష్టితో ఉంచుకుని ఆపరేషన్ గద్దర్ పేరిట అధికారులు ఒక గూఢ శక్తిని లక్ష్యంగా నియమించుకుని నియంత్రిత శోధన చేశారని సమాచారం వుంది..





భారత నావిక దళం, ఎయిర్ ఫోర్స్ కూడా వ్యూహాత్మక మానిటరింగ్ పెంచినట్లు తెలుస్తోంది.. రక్షణ చర్యలతో బాటు సివిల్ డిఫెన్స్ ను కూడా శక్తివంతంగా రూపొందించారు.. ఉదాహరణకి, ఆపరేషన్ అభ్యాస్ అనే సివిల్ డిఫెన్స్ డ్రిల్స్ కూడా నిర్వహించబడ్డాయి.

ఇక పాకిస్తాన్ తమ వైపు నుంచి వృత్తిపరమైన అభ్యంతరాలు వ్యక్తం చేసింది.. భారత్ చర్యలను విరోధాత్మకపు చర్యలుగా చూడటం మొదలుపెట్టింది. భారత్ చేపట్టిన నీటి ఒప్పందాన్ని నిలిపేయాలని లేదా వాటర్ ఫ్లో నియంత్రించడంలో చేసిన ప్రయత్నం యుద్ధానికి సమానంగా భావిస్తామని పేర్కొంది.. ఇలాంటి పరిస్థితుల్లో సరిహద్దుల్లో కాల్పులు కొనసాగుతున్నాయి.

నిజానికి ఇది సాధారణ ఉగ్రవాద సమస్య మాత్రమే కాదు.. దీనిని వ్యూహాత్మక శత్రుత్వంగా చూస్తున్నారు. పాకిస్తాన్ నిస్సిగ్గుగా టెర్రో సంస్థలకు మద్దతు ఇస్తోంది.. అందులో లష్కరే తోయిబా వంటి భయానక గ్రూపులు ఉన్నాయి..

టూరిజాన్ని లక్ష్యం చేయడం, క్యాష్మీర్ ఆర్థిక అవకాశాలను తగ్గించడం వంటి వ్యూహాలను రూపొందిస్తోంది పాక్.. ఇది "పరిరక్షణ వ్యూహం" అంటే ఎకనామిక్ డెస్టిబిలైజేషన్ కూడా కావచ్చునని కూడా స్ట్రాటెజిక్ విశ్లేషకులు తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారు.. భారత్ పై మధ్యస్థ అవసరాలకు, జాతీయ ప్రాధాన్యతలకు ముల్యాన్ని చూపించే విధంగా టెర్రొరిజంతో రహదారులను, పరిధులను పరీక్షించడం ఖచ్చితంగా చేయాలి...




### భారత రక్షణ శాఖ పరిష్టంగా ఉందా..?

కౌంటర్‌టెర్రర్ ఆపరేషన్స్: భారత ఆర్మీ, పోలీసు శాఖల మిలిటరీ, పోలీస్ ల సహకారంతో శోధనలు, కఠిన చర్యలు తీసుకుంది. ఇది సాధారణ దాడులపై తక్షణ స్పందన అని చెప్పవచ్చు.. . డిప్లమాటిక్ ఒత్తిడి: నర్సరింగ్ కాకుండా, భారత్ డిప్లమాటిక్ బైట్స్ కూడా వాడుతోంది.. భారత్ పాక్ సంబంధాలను "సహివాది చర్యలతో" మార్చేందుకు. నీటి ఒప్పందాన్ని నిలిపేయడం, పరిమిత శ్రీహద్దు కమ్యూనికేషన్, వీసా నిబంధనలు కఠినతరం చేయడం లాంటి చర్యలు తీసుకుంది.. ఇంటెలిజెన్స్, మానిటరింగ్: డ్రోన్లు, నావిక, ఎయిర్ ఫోర్స్ మెడ్స్, మానిటరింగ్ ద్వారా పాక్ వైపు రహస్య మార్గాలపై, టెర్రో సంస్థల కదలికలపై దృష్టి పెట్టింది..

### సివిల్-డిఫెన్స్ సంసిద్ధంగా ఉంది :

దేశ వ్యాప్తంగా "సివిల్ ఎమర్జెన్సీ" డ్రిల్లు నిర్వహించడం ద్వారా, ప్రజలను మద్దతుగా నిలిపే భద్రతా మెకానిజం బలోపేతం చెయ్యటం జరిగింది. స్ట్రాటజిక్ ఆపరేషన్స్: అభిజ్ఞ సమాచారం ప్రకారం ఆపరేషన్ సింధూర్ అనే ప్రక్రియలో, టెర్రో శిబిరాలపై వ్యూహాత్మక లక్ష్యగల దాడులు నిర్వహించడం జరిగింది. లక్ష్యపూరిత సర్జిల్స్: ఆపేరేషన్ గద్దర్ వంటి లోకల్ ఆపరేషన్లు కూడా ఉన్నాయి.

### ఎదురవుతున్న సవాళ్లు :

టెర్రిస్ట్ నాయకత్వం పూర్తిగా లొంగిపోకపోవచ్చు.. సరిహద్దు టెర్రో బేస్‌లను నాశనం చేయగలం, కానీ వారి ఆలోచనా విధానాన్ని మార్చగలమా..? ఈ ప్రక్రియలను అరికట్టడంలో ఎంతో రిస్క్ ఉంటుంది.. ప్రత్యేకించి పౌరుల మీద దాడులు, టూరిస్ట్ భద్రత, స్థానిక సామాజికస్థిరతపై ప్రతికూల ప్రభావం చూపవచ్చు. డిప్లమాటిక్ చర్యలు అంటే వీసా రద్దు, సరిహద్దు మూసివేత వంటివి రక్షణ చర్యలతో పాటు పౌరులకు, ప్రజల జీవితానికి నేరుగా ప్రభావం చూపవచ్చు..

### భవిష్యత్తు వ్యూహాలు ఎలా ఉండాలి..?

టెర్రో స్ట్రక్చర్‌ను అంతర్జాతీయంగా లేవనెత్తగలగాలి. అంతర్జాతీయంగా పలు వేదికలమీద ఈ వ్యవహారాన్ని నొక్కి వక్కాణించాలి.. టెర్రో బ్యాంకింగ్, ఆర్థిక మార్గాలను ట్రేస్ చేయడం, నిర్మాతలకు ఆర్థిక జరిమానాలు విధించడం చేయాలి.. ఓ " రోడ్ మ్యాప్, సెక్యూరిటీ, డెవలప్‌మెంట్ " వ్యూహం రూపొందించాలి.. కాశ్మీర్‌లో కేవలం భద్రతా చర్యలే కాకుండా ఆర్థిక అభివృద్ధి, టూరిజాన్ని పునరుద్ధరించగలిగే ప్రణాళిక పెట్టాలి. ఇది స్థానిక ప్రజలకు మంచి అవకాశాలు తెస్తుంది, స్థిరత పెరుగుతుంది.పౌర భాగస్వామ్యం అంటే భద్రతా నిర్ణయాలలో స్థానిక ప్రజలను భాగస్వాములను చేయడం.. వారి అభిప్రాయాలను గమనించడం. చేయాలి..

సరిహద్దు ప్రాంతాల్లో మానిటరింగ్ మెకానిజం బలోపేతం చేయాలి.. డ్రోన్లు, శాటిలైట్ వ్యవస్థలు, ఇంటెలిజెన్స్ నెట్‌వర్క్‌ను మెరుగుపర్చాలి. నీటి వనరులను భద్రంగా నిర్వహించడంలో వ్యూహాత్మక నిర్ణయాలు తీసుకోవాలి.. నీటి ఒప్పందాల విరామానికి ప్రత్యామ్నాయ మార్గాలు చూడాలి.

టూరిస్టులకు, స్థానికులకు భద్రతా వ్యవహారాల్లో సరైన అవగాహన కలిగించాలి.. టూరిజం తిరిగి రావాలంటే భద్రత చర్యలు తీసుకోవడం ఎంతో అవసరం.. అంతే కాదు టూరిస్టులకు నమ్మకాన్ని కలిగించ గలగాలి.. ప్రజలకు టెర్రో ప్రమాదాల గురించిన అవగాహన పెంచే విధంగా సామాజిక ప్రచారాలు, కమ్యూనిటీ ప్రోగ్రామ్‌లు నిర్వహించాలి. ఇతర దేశాలతో కలిసి టెర్రిజం ఫైనాన్సింగ్‌ను, ఆస్తి నిల్వలను గుర్తించడం, వాటిని నిరోధించడం చేయగలగాలి...

స్థానిక ప్రజల భద్రత, ప్రభుత్వ చర్యలపై ప్రజల ప్రత్యేక ఆందోళన లాంటి అంశాలను కూడా చూసుకోవాలి. నీటి ఒప్పందాల నిలిపివేత, సరిహద్దు నిబంధనలు మళ్లీ ఎడ్జస్టు చేయడానికి చాలా కష్టపడాల్సి ఉంటుంది.. ప్రస్తుత పరిస్థితి చాలా సీరియస్ గా వుంది.. భారత రక్షణ శాఖ మాత్రం ముమ్మరంగా స్పందిస్తోంది శోధనలు, సర్వేలెన్స్, డిప్లమాటిక్ చర్యలు తీసుకుంటోంది.. బాగానే వుంది.. కానీ దీర్ఘకాలికంగా ఒక "బలమైన వ్యూహాన్ని" ఏర్పరచుకోవడం ఎంతో అవసరం అని సూచిస్తోంది " ఫోరం ఫర్ యాంటీ కరప్షన్ అండ్ హ్యూమన్ రైట్స్ సంస్థ "..



## సీఈఓ ఉదయ్ కుమార్ కు కృతజ్ఞతలు తెలిపిన తెలంగాణ ఆరోగ్య మిత్రాలు

హైదరాబాద్, నవంబర్ 16 (భారత శక్తి): తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న రాజీవ్ ఆరోగ్యశ్రీ హెల్త్ కేర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గత 18 సంవత్సరాలుగా పనిచేస్తున్న ఆరోగ్య మిత్రాలకు ప్రభుత్వ సాధారణ సెలవులతో పాటు, 8 గంటల పని విధానం అమలుకు సంబంధించిన సర్క్యులర్ జారీ చేసినందుకు,ఆరోగ్యశ్రీ హెల్త్ కేర్ ట్రస్ట్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ పి.ఉదయ్ కుమార్ ఐఏఎస్ కి తెలంగాణ ఆరోగ్య మిత్రాల పక్షాన ప్రత్యేక ధన్యవాదాలు, కృతజ్ఞతలు తెలియజేస్తున్నామని ఆరోగ్యశ్రీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు గిరి యాదయ్య తెలియజేశారు. ప్రభుత్వం గతంలో తమకు ఇచ్చిన మిగతా డిమాండ్లను కూడా అతి త్వరలోనే నెరవేరే విధంగా సీఈఓ ఉదయ్ కుమార్ తమకు సహాయం చేయాలని విజ్ఞప్తి చేస్తున్నామని ఆరోగ్యశ్రీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు గిరి.యాదయ్య తెలిపారు.

# బతుకమ్మ కుంట బాగుందా..!

- * వాకర్లతో మాట్లాడిన హైడ్రా కమిషనర్ రంగనాథ్
- * సంతృప్తి వ్యక్తం చేసిన స్థానిక వాకర్లు

హైదరాబాద్, నవంబర్ 16 (భారత శక్తి): హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ బతుకమ్మ కుంటను సందర్శించారు. సాయంత్రం సమయంలో బతుకమ్మ కుంట చుట్టూ వాకర్లతో కలసి నడిచారు. బతుకమ్మ కుంట అభివృద్ధి పట్ల వారి అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. ఎంత మంది వాకింగ్ కు వస్తున్నారు.. ఎలా ఉపయోగపడుతోంది.. ఈ పరిసర ప్రాంత ప్రజలకు కలుగుతున్న ప్రయోజనాలను అడిగి తెలుసుకున్నారు. బతుకమ్మ కుంట ఇప్పుడు మాకందరికీ విహార కేంద్రం అయ్యిందని స్థానికులు కమిషనర్ కు చెప్పారు. బతుకమ్మ కుంట అందుబాటులో రావడంతో ఈ పరిసర ప్రాంతాల రూపురేఖలే మారిపోయాయని... వాకింగ్ చేసుకుంటూ ఆరోగ్యాలు కాపాడుకుంటున్నామని అన్నారు. ఒకప్పుడు దుర్గంధంతో వ్యాధులు భారిన పడే వాళ్ళమని, పిల్లలకు మంచి క్రీడా స్థలంగా మారిందని చెప్పారు. ఈ చెరువును సెప్టెంబర్ 28 న ప్రారంభించామని... చెరువు చుట్టూ వేసిన మొక్కలు పెద్దవైతే మరింత ఆరోగ్యవంతంగా పరిసరాలు మారుతాయని కమిషనర్ చెప్పారు. చెరువును ఇలానే శుభ్రంగా కాపాడుకోడానికి హైడ్రాతో కలసి పని చేయాలని అక్కడి వాకర్లను కమిషనర్ కోరారు. ఈ సందర్భంగా కమిషనర్ రంగనాథ్ తో ఫోటోలు దిగి చాలా మంది పదిలపరచుకున్నారు.చిన్నారులు థాంక్ యూ సార్ అంటూ కమిషనర్ కు కృతజ్ఞతలు తెలిపారు..



Printed, Published and Owned by Kesaram Penta Reddy on behalf of Sri Muktheswara Publications, Printed and Published from Sri Muktheswara Publications, Plot No.31, Road No.5, Mallikarjunanagar Colony, Sagar Ring Road Bairamalguda,Hyderabad - 500079, Telangana. Tel: 040-24044446, Fax: 040-24054446, Cell: 9440265569 Email: bharathasakti@gmail.com, RNI No. APTEL/2006/17880, Editor: Kesaram Penta Reddy.